www.prajapaksham.in

PRAJAPAKSHAM ★

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 28, సంచిక: 207 | సోమవారం | 19-01-2026 | హైదరాబాద్

Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00




అమెరికా అపహరించిన వెనిజులా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణికి సంఘీభంగా సభా ప్రాంగణంలో బ్యానర్

# అరుణకాంతులీనిన ఖమ్మం



ఆకర్షణీయంగా జరిగిన జన సేవాదళ్ కవాతు దృశ్యం



ఖమ్మంలో సిపిఐ నూరేళ్ల ఉత్సవాల ముగింపు సభకు హాజరైన లక్షలాది ప్రజానీకంలో ఒక భాగం

## రక్తతర్పణ చేసిన పార్టీ సిపిఐ

### ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటన

(బొమ్మగాని కిరణ్‌కుమార్)

**ఖమ్మం :** దేశ స్వాతంత్ర్యోద్యమంలో, నవ భారత నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకోవడం ఒక చరిత్ర అని, అందులో భాగమైన ప్రతి కమ్యూనిస్టుకు ఇది గర్వకారణమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. వందేళ్ల ప్రయాణం మహత్తరమైనదని, గొప్ప త్యాగాల భరితమైనదని శ్లాఘించారు.మరో వైపు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని, వలసపాలకులతో చేతులు కలిపిన ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవాలు పూర్తి చేసుకోవడం చరిత్రలో వైరుధ్యమని ఆయన ఎద్దేవా చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంతగా, మరో హిట్లర్‌గా మారారని, ఆయనకు, అమెరికా సామ్రాజ్యవాద శక్తి ముందు లొంగిపోయిన మోదీ ప్రభుత్వం అంతర్జాతీయంగా భారతదేశానికి ఉన్న గౌరవాన్ని కోల్పోయేలా చేస్తోందని మండిపడ్డారు. పాలస్తీనా, వెనిజులా విషయంలో సరైన స్పందన లేకపోవడం, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దన్న ట్రంప్ ఆజ్ఞలకు తలొగ్గటం ఇందుకు నిదర్శనమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో ఆదివారం భారీ బహిరంగ సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా డి.రాజా, ప్రత్యేక అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. క్యూబా, డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా, వియత్నాం, వెనిజులా, పాలస్తీనా, నేపాల్ దేశాల కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు హాజరై, అభినందన సందేశాలను వినిపించారు. వేదికపై సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్, రామకృష్ణ పాండ, అన్నీ రాజా, పల్లా వెంకట్ రెడ్డి, పి.సందోష్‌కుమార్, ప్రకాశ్‌బాబు, కె.రామకృష్ణ, గిరీశ్ శర్మ, కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, కేరళ రాష్ట్ర కార్యదర్శి బినొయ్ విశ్వం, ఎపి రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యులు ఆసీనులయ్యారు.



సిపిఐ వెటరన్ నాయకులు, ఖమ్మం ఉద్యమ నిర్మాత , మాజీ ఎంఎల్‌ఎ పువ్వాడ నాగేశ్వరరావు సభికులకు అభివాదం చేశారు.

**దేశ పరిరక్షణకు మరో పోరాటం**

తొలుత బహిరంగసభను ఉద్దేశించి రాజా ప్రసంగిస్తూ 1925 డిసెంబర్ 26న ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిన నాడు భారత దేశం బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వలస వాదుల పాలనలో మగ్గుతున్నదని, పార్టీ పుట్టుకతోనే భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యం, (స్వాతంత్ర్యం) కావాలని ప్రకటించిన

తరువాయి 2లో

## సమష్టి పోరాటంతోనే ప్రజాస్వామ్యం బతుకుతుంది

### సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశం



(కె.సంతోష్‌కుమార్)

**ఖమ్మం :** ''దేశంలో పేదల హక్కులు, ప్రజాస్వామ్య విలువలు తీవ్ర ప్రమాదంలో ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు అనే తేడా లేకుండా ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ఏకమవ్వాలి. ప్రస్తుత పరిస్థితులు పార్టీ రాజకీయాలకు సమయం కాదు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన సమయం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు సహా ప్రజాస్వామ్యాన్ని నమ్మే శక్తులన్నీ ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమష్టి పోరాటం చేసినప్పుడే ప్రజాస్వామ్యం బతుకుతుంది. ఇందు కోసం మోదీ ఫాసిస్టు ప్రభుత్వాన్ని గద్దె దించాలి. అందుకు మనందరం కలిసి పోరాడాలి'' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారి కంటే బిజెపి ప్రమాదకరమని, నాటి బ్రిటిష్ వారి మాదిరిగా బిజెపి అంటే బ్రిటిష్ జనతా పార్టీగా మారి ప్రజలను విభజించు పాలించు నినాదంతో ముందుకు పోతోందని విమర్శించారు. రానున్న రోజుల్లో బిజెపికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని సిఎం కోరారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వందేళ్లుగా ఎర్రజెండా అడ్డంగా నిలబడి పోరాటం చేస్తోందని, రానున్న వంద సంవత్సరాలు కూడా పేద ప్రజల కోసం, ఆదివాసీల కోసం, తండాల్లో, పల్లెల్లో తుది శ్వాస వరకూ నిరంతరం పోరాడతామని కమ్యూనిస్టులు చేసిన ప్రతిజ్ఞ దేశానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఖమ్మం నగరంలో ఆదివారం జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి పాల్గొని సందేశమిచ్చారు. ఈ వేదిక మీద నుంచి ఈ రాష్ట్రమే కాదు దేశాన్ని పట్టి పీడిస్తున్న మతతత్వ శక్తులను ఓడించడానికి మనందరం ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణమని, నిజమైన స్వేచ్ఛ అంటే దోపిడీ లేని సమాజం అని, కమ్యూనిస్టులు కలగన్న స్వేచ్ఛ అని సిఎం అన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ చేయనున్న ప్రతీ పోరాటానికి సిపిఐ శ్రేణులు సహకరించాలని

తరువాయి 2లో

## అన్ని జెండాలూ ఒకే జెండా అవ్వాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

'అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏదో ఒక రోజు ఒక్క చోటకు రావాలి. ఒక్క జెండా కిందికి రావాలి. అంతిమంగా అన్ని జెండాలు కలిసి ఒక్క జెండా అవ్వాలి' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. ముందు సిపిఐ, సిపిఐ(ఎం) కలవాల్సిన అవసరం ఉందని, ఈ రెండు పార్టీలు కలిసిన తర్వాత మిగిలిన అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా ఢిల్లీలోని ఎర్రకోట పైన ఎర్రజెండా ఎగిరే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మనమంతా ఒక్కసారి పునరాలోచన చేసుకుందామని, అందరం కలిసి ఆలోచన చేస్తే చిన్న చిన్న అభిప్రాయ భేదాలు, సిద్ధాంత వైరుద్ధ్యాలు ఉన్నా పరిష్కారం అవుతూనే వచ్చాయని గుర్తు చేశారు. మావోయిస్టు సోదరులు భిన్నమైన ఎజెండాతో ఉన్నప్పటికీ వారు కూడా ఆలోచన చేయాలని కూనంనేని సాంబశివరావు బహిరంగ సభ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. అప్పటివరకు ఐక్యత కోసం పోరాటం కొనసాగిస్తునే




ఉంటామని తెలిపారు. ఆ ఐక్యత లేకపోతే ఇవాళా ఆపరేషన కగార్ అనో, ఇంకో పేరుతోనో నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మానవ హననానికి పాల్పడుతూనే ఉంటుందని ఆయన హెచ్చరించారు. దీనికి పరిష్కారం ఒక్కటేనని,

తరువాయి 2లో

## కదం తొక్కిన కామ్రేడ్స్

- ఎర్రబారిన ఖమ్మం
- నభూతో న భవిష్యత్‌లా జనసేవాదళ్ కవాత్
- ఆకట్టుకున్న కళారూపాలు

(ఏనుగు వెంకటేశ్వరరావు)

**ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మంలో కామ్రేడ్స్ కదం తొక్కారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలతో ఖమ్మం పుర వీధులు కిటకిటలాడాయి. ప్రతి ఒక్కరూ అరుణ పతాకాన్ని చేతబూని ఎర్రని వస్త్రాలు ధరించి ఖమ్మంకు తరలి రావడంతో ఖమ్మం ఎర్రబారింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే సుదూర ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు ఖమ్మం చేరుకున్నారు. నాగపూర్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి కూడా పార్టీ కార్యకర్తలు సభకు హాజరయ్యారు. ఖమ్మం నగరంలోని ప్రధాన



**మేము సైతం..** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా కవాతులో పాల్గొన్న బాలసంఘం సభ్యులు

రహదారులన్నీ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల రాకతో దిగ్బంధించబడ్డాయి. ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే కనిపించాయి. ఖమ్మం నగరంలోకి చేరుకునేందుకు ట్రాఫిక్ జామ్ కావడంతో

తరువాయి 2లో

## పొట్లపూర్ ఎత్తిపోతలకు కేబినెట్ ఆమోదం

03

**ములుగు:** ములుగు జిల్లాకు సాగునీరు అందించే పొట్లపూర్ ఎత్తిపోతల పథకానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ వెలుపల కేబినెట్ సమావేశం జరగడం ఇదే మొదటిసారి. సుమారు రెండు గంటలపాటు సాగిన ఈ సమావేశంలో పలుకీలక అంశాలపై చర్చ జరిగింది. అనంతరం మేడారం ప్రధాన ద్వారం వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రివర్గ సహచరులతో కలిసి పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు 143 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్టు ప్రకటించారు. జిల్లాకు సాగునీరు అందించాలన్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాగా, మున్సిపల్ ఎన్నికలు, జిల్లాల పునర్విభజన వంటి కీలక అంశాలపై కేబినెట్‌లో చర్చ జరిగింది. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. కాగా, మేడారం సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. రామప్ప చెరువు నుంచి లక్నవరం పైప్‌లైన్ ద్వారా మేడారానికి నీటి సరఫరా చేయనున్నట్టు ప్రకటించారు.




ఖమ్మంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభావేదిక నుండి అభివాదం చేస్తున్న సిపిఐ నాయకులు, అతిథులు, విదేశీ సౌహార్ద్ర ప్రతినిధులు



## పోర్చుగల్‌లో త్రిముఖ పోటీ

**లిస్బన్ :** యూరప్ నైరుతీప్రాంతదేశం పోర్చుగల్‌లో అధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. పెద్దసంఖ్యలో ప్రజలు పోలింగ్ బూత్‌లవద్ద క్యూలు కట్టి ఓట్లు వేశారు. ముగ్గురు అభ్యర్థులమధ్య ప్రధానంగా పోటీ జరుగుతోంది. సోషల్ డెమోక్రటిక్‌పార్టీ (పిఎస్‌డి) నాయకుడు మార్క్సెస్ మెండెస్, సోషలిస్టు పార్టీ నాయకుడు ఆంటోనియో జోస్ సెగురో, మితవాద పార్టీ నాయకుడు ఆండ్రే వెంచురా అధ్యక్ష పదవికి ప్రధానంగా పోటీలో ఉండగా మొత్తం 45 మంది అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. రెండో విడత ఎన్నికలకు ఎక్కువగా అవకాశాలున్నాయి. ఈ రెండు విడతల్లోనూ చెగా పార్టీ నాయకుడు వెంచురా ఖచ్చితంగా పోటీలో ఉండే అవకాశం ఉంది. దేశాధ్యక్షుడికి తాత్కాలికమైన అధికారాలే ఉన్నప్పటికీ కీలకమైన కష్టకాలంలో అధ్యక్షుడిదే పైచేయిగా ఉంటుంది.

## గత ఏడాది శ్రీలంక పర్యాటకుల్లో భారత్‌దే అగ్రస్థానం


**కొలంబో :** గత ఏడాది శ్రీలంక దేశాన్ని సందర్శించిన పర్యాటకుల్లో అగ్రస్థానం భారతీయులకే దక్కింది. భారతదేశం నుండి 5,31,511 మంది పర్యాటకులు శ్రీలంకలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. గత ఏడాది 20.30 లక్షల మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. ఏటికేడాది పర్యాటకుల అభివృద్ధిని గమనిస్తే 15 శాతం పెరిగింది. భారత్ తర్వాత బ్రిటన్ దేశీయులు రెండోస్థానంలో ఉన్నారు. మొత్తంగా చూసినప్పుడు డిసెంబరునెలలో అత్యధికంగా 3,58,928 మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. యూరప్, ఆసియా పసిఫిక్ ప్రాంతాల నుండి 92.67 శాతం మంది శ్రీలంకను సందర్శించి తమ ఆధిక్యత ప్రదర్శించారు. ఒక్క యూరప్ నుండే 51.3 శాతం మంది వెళ్ళారు. కాగా ఈ కొత్త సంవత్సరం 2026లో ఇప్పటివరకూ మొత్తం 1,31,898 మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. రోజువారీగా చూసినప్పుడు జనవరి 15వ తేదీన అత్యధికంగా 10,483 మంది పర్యాటకులు శ్రీలంకలో పర్యటించారు. అధికారులు ఈ సమాచారాన్ని విడుదల చేశారు. ఈ కొత్త సంవత్సరంలో భారత్ నుండి 23,786 మంది, రష్యా నుండి 14,785 మంది పర్యాటకులు, బ్రిటన్ నుండి 12,166 మంది, జర్మనీ నుండి 9,260 మంది శ్రీలంకను సందర్శించారు.

## ఖమేనీపై దాడి పూర్తి యుద్ధం ప్రకటనే ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడు హెచ్చరిక

**టెహ్రాన్ :** ఇరాన్ సర్వాధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీపై ఏ విధమైన దాడి చేసినా అది ఇరాన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రకటించినట్లే అవుతుందని ఆ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలకు పెజెష్కియన్ పైవిధంగా సమాధానం చెప్పారు. ''మా దేశ గొప్ప నాయకుడిపై దాడి చేయడం పూర్తిస్థాయి యుద్ధం ప్రకటించడంతో సమానం'' అని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ''ఖమేనీ వ్యాధిగ్రస్తుడైన నాయకుడు, ఇక ఇరాన్ ప్రత్యామ్నాయ నాయకుణ్ణి చూసుకోవడానికి ఇదే సరైన సమయం'' అని పొలిటికోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ అన్నారు. ఇరాన్‌లో ఖమేనీ పాలనను అంతం చేయాలని ట్రంప్ చెప్పడం ఇదే మొదటిసారి.

# ట్రంప్ సుంకాలు అతిపెద్ద తప్పిదం

### యూరప్ దేశాల ఆగ్రహం



**బ్రస్సెల్స్ :** గ్రీన్‌లాండ్ స్వాధీనాన్ని వ్యతిరేకించినవారిపై ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి 10 శాతం అదరనె సుంకాలు అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించడంపై యూరప్ దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇలా సుంకాలు విధించడం అతిపెద్ద తప్పిదమని ఇటలీ ప్రధాన మంత్రి మెలోనీ విమర్శించారు. ట్రంప్ సుంకాలు ఎంతమాత్రం సమ్మతింప సాధ్యం కాదని ఫ్రాన్స్ ప్రధానమంత్రి మేక్రాన్ విమర్శించారు. ఈ విషయంలో తదుపరి చర్యలపై యూరోపియన్ మిత్రులతో ఆయన చర్చలు జరుపుతున్నారని పారిస్‌లోని అధ్యక్ష కార్యాలయం తెలిపింది. ఈ సుంకాలు బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్రభావం చూపిస్తాయని ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి క్రిస్‌వర్త్ (యుకె) హెచ్చరించారు. ఈ సుంకాల వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని ఫిన్లాండ్ ప్రధానమంత్రి పెట్టేరీ ఓర్పో అన్నారు. దీనివల్ల యూరప్–అమెరికా రెండూ నష్టపోతాయన్నారు. సమస్యలను కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకుందామన్నారు.

దిగుమతి సుంకాలు పెంచడంవల్ల సరుకు విలువ అమాంతం పెరిగిపోతుంది. ఈ సుంకాలవల్ల ఉదాహరణకు 10 డాలర్లు విలువైన ఒక వస్తువు ఖరీదు 11 డాలర్లకు పెరుగుతుంది. విదేశీ వస్తువులు దిగుమతి చేసుకునే కంపెనీలే ప్రభుత్వానికి పన్నులు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. తన సొంత మిత్రులతోనే ట్రంప్ ఆర్థిక యుద్ధం చేస్తున్నారని అంతర్జాతీయ పత్రికలు వ్యాఖ్యానాలు రాశాయి. బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్‌తో ఇప్పుడు ట్రంప్ సంబంధాలు కూడా మరింత సమస్యల్లో పడ్డాయని రాశాయి. రష్యా, చైనాలను బెదిరించి వాటి నోరు మూయించేందుకు ఏర్పాటు చేసిన వ్యూహాత్మక నాటో కూటమిలో చిచ్చు రేపిన గ్రీన్‌లాండ్ సమస్యపై ఒకవైపు అక్కడి ప్రజలు నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తుండగా, యూరోపియన్ యూనియన్ దేశాల దౌత్యవేత్తలు ట్రంప్ వైఖరిపై చర్చించేందుకు ఆదివారం పొద్దుపోయాక అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎనిమిది యూరోపియన్ యూనియన్ దేశాలపై పది శాతం సుంకాలు విధించడాన్ని ఆ దేశాలు తీవ్రంగా ఖండించాయి. డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ దేశాలపై దిగుమతి సుంకాలు పెంచుతామని ట్రంప్ బెదిరించారు. గ్రీన్‌లాండ్ ప్రజలకు, గ్రీన్‌లాండ్ రక్షణకు యూరప్ దేశాలు తమ నిబద్ధతను ప్రకటించి డెన్మార్క్‌కు మద్దతుగా సైన్యాన్ని మోహరించేందుకు కూడా సిద్ధం రావడంతో ఈ ఒక్క వివాదమే అనేక వివాదాలకు ఆజ్యంపోసే ప్రమాదకర సమస్యగా మారుతున్నది.

**ట్రంప్‌పై యూరప్ ఒత్తిడి ప్రభావం!**

చైనా, రష్యాలను బెదిరించి అదుపులో పెట్టే లక్ష్యంగా ఏర్పాటు చేసిన నాటో కూటమి దేశాలు తమ తమ భూభాగాలలో ఉన్న సైనిక స్థావరాలను తొలగిస్తామని హెచ్చరించడం ద్వారా గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్‌పై ప్రభావం చూపించే అవకాశాలు ఉంటాయని ''ద ఎకనామిస్ట్'' విశ్లేషణను టాస్ వార్తా సంస్థ ప్రచురించింది. మొదట ఒకమాట, తర్వాత మరోమాట మార్చే ట్రంప్ ఈ ఒత్తిడికి తలొగ్గే అవకాశాలుంటాయని పేర్కొంది.

యూరోపియన్ సైనిక స్థావరాల అసరా, అండదండలు లేకుండా అమెరికా సైన్యం ఆఫ్రికాలోగానీ, పశ్చిమ ఆసియాలోగానీ తన ప్రభావం చూపించలేదని 'ద ఎకనామిస్ట్' మ్యాగజైన్ ప్రకటించింది. అమెరికాతో యూరోపియన్ యూనియన్ దేశాలకు సంఘర్షణ జరిగే అవకాశం లేదని, యూరప్‌దేశాలకు తూర్పు వైపు నుండి బెదిరింపు పేరుతో సైనిక అవసరాలు, సైనిక వ్యయం విపరీతంగా పెరుగుతోందని, పైగా అమెరికా ఆయుధాలు, ఆమెరికా సైన్యం, అమెరికా రక్షణ పరిశ్రమల అవసరం కూడా యూరోపియన్ యూనియన్‌కు చాలా చాలా అవసరం ఉందని మ్యాగజైన్ విశ్లేషించింది.

## అల్లర్లలో 5వేల మంది మృతి
### ఇరాన్ అధికారి వెల్లడి



**టెహ్రాన్ :** ఇరాన్‌లో చెలరేగిన హింసాత్మక అల్లర్లలో ఇప్పటివరకూ సేకరించిన గణాంకాల ప్రకారం 5000 మంది మరణించినట్లు అధికారి ఒకరు రాయిటర్స్ వార్తా సంస్థకు ఆదివారం చెప్పారు. మృతుల్లో 500 మంది భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని ఆయన చెప్పారు. టెర్రరిస్టులు, సాయుధులైన అల్లరిమూకలు అమాయకులైన ఇరాన్ ప్రజలను హత్యచేశారన్నారు. ఇరాన్ వాయువ్య ప్రాంతంలో కుర్దిష్‌లు అత్యధికంగా ఉండే ప్రాంతంలో ఎక్కువమంది హింసాత్మక ఘర్షణల్లో బలయ్యారని ఈ ప్రాంతంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఇరాన్ వాయువ్య ప్రాంతంలో కుర్దిష్‌లు చాలా క్రియాశీలంగా వ్యవహరిస్తారు. ఇజ్రాయెల్ దేశం జోక్యం వల్లే ఇరాన్‌లో అల్లర్లు చెలరేగుతున్నాయని ఆయన ఆరోపించారు. దేశంలో విదేశీయులు జోక్యం చేసుకుంటున్నారని ఇరాన్ ప్రభుత్వం తరచు ఆరోపణలు చేస్తోంది. అమెరికా కేంద్రంగా పనిచేసే హెచ్ఆర్ఎఎన్ఎ సంస్థ ప్రకారం ఇరాన్‌లో ఇప్పటివరకూ 24,000 మంది ప్రదర్శకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. 3,800 మంది ఇప్పటికే మరణించారనీ, మరో 4,382 కేసులను పరిశీలించి మరణాల సంఖ్యను ధృవీకరిస్తామని హెచ్ఆర్ఎఎన్ఎ సంస్థ ప్రకటించింది.



## మిన్నెపొలిస్‌లో అల్లర్ల అణచివేతకు బలగాలు సిద్ధం

**వాషింగ్టన్ :** అమెరికా మిన్నెసోటాలో గడచిన 11 రోజులుగా అల్లర్లు ఆగడం లేదు. అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ట్రంప్ పాలనాయంత్రాంగం అదనంగా 1500 మంది ఆర్మీ పారాట్రూపర్లను తరలించేందుకు సన్నాహాలు చేసింది. ఐతే వారిని తక్షణం తరలించేందుకు ట్రంప్ ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. మిన్నెపొలిస్‌లో జనవరి 7వ తేదీన స్థానిక మహిళ రెనీగుడ్ (37) అనే మహిళను వలస నియంత్రణ ఐసిఇ అధికారి ఒకరు అతి సమీపం నుండి అమానుషంగా కాల్చి చంపిన తర్వాత మిన్నెసోటాలో అల్లర్లు మొదలయ్యాయి. ఈ ప్రాంతం నుండి ఫెడరల్ పోలీసులను తరలించాలని, వారి పెత్తనాన్ని సహించేది లేదని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానాన్ని కూడా ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడి అల్లర్లు అణచివేసేందుకు 1500 మంది పారాట్రూపర్లను ట్రంప్ సిద్ధం చేశారు. మిన్నెపొలిస్ నగర వీధుల్లో గడచిన 11 రోజులుగా దాదాపు యుద్ధ వాతావరణం నెలకుని ఉంది. హింసాత్మక అల్లర్లు చల్లారడంలేదు. దీంతో ఆర్మీని మోహరించేందుకు ట్రంప్ ఆలోచన చేశారు.



## సెర్బియాలో వేలాదిమంది భారీ ప్రదర్శన

**నోవిసాద్ :** సెర్బియాలో సంస్కరణలు చేపట్టాలని, తక్షణం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఏడాదిపైగా కొనసాగిన అల్లర్లు, ప్రదర్శనలు కొత్త సంవత్సరంలో కూడా కొనసాగుతున్నాయి. దేశాధ్యక్షుడు అలెక్‌సాండర్ ఉసి పరిపాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని మరో దశ ముందుకు తీసుకువెళతామని, దేశంలో సమూల సంస్కరణలు చేపట్టాలని కోరుతూ సెర్బియా యూనివర్సిటీ విద్యార్థులు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. రాజధాని నోవిసాద్‌లో వేలాదిమందితో ప్రదర్శన జరిగింది. దేశంలో పాలకులే విపరీతమైన అవినీతికి పాల్పడుతున్నారని విద్యార్థులు నినాదాలు చేశారు. ఇదే నినాదంతో గడచిన నవంబరులో కూడా సెర్బియాలో ఉద్ధృతంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ నగరంలో నవంబరులో జరిగిన అల్లర్లలో 16 మంది మరణించారు. దీంతో దేశవ్యాప్తంగా ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చింది. దేశంలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని ప్రదర్శకులు కోరుతుండగా అధ్యక్షుడు ఉసి అందుకు తిరస్కరించారు. దేశంలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ తమ నినాదానికి మద్దతుగా 4,00,000 మంది సంతకాలు విద్యార్థులు సేకరించారు. ఈనెల 27వ తేదీన బెల్గ్రేడ్‌లో భారీ నిరసన ప్రదర్శన చేపట్టేందుకు విద్యార్థులు ప్రణాళిక చేశారు.

# రక్తతర్పణ చేసిన పార్టీ సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ సిపిఐ అని అన్నారు. భారత దేశం స్వాతంత్ర్యం కోసం, దాని పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు పోరాడారని, స్వాతంత్ర్య అనంతరం కూడా నవ భారత కోసం కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టులు కోరారని, ప్రధాని నెహ్రూ అందుకు అంగీకరించారని, పిఎస్‌యులతో పాటు పంచవర్ష ప్రణాళికను కూడా అమలు చేశారని అన్నారు. ఇప్పుడు మోదీ ఆశ్రిత పెట్టుబడిదారులకు లొంగిపోయారని, ఇప్పుడు మరోసారి కమ్యూనిస్టులుగా దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని, ఇందుకు కలిసొచ్చే వారితో కలిసి పోరాడాలి అని రాజా పిలుపునిచ్చారు.

**దేశ స్వాతంత్ర్యంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటి?**

భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో అగ్రభాగాన నిలిచిన రెండు పార్టీలు కాంగ్రెస్, సిపిఐ వందేళ్ళు పూర్తిచేసుకున్నాయని రాజా అన్నారు. 1885లో ఏర్పడిన భారత జాతీయ కాంగ్రెస్ 140 ఏళ్ళు, సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ సైతం వందేళ్ల ఉత్సవాలు నిర్వహించుకోవడం చరిత్రలోని వైరుధ్యమని వ్యాఖ్యానించారు. ''దేశ చరిత్రలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటని నేను ప్రశ్నిస్తున్నాను. స్వాతంత్ర్యపోరాటంలో మీరు పాల్గొన్నారా? అని ఆర్ఎస్ఎస్– బిజెపి నాయకులను ప్రశ్నించండి. వలస పాలకులతో చేతులు కలిపి వారు పని చేశారు. ఆర్ఎస్ఎస్ వారు ఏనాడూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదు'' అని రాజా విమర్శించారు. వలస పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించినందుకు సిపిఐ, కాంగ్రెస్‌లు గర్వపడుతున్నాయన్నారు.

కమ్యూనిస్టులు స్వాతంత్ర్యానంతరం కూడా ప్రజల పక్షాన పోరాటాలు చేశారని, కేవలం భారతదేశ విముక్తి పోరాటమే కాకుండా ప్రపంచంలో ఎక్కడ విముక్తి పోరాటాలు జరిగినా అండగా నిలచారన్నారు. మనం కేవలం కమ్యూనిస్టులమే కాదని, అంతర్జాతీయవాదులమని స్పష్టం చేశారు.

**ప్రపంచ దేశాలనే బెదిరిస్తున్న ట్రంప్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక నియంతగా మారారని, మరో హిట్లర్ అయ్యారని రాజా విమర్శించారు. భారతదేశాన్ని ఆయన నియంత్రిస్తే కమ్యూనిస్టులుగా ఊరుకోబోమని రాజా సవాలు చేశారు. ట్రంప్ వెనిజులాపై యద్ధం ప్రకటించారని, ఎన్నికైన, సార్వభౌమ దేశ అధ్యక్షుడు, ఆయన సతీమణిని అపహరించుకొని వెళ్ళారని మండిపడ్డారు. తరువాత మెక్సికో, కొలంబియా, క్యూబా దేశాల సంగతి చూస్తానని బెదిరిస్తున్నారని అన్నారు. వెనిజులా పరిస్థితులపై భారతదేశం మాట్లాడకపోవడం దారుణమన్నారు.

**మోదీ ప్రభుత్వం విఫలం :** మోదీ తాను మానవమాత్రుడను కాదని అంటుంటారని, ఆయన 56 ఇంచుల ఛాతి ఉందని అంటారని, మరి రష్యా నుంచి భారతదేశం చమురు కొనవద్దని ట్రంప్ శాసిస్తుంటే మోదీ ఎందుకు తలవంచారని రాజా మండిపడ్డారు.అలీనోద్యమ స్థాపకులలో ఒకటిగా భారతదేశానికి గతంలో అంతర్జాతీయంగా మంచి గౌరవం, ప్రపంచ దేశాలలో గుర్తింపు ఉండేదని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక భారతదేశానికి అంతర్జాతీయ గౌరవం పోయిందని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాద శక్తికి లొంగిపోవద్దని మోదీని డిమాండ్ చేశారు. ఇలాగే కొనసాగితే మోదీకి అధికారంలో కొనసాగే హక్కు లేదని, మోదీ ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి దింపేంత వరకు పోరాడుతామన్నారు. ఇష్టానుసారం వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

**పాలస్తీనా విషయంలో ట్రంప్‌కు లొంగిపోయారు :** పాలస్తీనాలో ప్రజలు ఊహకందని బాధలు, కష్టాల పాలవుతున్నారని, మహిళలు, చిన్నారులను ఇజ్రాయెల్ బలగాలు ఊచకోత కోస్తున్నాయని రాజా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు ట్రంప్ మద్దతు ఇస్తున్నాడని, పాలస్తీనా సమస్య పరిష్కారానికి రెండు దేశాల విధానానికి అనుకూలంగా ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాన్ని, యుఎన్ చార్టర్‌ను, అంతర్జాతీయ చట్టాలను తృణీకరిస్తున్నారని అన్నారు. వలసపాలన కాలంలోనే పాలస్తీనాకు గాంధీ అండగా నిలబడ్డారని, ఆంగ్లేయులకు బ్రిటీష్ ఎలా చెందుతుందో ఫ్రెంచ్ వారికి ఫ్రాన్స్ ఎలాగో, ఆరబ్ మాట్లాడే వారికి పాలస్తీనా చెందుతుందని ఆనాడే అన్నారని గుర్తు ఏశారు. మన దేశానికి పాలస్తీనా విమోచన నాయకుడు యాసర్ అరాఫత్ ఎంతో సన్నిహింగా ఉండేవారని, భారత ప్రభుత్వం, ప్రజలు సంఘీభావంగా ఉండేవారని, ఇప్పుడు మోదీ ప్రభుత్వ విధానం మారిపోయిందన్నారు.

సభకు సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు స్వాగతం పలుకగా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రావుల వెంకయ్య, అక్కినేని వనజ, తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా, కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కలవేన శంకర్, బాలనర్సింహా, వి.ఎస్.బోస్, కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా, తదితరులు వేదికపై ఉన్నారు. చివర్లో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేశ్ వందన సమర్పణ చేశారు.

## ప్రజాస్వామ్యం బతుకుతుంది

(మొదటి పేజీ తరువాయి)

కోరారు.

జాతీయ ఉపాధి హామీ పథకం వల్ల గ్రామీణ పేదలకు ఉపాధి లభించిందని, అది గ్రామీణ పేదలకు జీవనాధారమని, అయితే ప్రధాని మోదీ ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసి గ్రామాల నుంచి రైతులు, రైతు కూలీలు మళ్లీ పట్టణాలకు వలసలు పెరిగే పరిస్థితి తెచ్చిందని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. వలసల తో పేదలు మళ్లీ వెట్టిచాకిరి, దోపిడీకి గురవుతారని సిఎం హెచ్చరించారు. గత ఎన్నికల్లో బిజెపి 400 సీట్లు అడగడం వెనుక రాజ్యాంగాన్ని మార్చాలనే ఉద్దేశం ఉందని, రిజర్వేషన్లు రద్దు చేసే ప్రమాదం ఉందనే విషయాన్ని దేశవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేసి బిజెపిని 240 సీట్లకు పరిమితం చేసిన ఘనత కాంగ్రెస్, కమ్యూనిస్టులు, రాహుల్ గాంధీ నాయకత్వానిదేనని అన్నారు. ఆధార్, ఎస్ఐఆర్ పేరుతో పేదల ఓటు హక్కును తొలగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీ పేదల చేతుల్లో ఓటు అనే ఆయుధం పెట్టారని, అదే ఆయుధాన్ని లాక్కోవడానికి బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. ఓటు హక్కు పోతే రేషన్, ఇల్లు, పెన్షన్, అన్నిసంక్షేమ పథకాలు పోతాయని హెచ్చరించారు. అడవుల్లో నివసించే ఆదివాసీలు ఆధారాలు ఎక్కడి నుంచి తెచ్చుకుంటారని సిఎం ప్రశ్నించారు.

**కాంగ్రెస్, కమ్యూనిస్టుల పోరాటాలతోనే...**

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసికట్టుగా పోరాడితేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తు చేశారు. పేదలు, ఆదివాసీలు, గిరిజనులు, రైతులు, రైతు కూలీలు, కార్మిక వర్గాల హక్కుల కోసం కమ్యూనిస్టులు సాగించిన వందేళ్ల పోరాట చరిత్ర దేశానికి స్వేచ్ఛ తీసుకొచ్చిందని సిఎం గుర్తు చేశారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో కలిసి కమ్యూనిస్టులు చేసిన పోరాటాలే భారత స్వాతంత్ర్యానికి పునాదులని అన్నారు. దున్నేవాడికే భూమి అనే నినాదంతో జరిగిన రైతాంగ ఉద్యమాల ఫలితంగానే గరిష్ట పరిమితి చట్టాలు వచ్చాయని, ఎనిమిది గంటల పని చట్టం, కనీస మద్దతు ధర, కార్మిక చట్టాలు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే అమలయ్యాయని సిఎం తెలిపారు.

**ఖమ్మం జిల్లాలో బిజెపికి స్థానం లేదు :**

ఖమ్మం జిల్లాలో బిజెపికి స్థానం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు కలిసి వచ్చినా జిల్లాలో ఇద్దరు సర్పంచులను కూడా గెలిపిం చలేరని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో బిజెపికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు.

**సాయుధ పోరాటంతోనే హైదరాబాద్ రాష్ట్ర ఏర్పాటుకు బీజం పడింది**

కమ్యూనిస్టులు నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే నిజాం నిరంకుశ పాలనను కూలదోసి హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటుకు బీజం పడిందని, నేటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది వేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ''పరిస్థితులు ఎలా ఉన్నా.. ఎంత కఠినంగా ఉన్నా.. ఏనాడూ ఎర్రజెండా తలవంచదు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా నిర్విరామ పోరాటం సాగిస్తోంది. రజాకార్లకు, నిజాంకు వ్యతిరేకంగా సుదీర్ఘ సాయుధ పోరాటం సాగించారు. సాయుధ పోరాటంలో నాలుగు వేలమంది కమ్యూనిస్టులు ప్రాణాలుకోల్పోయారు. కమ్యూనిస్టు వీరుల త్యాగాలతోనే నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తికి బీజం పడింది'' అని రేవంత్ రెడ్డి అన్నారు.




## కదం తొక్కిన కామ్రేడ్స్

(మొదటి పేజీ తరువాయి)

కిలో మీటర్ల కొద్ది నడిచి కార్యకర్తలు ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు. వందలాది వాహనాల్లో పార్టీ కార్యకర్తలు తరలి రావడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో యువత తరలి రావడం విశేషం. జనసేవాదళ్ కార్యకర్తలే కాకుండా బహిరంగ సభకు వచ్చిన వారిలో యువత ఎక్కువగా ఉన్నారు. క్రమశిక్షణగా మూడు కిలో మీటర్ల మేర నడిచి బహిరంగ సభా స్థలికి చేరుకున్న యువత నాయకుల ఉపన్యాసాలకు, ప్రజానాట్య మండలి పాటలకు అలిసి పోకుండా కేరింతలు కొట్టారు. వందేమాతరం శ్రీనివాస్ అలపించిన ఎర్రజెండా ఎర్రజెండా ఎన్నియాల్లో పాటకు యువత ఊగిపోయింది. పూనకం వచ్చినట్లుగా బహిరంగ సభా స్థలి మొత్తం అరుణ పతాకాలను ఊపుతూ ఒక సరికొత్త వాతావరణాన్ని సృష్టించారు. యువత ఊపు చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఒక్కింత ఆశ్చర్య పోయారు. యువత హాజరైన తీరు చూస్తుంటే వందేళ్లు కాదు మరో వందేళ్లయినా సమ సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం కోసం పోరాడతామన్న భావన స్ఫురిచింది. వందేళ్ల ఉత్సవాలు చూడాలని వందల కిలో మీటర్ల మేర ప్రయాణించి 70 నుంచి 80ఏళ్లు పైబడిన వృద్దులు, గతంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసినా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నాయకత్వం సభకు హాజరయ్యారు.

**మూడు ప్రదర్శనలు – వేల మంది జనం :**

బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రదర్శనలు నిర్వహించారు. మొదటి ప్రదర్శన పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జనసేవాదళ్ కార్యకర్తలు ఖమ్మం పురవీధుల్లో కదం తొక్కారు. వరుసకు నలుగురు చొప్పున నిలబడిన ప్రదర్శన రెండు కిలో మీటర్ల మేర ఉండడంతో ప్రదర్శనను పెద్ద సంఖ్యలో నగర పౌరులు తిలకించారు. ముఖ్యంగా యువ మహిళల కవాతు ఆకట్టుకుంది. చిన్నారులు కదం తొక్కుతూ లెఫ్ట్ రైట్ అంటూ నడుస్తూ ఉత్తేజాన్ని ఇచ్చారు. పదేళ్ల లోపు బాలలు సైతం ప్రదర్శనలో పాల్గొని భవిష్యత్తు తరం మాదేనంటూ మరో వందేళ్లయినా కమ్యూనిస్టు పార్టీకి ఢోకా లేదని తమ కవాతుతో నిరూపించారు. జనసేవాదళ్ కార్యకర్తల కవాతుకు సిపిఐ అగ్ర నేతలు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, గుజ్జుల ఈశ్వరయ్య, చాడ వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం, బాగం హేమంతరావు తదితరులు నేతృత్వం వహించారు. జనసేవాదళ్ కార్యకర్తల తర్వాత సింగరేణి కార్మికులు, యువ మహిళలు, పర్ష పద్మ నేతృత్వంలో నాగళ్లు చేతబూనిన రైతులు కోయ, లంబాడ, జానపద నృత్య కళాకారులు, వందలాది మంది డప్పు కళాకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. బతుకమ్మలతో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆ తర్వాత న్యాయవాదులు, వైద్యులు, యువజన, విద్యార్థి సమాఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల కాలంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని రీతిలో ప్రదర్శన సాగింది. ఖమ్మం నయాబజర్ కళాశాల నుండి మరో ప్రదర్శన ప్రారంభమైంది. నయాబజార్ కళాశాల నుండి ప్రారంభమైన ప్రదర్శన మయూరిసెంటర్, జెడ్పి సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. ఈ ప్రదర్శనకు రాష్ట్ర సహాయ కార్యదర్శి తకెళ్లపల్లి శ్రీనివాసరావు, బోస్, కె. శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నేతృత్వం వహించారు. మూడవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైంది. శ్రీశ్రీ విగ్రహం నుంచి రోటరీ నగర్, మమత రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. జాతీయ సమితి సభ్యులు ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు నేతృత్వం వహించారు.

**ఉత్తేజాన్ని ఇచ్చిన సభ :**

సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ పార్టీకి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. భవిష్యత్తు పోరాటాలకు ఊపునిచ్చింది. వందేళ్లయినా నవ యవ్వనిలా మరో పోరాటానికి సిద్ధం కండి అంటూ కార్యకర్తలను పురిగోల్పే రీతిలో సభ జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలు నేతల ఉపన్యాసాలకు తగు రీతిలో స్పందించారు. సిపిఐ నేతల ఉపన్యాసాలు యువతకు దిశా నిర్దేశం చేశాయి. దశాబ్ద కాలంలో ఖమ్మంలో ఇంతటి బహిరంగ సభ జరగకపోవడం, సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అతి పెద్ద బహిరంగ సభ జరగడం నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. ఇతర పార్టీల నేతలు సైతం అబ్బురపడే రీతిలో జన కదలికలు కనిపించాయి.

## అన్ని జెండాలు ఒక్క జెండా అవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

కమ్యూనిస్టులారా ఒక్కటి కండి అని ప్రజలందరూ కోరుకుంటున్నారని, అన్ని ఎర్రజెండాలు కలిపి ఒక్క జెండాగా రావాలని, కమ్యూనిస్టులు ఇలాగే విడిపోయి ఉంటే దేశానికి మంచిదికాదని, మంచి జరగాలంటే కమ్యూనిస్టులంతా ఒక తాటి మీదకు రావాలని పిలుపునిస్తున్నారన్నారు. 'ప్రజల కోరికను అంగీకరిద్దాం. విడిపోయిన మనమంతా ఐక్యమవుదాం' అని కూనంనేని సాంబశివరావు కోరారు.

**కమ్యూనిజం ఎక్కడ ఉందనే వారికి బహిరంగసభే సమాధానం**

కమ్యూనిస్టు పార్టీ ఎక్కడ ఉందనే వారికి సిపిఐ బహిరంగ సభే సమాధానమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. 100 ఏళ్ల ఉత్సవాలను వీర తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది ఆశువులు బాసిన తెలంగాణలో, అందులో ప్రధానమైన పాత్ర పోషించిన ఖమ్మంలో జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీకి మరణం లేదని, ఈ జెండాను మోసవాడు నేలకొరిగే లోపే మరోకరు జెండాను ఎత్తేందుకు ఎప్పుడూ సిద్దంగా ఉంటారని ఇందుకు ఈ బహిరంగ సభకు తరలివచ్చిన చిన్నారుల మొదలు నవయవత సాక్ష్యమన్నారు. మనిషి కోసం పుట్టిన సిద్దాంతం కమ్యూనిజమని, పేదవాడి కంచంలో మెతుకు కమ్యూనిస్టు పార్టీ అని, నిరుపేదల ఆశా జ్యోతి ఎర్రజెండా అన్నారు.

మనిషి ఉన్నతం వరకు ఎర్రజెండాకు మరణం లేదని, నిజమైన దేశ భక్తులు కమ్యూనిస్టులేనని సాంబశివరావు ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ ప్రజాస్వామిక పార్టీ**


కాంగ్రెస్ పార్టీతో రాజకీయ వైరుద్ధ్యం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రజాస్వామిక పార్టీ అని, అన్నింటి కంటే తాను ముఖ్యమంత్రిని అనే భేషజాలు చూపని ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, అందుకే ఆయనను సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలకు అతిథిగా ఆహ్వానించామని కూనంనేని సాంబశివరావు చెప్పారు.

అదేవిధంగా గొప్ప మేధావి అయిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను, ఉభయ తెలుగు రాష్ట్రాలలో అందరికంటే ఎక్కువ కాలం మంత్రిగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు సైతం బహిరంగ సభలో పాల్గొనటం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

## మా దేహం ముక్కలైనా సరే..

# దేశాన్ని ముక్కలు కానివ్వం

● సిపిఐ సీనియర్ నాయకులు, కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం రూ.10 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేసి వృథా అవుతుందని చెబుతున్నారని, అదే సమయంలో వారి హయాంలో కార్పొరేట్ కంపెనీలకు రూ.28 లక్షల కోట్ల రాయితీలు కల్పించారని సిపిఐ సీనియర్ నాయకులు, కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. మా దేహం ముక్కలైనా సరే.. దేశాన్ని ముక్కలు కానివ్వబోమని భారత దేశం కోసం నిలబడిన గొప్ప చరిత్ర కమ్యూనిస్టులది అని అన్నారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో ఆయన ప్రసంగిస్తూ కమ్యూనిస్టు పార్టీ పుట్టుకతోనే భారత దేశంలో రాజకీయ మార్పు తీసుకువచ్చిందన్నారు. దున్నేవానికే భూమి, ప్రపంచ శాంతి వంటి నినాదాలను ప్రజల ముందుంచిందన్నారు. పున్నప్రవయలార్, మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం, చల్లపల్లి జమీందార్ వ్యతిరేక పోరాటంతో పాటు, పుదుచ్చేరి విముక్తి పోరాటలు చేసిన ఘనత సిపిఐది అని చెప్పారు.

### చంద్రబాబూ కళ్లు తెరిచి చూడు

కమ్యూనిజం ఎక్కడ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటారని, సిపిఐ శతాబ్ది ఉత్సవాలతో ఎరుపెక్కిన ఖమ్మం చూస్తే కమ్యూనిజం ఉందో లేదో అర్థమవుతుందని నారాయణ అన్నారు. చంద్రబాబు నాయుడు తన స్వంత కళ్లతోచూడాలని, కానీ, ఆయన మోదీ కళ్ళతో చూస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కెసిఆర్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు మోదీ పక్కనే ఉన్నారని, అదే సమయంలో ఎపిలో ప్రతిపక్షంలో ఉన్న జగన్‌కూడా మోదీకి భయపడుతూ బిజెపికి మద్దతుగా ఉన్నారని అన్నారు. వాళ్ళు మోదీకి భయపడితే, ట్రంప్‌కు మోదీ లొంగిపోయారని విమర్శించారు. వెనిజులా అధ్యక్షుడిని అమెరికా ఎత్తుకుపోతే ఇంతటి పెద్ద దేశమైన భారతదేశం ఎందుకు గట్టిగా స్పందించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు సామరస్యంగా చర్చించుకొని సరైన పరిష్కారం చేసుకోవాలని, ప్రతిపక్షాల బ్లాక్‌మెయిల్‌కు లొంగవద్దని నారాయణ సూచించారు.

# సిపిఐది 'వందేళ్ల మహా ప్రస్థానం'

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంత్ రావు



వందేళ్ల సిపిఐ చరిత్ర అనేక సమరశీల పోరాటాలు, అనేక మంది అమరవీరుల త్యాగాలతో పునీతమైన రక్తాక్షరాలతో లిఖించిన ఒక మహా ప్రస్థానం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంత్ రావు అన్నారు. బహిరంగ సభలో హేమంత్‌రావు తొలుత స్వాగతోపన్యాసం చేస్తూ భారతదేశ రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీది ఒక కీలక పాత్ర అన్నారు. పుట్టుకతోనే సిపిఐని అంతమొందించాలని ప్రయత్నం చేసినా, ఆ నిర్బంధాలను ఎదిరించి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో వీరోచిత పాత్ర నిర్వహించిన పార్టీ సిపిఐ అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నిర్వహించిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి, ఈ దేశంలో భూ సమస్యను ఎజెండాలోకి తెచ్చిన ఘనత సిపిఐదేనన్నారు. సిపిఐ వందేళ్ల చరిత్ర స్ఫూర్తితో పోరాటాలను బలోపేతం చేస్తామన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిపోసిన జిల్లాగా ఖమ్మంకు గొప్ప చరిత్ర ఉందని, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఇక్కడి నుండే పోరాటాలు సాగాయని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటాల వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాల భూమి పేదలకు దక్కిందని, అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాడిందని తెలిపారు.

# కమ్యూనిస్టులు పోరాడితే పాలకులు చట్టాలు చేయాల్సిందే

● సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చి ఎలాంటి పోరాటం చేశామో, బిజెపిని అధికారం నుంచి గద్దె దించడానికి అలాంటి పోరాటాలు చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ పోరాటాలు చేసిన వివిధ డిమాండ్‌లనే పాలకులు చట్టాలుగా తీసుకొచ్చారన్నారు. పోరాటాలు చేస్తామని, ఎవరు అధికారంలో ఉంటే వారు చట్టాలు చేస్తారని, కాంగ్రెస్, తెలుగుదేశం, బిఆర్‌ఎస్ ఏ పార్టీ ప్రభుత్వమైనా ప్రజలకు అవసరమైన విషయాలపై చట్టాలు తీసుకరావాల్సిందేనని అన్నారు. చట్టాలను వారు అమలు చేయకపోతే ఆ చట్టాలను అమలు చేయడానికి మళ్ళీ పోరాటాలు నిర్వహిస్తున్నామని, చట్టాలను అమలు చేయించుకుంటున్నామన్నారు. ఈ రకమైన పోరాటాలు చేయడం వల్లనే వందేళ్ల అయినప్పటికీ కూడా సిపిఐ అధికారంలోకి రాకపోయినా, పార్టీ ఒక శక్తిగా ఉన్నదంటే ప్రజల ఆదరాభిమానాలు ఉండడమేనన్నారు. కమ్యూనిస్టు పార్టీని నిలబెట్టుకోవాలనే కాంక్ష ప్రజలకు ఉన్నందు వల్లనే పార్టీ ముందుకు పోతుందన్నారు. అధికారమే పరమావధి కాదన్నారు. అనేక పార్టీలు అధికారం పోయిన తరువాత కనబడటం లేదన్నారు. సిద్ధాంత బలం, నిర్మాణ బలం ఉండటం వల్లనే వంద సంవత్సరాలే కాదు, ఈ సమాజం ఉన్నంత కాలం ఎర్రజెండా ఖచ్చితంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. భారతదేశంలో ఏ ఒక్క పార్టీ కూడా సొంత బలంతో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలు ఏకం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎన్‌డిఎ కూటమి, ఇండియా కూటమి, రెండు కూటముల మధ్య పోరాటం కొనసాగుతుందన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రజల అభిమానం కోల్పోయిందన్నారు. బిజెపి పుట్టక ముందే ఈ దేశంలో ప్రపంచంలో ప్రజల విశ్వాసాల ప్రకారం దేవుళ్ళు ఉన్నారన్నారు. ప్రజల బలహీనతను సొమ్ముచేసుకునేందుకు బిజెపి అనేక ఎత్తుగడలు వేస్తున్నదన్నారు. సిపిఐ చీలిపోవడం వల్ల అధికారంలోకి రాలేకపోయిందన్నారు. మోదీ ప్రభుత్వం అనేక త్యాగాలు చేసిన నక్సలైట్‌లను తేదీలు పెట్టి మరి నిర్మూలించేందుకు నరమేధం నడుపుతున్నదని విమర్శించారు. నక్సలైట్ల తరువాత అర్బన్ నక్సలైట్‌లని ముద్ర వేసి మన మీద బిజెపి దాడులు ప్రారంభిస్తుందన్నారు. 25 ఏళ్లలో జరిగిన ఉద్యమాల చరిత్రను ఇవ్వాలని ఇంటలిజెన్స్‌ను కేంద్రం ప్రభుత్వం ఆదేశించిందని, వాళ్ల తదుపరి లక్ష్యం కమ్యూనిస్టులే అన్నారు. భారతదేశంలో ఎవ్వరూ ఉన్నా ఫరవాలేదు, ఎర్రజెండాలు ఉండకూడదని, ఎర్రజెండాలను అంతం చేయాలనే దుర్బుద్ధి ఉందని విమర్శించారు. అందువల్ల బిజెపిని గద్దె దించకపోతే కమ్యూనిస్టులే కాకుండా దేశంలో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురికావడం తప్పదని హెచ్చరించారు. భారతదేశంలో కమ్యూనిస్టులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని, కమ్యూనిస్టులు ఏకమైతే, వామపక్ష భావాలు ఉన్న పార్టీలు, సంస్థలు కలిసివస్తాయన్నారు. ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు రావాలని, పక్కనే ఉన్న శ్రీలంక, నేపాల్‌లో సాధ్యమైందని, అలాంటి అవకాశం రావాలని కమ్యూనిస్టు అభిమానులు ఎదురుచూస్తున్నారని పల్లా వెంకట్ రెడ్డి అన్నారు.

# ప్రత్యామ్నాయంగా ఎర్రజెండా

● సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య



త్యాగాలతో కూడిన పోరాటాలకు సిద్ధపడితేనే ఎర్రజెండా ప్రత్యామ్నాయంగా నిలబడుతుందని, అందుకు అందరూ సమాయాత్తం కావాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. రాజ్యం బలమైన శక్తిగా మారి వేటాడేందుకు సిద్ధమవుతున్న ఈ నేపథ్యంలో కమ్యూనిస్టుల పునరేకీకరణ జరగాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఈ వందేళ్ల కాలంలో అనేక ఉద్యమాలను చేపట్టిందని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి అనేక హక్కులను సాధించిందని ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలిచిందన్నారు. పీడిత, పేద ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు పదునైన పోరాటాలు చేయాలని అన్నారు.

## దేశంలో ఫాసిజం, నాజీయిజం పోకడలు

● ఎఐటియుసి జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్



ఏఐటియుసి జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ భారతదేశంలో ఫాసిజం, నాజీయిజం పోకడలు పెరుగుతున్నాయని, వాటికి వ్యతిరేకంగా అమరులు, త్యాగధనుల మార్గంలో త్యాగాలకు సిద్ధమవ్వాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అన్నారు. కమ్యూనిస్టులకు భవిష్యత్తు కచ్చితంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో కార్మికులు, రైతులు, మహిళలు, జర్నలిస్టులు ఇలా ఏ వర్గం కూడా సంతోషంగా లేదని, పలు సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, మణిపూర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో దౌర్జన్యాలు పెరుగుతున్నాయని అన్నారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన పాలకులు, దాడులకు పాల్పడుతున్న వారి పక్షం నిలబడుతోందని మండిపడ్డారు. వందేళ్ల చరిత్రలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని, ఉద్యమాలు నిర్వహించిందని గుర్తు చేశారు.

## సిపిఐ మరో 200 ఏళ్ల సభ కూడా జరుపుకుంటుంది

● సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్లే కాదు, మరో 100 ఏళ్లలో 200 ఏళ్ల సభ కూడా జరుపుకుంటుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ''వందేళ్ల కిందనే పుట్టిన ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ పుత్రిక బిజెపి అధికారంలోకి వచ్చింది. సిపిఐ పుట్టి వందేళ్లు అవుతున్నా ఒక్క సారి కూడా అధికారంలోకి రాలేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. అధికారం లేకపోయినా, ప్రజా ప్రతినిధులు ఉన్నా, లేకపోయినా బడుగులు, బలహీన వర్గాల తరుపున పోరాడుతున్న జెండా ఎర్రజెండా సిపిఐయే. వారికి ఇదే సమాధానం'' అని ఆయన స్పష్టం చేశారు. ఈ దేశాన్ని బ్రిటిషు వారు పరిపాలిస్తున్న తరుణంలో సిపిఐ కంటే 6 నెలల ముందే ఆర్‌ఎస్‌ఎస్ పుట్టిందని, మరి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఒక్క ఆర్ ఎస్ ఎస్ కార్యకర్త మాట్లాడారా? ఉద్యమాలు చేశారా? జైళ్లకు వెళ్లారా? ఒక్కరంటే ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా అని రామకృష్ణ ప్రశ్నించారు. అదే సిపిఐ ఉద్యమాలతో పుట్టిందని, సంపూర్ణ స్వాతంత్ర నినాదంతో పోరాటాలు చేసిందని, వేలాది మంది కమ్యూనిస్టులు జైళ్లకు వెళ్లారన్నారు. తెలంగాణ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకోవడమే కాకుండా ప్రజా వ్యతిరేక విధానాలతో దేశా న్ని నాశనం చేస్తూ ప్రజల మధ్య చీలికలను తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు 1964లో ఒకసారి చీలిపోయామని, ఆ తర్వాత మళ్లీ మళ్లీ చీలి పోయామన్నారు. మనం ఇంకా ఎన్ని ఏళ్లు ఇలాగే ఉందామని, చీలికైన కమ్యూనిస్టు పార్టీలై మళ్లీ ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైతే ఎర్రజెండా మరింత బలం

● సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు పి.సందోశ్ కుమార్



కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైతే చట్టసభల లోపల, వెలుపల ఎర్రజెండా బలం మరింత పెరుగుతుందని సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు పి.సందోశ్ కుమార్ అన్నారు. కమ్యూనిస్టుల బలం పెరిగితే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. దేశంలో ప్రస్తుతం ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఉన్నదని, పేద గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేసిందని దుయ్యబాట్టారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలను దేశ వ్యాప్తంగా కేరళ తో పాటు వివిధ రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించుకున్నామని వివరించారు.







## సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల బహిరంగ సభలో సందేశమిచ్చిన సౌహార్ద్ర ప్రతినిధులు



ఖమ్మంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన జాతీయ స్థాయి బహిరంగ సభకు విదేశాల నుంచి కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీకి శుభాకాంక్షలు తెలియజేశారు. బహిరంగ సభకు ఏడు దేశాల నుంచి ప్రతినిధులు హాజరై, అభివాదం చేశారు. హాజరైన వారిలో క్యూబా కమ్యూనిస్టు పార్టీ తరుపున వాన్ కార్లోస్ అగ్యులెరా (క్యూబా అంబాసిడర్), పాలస్తీనా అంబాసిటర్ అబ్దుల్లా ఎం.ఎ.అబుషావేశ్, సహార్ జె.ఓ అబుషావేశ్, వెనిజులా కమ్యూనిస్టు పార్టీ తరుపున కాల్దేరా గుజ్మా, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ తరుపున హువాంగ్ ట్రాన్, వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా తరుపున డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఎంబసీ కౌన్సెలర్ జాంగ్ జోంగ్ హువాన్, కిమ్ మ్యాంగ్ చోల్, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ సిపిఎన్ (యుఎంఎల్) ప్రతినిధి ఉదయ్‌రాజ్ పాండేలు హాజరయ్యారు. వారంతా భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్తానాన్ని వలస పాలన విముక్తికి, దేశ ప్రజల అభ్యున్నతికి చేసిన కృషిని సభలో శ్లాఘించారు. ఆయా దేశాల కమ్యూనిస్టు పార్టీ జాతీయ కమిటీల సందేశాన్ని చదివి వినిపించారు.



సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల బహిరంగ సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు రామకృష్ణ పాండ

# ఫిబ్రవరిలో మునిసిపల్ ఎన్నికలు



● జిల్లాల పునర్విభజనకు రిటైర్డ్ జడ్జితో కమిషన్
● వచ్చే ఏడాది ఆగస్టులో జరగనున్న గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు
● మంత్రివర్గం ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్/ ములుగు:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను ఫిబ్రవరిలో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న జిల్లాల పునర్విభజనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలపడంతో పాటు రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటుకు నిర్ణయించింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన ములుగు జిల్లా మేడారంలో ఆదివారం జరిగింది. మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. మంత్రివర్గ సమావేశం నిర్ణయాలను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క మీడియాకు వివరించారు. పరిపాలన కాలం ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పోరేషన్లకు మార్చిలో పండుగలు విద్యార్థులు పరీక్షలు ఉండడంతో వీలైనంత త్వరలో ఎన్నికల్లో నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో జరగనున్న గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతం లో అన్ని దేవాలయాలను బాసర నుంచి భద్రాచలం వరకు అభివృద్ధి చేయడంతో పాటు ఏకో టూరిజంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు సంబంధించి కన్సల్‌టెంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నివేదిక అందిన తర్వాత మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేసి మార్చి 31 తర్వాత ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి ఫేస్–1 నుంచి ఎల్‌టి నుంచి అంశంలో క్షుణ్ణంగా ఫేస్ 2 ఎ, బిలకు సంబంధించి భూసేకరణకు అమోదం తెలిపారు. రూ.2787ఎ,బిలకు ఆమోదం తెలిపిందన్నారు. హైదరాబాద్ ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి శిల్ప లేఅవుట్ వరకు 9 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలపిందన్నారు. మేడారం అభివృద్ధికి సుమారు 19 ఎకరాలను సేకరించామని, మరో 21 ఎకరాలను భూసేకరణ చేసి మరింత అభివృద్ధి చేయనున్నాం. జంపన్న వాగులో 365 రోజులు నీటిని నింపే విధంగా లక్నవరం నుంచి పైపు లైన్ వేసేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారన్నారు. మేడారాన్ని తిరుమలను, కుంభ మేళాను మరిపించే విధంగా అభివృద్ధి చేయనున్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ హామ్ రోడ్లకు సంబంధించి రూ.11,334 కోట్లతో, రూ.6 వేల కోట్లతో పంచాయితీ శాఖ ఆధ్వర్యంలోని రోడ్ల నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో లా కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలోని 14 ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర వ్యవస్థలకు ప్రభత్వ భూములు కేటాయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఎస్‌బిఐ కార్పోరేట్ కార్యాలయాలకు నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో కేటాయించేందుకు ఆమోదం తెలిపిందన్నారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు సమ్మక్క, సారలమ్మ చరిత్ర అందించడమే లక్ష్యంగా ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. ములుగు మండలంలో రూ.143 కోట్లతో పోట్లపూర్ ఎత్తిపొత్తల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు.

## ఎన్నికల సంఘానికి సర్కార్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. అందులో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అనుమతి తెలిపింది. రిజర్వేషన్ల నివేదికను కూడా ఖరారు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్నికల సంఘానికి పంపిన నివేదికలో 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్‌ల రిజర్వేషన్లు ఖరారు చేసిన వివరాలు ఉన్నాయి. ఈ రిజర్వేషన్‌ల ప్రకారం మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థలలో మహిళలు, బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలకు తగిన రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని, ఇకపై ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం మాత్రమే మిగిలిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

# దోపిడీదారుల నుంచి రాష్ట్రాన్ని రక్షిస్తా

● అధికారం, హోదా అనుభవించడానికి రాజకీయాల్లోకి రాలేదు
● ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ 'కొత్త పలుకు'లో రాసింది పూర్తి అసత్యం : డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆత్మగౌరవం కోసం తాము బతుకుతామని, దోపిడి దారుల నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడటానికి రాజకీయాల్లోకి వచ్చానని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్, ప్రజా భవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించడం కోసమో, అధికారం, హోదాను అనుభవించడం కోసమో తాను రాజకీయాల్లోకి రాలేదని, దోపిడీదారులు, బందిపోట్ల నుంచి తెలంగాణ ఆస్తులను, వనరులను రక్షించి, వాటిని ప్రజలకు అందజేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. సింగరేణి బొగ్గు సంస్థలకు టెండర్లపై ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ 'కొత్త పలుకు'లో తనకు తోచింది రాశాడని విమర్శించారు. ఓ కట్టు కథనాన్ని ఎవరి ప్రయోజనం కోసమో వండి వార్చాడన్నారు. టెండర్ల నిబంధనలు సింగరేణి బోర్డ్ ఖరారు చేస్తుందని, మంత్రికి సంబంధం ఉండదని, ఆరోపణలు వచ్చిన వెంటనే ఆ టెండర్లు రద్దు చేయాలని సూచించినట్టు తెలిపారు. కాగా, సదరు బోర్డు మాత్రం టెండర్లు పిలిచిన ఇంకా ఎవరూ రాలేదని చెప్పారని అన్నారు. అయినప్పటికీ తాను టెండర్లు రద్దు చేసి ఫ్రెష్‌గా పిలవమని సూచించినట్టు తెలిపారు. తాను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో సన్నిహితంగా ఉండటంతో రాధాకృష్ణకు నచ్చక వైఎస్‌పై ఉన్న కోపంతో నాపై ఈ వార్త రాసినట్టుగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ వార్త వల్ల అధికారులకు, మంత్రులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోనని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులమంతా రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని, చిల్లర కథనాలతో భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి గాలికి రాలేదని, 40 సంవత్సరాలుగా సభలో, బయట ఉండి ప్రజల కోసం పోరాటాలు చేసి వచ్చానన్నారు. రాధాకృష్ణ కొత్త పలుకును ఏం ఆశించి రాశాడో, ఎవరి మెప్పు కోసం రాశాడో బయటపడుతుందని అన్నారు. ఈ కథనంపై రాష్ట్ర ప్రజలకు నిజాలు తెలియాలని తాను స్పందించడం జరిగిందన్నారు. త్వరలో పూర్తి వివరాలతో అన్ని విషయాలు వివరిస్తానని తెలిపారు.



## ముగిసిన డ్రోన్ ఫెస్టివల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** లైట్ అండ్ మ్యూజిక్ షోలో వందలాది డ్రోన్‌లతో ఆకాశంలో విన్యాసాలు చేశారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేలా లైట్ డ్రోన్‌షోని నిర్వహించారు. ఇందులో భాగంగా రామప్ప ఆలయం, గోల్కొండ, బుద్ధవనం, మన రాష్ట్ర పక్షి పాలపిట్ట, చార్మినార్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి లాంటి కళాకృతులతో పాటు తెలంగాణ టూరిజం లోగో మొదలైనవి, గగనతలంలో చూపరులను ఆకట్టుకున్నాయి. డ్రోన్ రేసింగ్, డ్రోన్ సాకర్, లైవ్ మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఏ అరికపూడి గాంధీ, టిజిటిడిసి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎండి వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. గోల్కొండ గోల్ఫ్ క్లబ్ నుంచి 18 అంతర్జాతీయ బెలూన్లు ఉదయం వేళ గాలిలోకి ఎగిరాయి. అనేక మంది పర్యాటకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. సాయంత్రం వేళ సంగీతానికి అనుగుణంగా వెలుగులు చిమ్మే హాట్ ఎయిర్ బెలూన్ల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కళ్లు చెదిరే ఈ దృశ్యాలని చూసేందుకు పర్యాటకులు పోటెత్తారు. అంతే కాకుండా వారి ఫోన్లల్లో దృశ్యాలని బంధించారు. ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పిల్లలు పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు.

# హార్వర్డ్ విద్యార్థిగా రేవంత్ రెడ్డి

### ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో లీడర్‌షిప్‌పై కోర్సు చేయనున్న సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కొత్త రికార్డ్ సృష్టించబోతున్నారు. దేశంలో ప్రస్తుతం పదవిలో ఉన్న ముఖ్యమంత్రులందరిలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఒక కోర్సు సర్టిఫికెట్ అందుకోబోతున్న మొదటి ముఖ్యమంత్రిగా ఒక అరుదైన ఘనత సాధించబోతున్నారు. ప్రపంచంలోని నంబర్ వన్ విద్యాసంస్థలలో ఒకటైన హార్వర్డ్ యూనివర్సిటీలోని కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో లీడర్‌షిప్ 21 సెంచరీ అనే కోర్సుకు హాజరుకాబోతున్నారు. దీనితో, భారతదేశ చరిత్రలో ఒక ఐవీ లీగ్ కార్యక్రమానికి హాజరవుతున్న మొదటి ముఖ్యమంత్రి రేవంతే అవుతారు. ఈ కోర్సు పేరు 21వ శతాబ్దంకోసం నాయకత్వం(అస్తవ్యస్తత, సంఘర్షణ, ధైర్యం). ఈ కోర్సు కోసం ఆయన ఈ నెల 25 నుంచి 30 వరకు మసాచుసెట్స్‌లోని కెనడీ స్కూల్ క్యాంపస్‌లో ఉండి తరగతులకు హాజరవుతారు. ఐదు ఖండాలనుంచి 20 దేశాల ప్రతినిధులు ఈ కోర్సుకు హాజరు కాబోతున్నారు. వీరితో కలిసి రేవంత్ రెడ్డి తరగతులు, అసైన్‌మెంట్లు, హోమ్‌వర్క్ పూర్తి చేసి గ్రూప్ ప్రాజెక్టులు కూడా నిర్వహిస్తారు. ఈ కోర్సుకు ప్రొఫెసర్ టిమ్ ఓ బ్రియాన్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కరెన్ మోరిసీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కోర్సులో భాగంగా ప్రతినిధి బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుండి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు.



కోర్సు పూర్తి చేసిన తర్వాత ముఖ్యమంత్రి హార్వర్డ్ యూనివర్సిటీనుంచి సర్టిఫికెట్ పొందనున్నారు.

## ఉచితంగా రూ.5 వేలు అంటూ మోసం.. అప్రమత్తంగా ఉండాలి

- కమిషనర్ విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంక్రాంతి, గణతంత్ర దినోత్సవం వంటి పండుగలు, వేడుకల సమయంలో ప్రజల ఆనందాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ హెచ్చరించారు. ప్రస్తుతం వాట్సాప్లో ఫోన్‌పే రిపబ్లిక్ డే మెగా గిఫ్ట్‘ లేదా ‘సంక్రాంతి కానుక‘ పేరుతో కొన్ని ప్రమాదకరమైన లింకులు విపరీతంగా షేర్ అవుతున్నాయని ఆయన ఎక్స్ వేదికగా ప్రజలను అలర్ట్ జారీ చేశారు. ‘మొదట నమ్మలేదు కానీ నాకు నిజంగానే రూ.5,000 వచ్చింది. మీరు కూడా ట్రై చేయండి‘ అంటూ నమ్మశక్యంగా ఉండే సందేశాలతో నేరగాళ్లు అమాయకులను బుట్టలో వేస్తున్నారని, ఇది కేవలం ప్రజలను వంచించడానికి వాడే ఒక సైకలాజికల్ ట్రిక్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వాట్సాప్ సందేశాల చివరన ఉండే లింకుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సజ్జనార్ సూచించారు. అధికారిక లింకులు కాకుండా వింత అక్షరాలతో ఉండే లింకులను అసలు క్లిక్ చేయవద్దని కోరారు. ఆశపడి ఆ లింక్ ఓపెన్ చేస్తే మీ ఫోన్లోకి ప్రమాదకరమైన ’మాల్‌వేర్’ ప్రవేశించే అవకాశం ఉందని, తద్వారా మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ పిన్, పాస్‌వర్డ్‌లను తస్కరించి క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను ఖాళీ చేసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఫోన్‌పే, గూగుల్‌పే వంటి సంస్థలు ఎప్పుడూ వాట్సాప్ లింకుల ద్వారా డబ్బులు పంచవని, ఏవైనా ఆఫర్లు ఉంటే నేరుగా వాటి అధికారిక యాప్లలోనే ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. ఒకవేళ పొరపాటున ఎవరైనా ఇటువంటి సైబర్ మాయగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వం కేటాయించిన 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని, అధికారిక వెబ్సైట్ http://cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటమే వాటిని నిరోధించడానికి ఉత్తమ మార్గమని, ఇలాంటి అనుమానాస్పద లింకులను ఇతరులకు ఫార్వార్డ్ చేయకుండా బాధ్యతగా ఉండాలని సజ్జనార్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## టిసిఎస్ ఐఒఎన్ ప్రోగ్రాంతో విద్యార్థులకు బంగారు భవిష్యత్

### అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ చక్రపాణి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (టిసిఎస్ ఐఒఎస్) జాబ్ అఛీవర్ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ విద్యార్థులకు బంగారు బాటను వేయనుందని డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూపిందించిన ‘టిసిఎస్ ఐఒఎన్’ జాబ్ అఛీవర్ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు టిసిఎస్‌ఐఒఎన్‌తో కలిసి ఈ కోర్సు ను అందించటం ఇదే మొదటిది అని వెల్లడించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదివే విద్యార్థులను మొదటి సెమిస్టర్ నుంచే కార్పొరేట్ కంపెనీలకు అవసరమయ్యే విధంగా తీర్చిదిద్దుతూ, ప్రపంచ వ్యాప్తంగా అన్ని కార్పొరేట్ సంస్థలలో అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈ కోర్సును ప్రత్యేకంగా రూపొందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు ప్రొ. పల్లవీ కాబ్డే, ప్లేస్‌మెంట్ అధికారి డా.పి.వేణు గోపాల్ రెడ్డి, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు, సిద్దిపేట అధ్యయన కేంద్రం ప్రిన్సిపల్ డా.జి.సునీత, డా.బానోత్ ధర్మ విశ్వవిద్యాలయ వివిధ అధ్యయన కేంద్రాల ప్రిన్సిపాల్స్, ఆయా కేంద్రాల కోఆర్డినేటర్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు ఏకం కావాలి




- ఎంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో విస్తృత సమావేశంలో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల నేపథ్యంలో నేడు ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు వామపక్ష శక్తుల ఏకీకరణ కావాల్సిన చారిత్రక నేపథ్యం ఏర్పడిందని ఎంసిపిఐ (యు) జాతీయ నేతలు మద్దికాయల అశోక్ ఓంకార్, కుల్దీప్ సింగ్‌లు అన్నారు. హైదరాబాద్, బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో కామ్రేడ్ కుల్దీప్ సింగ్ అధ్యక్షతన ఈనెల 17,18 తేదీలలో ఎంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 నుంచి కొన్ని స్వల్ప భిన్నాభిప్రాయాలు కలిగి వేరు వేరు ఆర్గనైజేషన్‌గా పని చేసిన పార్టీ ఈ సమావేశంలో ఒకే ఆర్గనైజేషన్‌గా ఏర్పడాలని, దానిలో భాగంగా ఫిబ్రవరి 23, 24 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రం జోద్ పూర్‌లో ఆలిండియా ఐక్య కన్వెన్షన్ నిర్వహించాలని, ఈ కన్వెన్షన్‌కు పలు రాష్ట్రాల నుంచి 200 మంది ప్రతినిధులను సమావేశం ఎంపిక చేసిందన్నారు. వివిధ వర్తమాన అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రత్యక్ష పరోక్ష జోక్యంతో వాటి సహజ వనరులపై గుత్తాధిపత్యం కోసం అమెరికా యుద్ధాలను సృష్టిస్తోందని, అందులో భాగంగానే వెనిజులా దేశ అధ్యక్షుడు అతని సతీమణిని అమెరికా తన కస్టడీలో పెట్టుకోవడం, రష్యాపై కవ్వింపునకు దిగడం, ఇరాన్‌పై కయ్యానికి కాలు దువ్వడం, సిరియాపై దాడులు చేయడం, పాకిస్థాన్‌ను ప్రేరేపించి భారత్‌పై ఉసిగొల్పే విధానం అంతా సామ్రాజ్యవాద సంక్షోభంలో బాగంగా పతనం అవుతున్న పెట్టుబడిదారీ సమాజం గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంసిపిఐ(యు) జాతీయ నేతలు గాదగోని రవి, వల్లపు ఉపేందర్ రెడ్డి, కిరణ్ జిత్ సింగ్ షీఖాన్, ప్రేం సింగ్ భంగ్ (పంజాబ్), కాటం నాగభూషణం (ఆంధ్రప్రదేశ్), అనుబవ్ దాస్ శాస్త్రి (ఉత్తర ప్రదేశ్), రాంపాల్ షైనీ, మహేందర్ నేహా, నదీం ఖాన్ (రాజస్తాన్), భూప్ నారాయణ సింగ్, మనోరంజన్ ఠాకూర్ (బీహార్), డెన్నిస్, దామోదర్ ఉన్ని కృష్ణన్ పొట్టి (కేరళ) పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన మేడారం

- ముఖ్యమంత్రి రాక సందర్భంగా అధికారుల హడావుడి
- ఆర్‌టిసి బస్సులు లేక భక్తుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/ములుగు:** తెలంగాణ కుంభమేళగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఈ నెల 28 నుండి 31 వరకు జరుగుతున్న దృష్ట్యా భక్తులు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో పాటు వారాంతపు సెలవు ఆదివారం కావడంతో భక్తులు తమ కుటుంబ సమేతంగా ఆర్‌టిసి బస్సులు ఇతర ప్రయివేట్ వాహనాలలో భారీగా తరలివచ్చారు. తాడ్వాయి నుండి మేడారం వరకు జిన్నెల తోగు వరకు 16 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలను నిలిపివేసి చెట్ల కింద విడిది ఏర్పాటు చేసుకొని కోళ్లు, మేకలు, గొర్రెలు పొట్టేలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి బంధుమిత్రులతో జాతరను జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన దృష్ట్యా పోలీస్ దిగ్బంధంలో మేడారం పరిసర ప్రాంతాల్లో కొన్ని దారులు పోలీసులు మూసివేయడంతో భక్తులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అదేవిధంగా సమయపాలన పాటించకుండా ఆర్‌టిసి బస్సులు రావడంతో భక్తులకు సరిపోను బస్సులు లేకపోవడంతో వచ్చిన బస్సులలో భక్తులు కిక్కిరిసిపోయారు. కొన్ని సందర్భాలలో ఆర్‌టిసి సిబ్బందితో భక్తులు తీవ్ర వాగ్వివాదానికి దిగారు. భక్తులు జంపన్న వాగులో జలకాటలు ఆడి దేవతలకు పోటీపడి దర్శనాలు చేసుకోవడంతో ఆలయం మొత్తం కిక్కిరిసిపోయింది. భక్తులు తమ ఎత్తు బెల్లం, బంగారం, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీసులు సమ్మక్క సారలమ్మ గద్దెల లోపలికి వెళ్లకుండా గేట్లు మూసివేయడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసిన భక్తులు బయట చేరి మొక్కులు చెల్లించుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులతో రోడ్లను శుభ్రం చేశారు.

ఆదివారం సాయంత్రం సారలమ్మ గుడి వెనుక భాగంలో బహిరంగ సభ వేదికను ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుండి మహిళా సంఘాల సభ్యులను ఐకెపి డిఆర్‌డిఏ ఉద్యోగులు, మహిళలను ప్రత్యేక వాహనాలలో తరలించారు. తెలంగాణ సంస్కృతి సారథి కళాకారులు తమ గేయాలను పాటలు పాడి భక్తులను మంత్రముగ్దులను చేశారు.

## భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలు

- ఘనంగా ముగిసిన అంతర్జాతీయ వేడుకలు
- ప్రజల సహకారంతో కైట్, స్వీట్, హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ షోలు విజయవంతం
- సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్, హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, డ్రోన్ షోలు ప్రజల విస్తృత భాగస్వామ్యం, అధికారుల సమిష్టి కృషితో అత్యంత విజయవంతంగా ఆదివారం ముగిశాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలకు ప్రజల నుంచి లభించిన విశేష స్పందన పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేస్తూ, సహకరించిన ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన పర్యాటక శాఖ, పోలీస్ శాఖ, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారి సమన్వయం, నిబద్ధత వల్లే వేడుకలు సాఫీగా, భద్రంగా జరిగాయని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చిన కైట్ ఫ్లయర్స్, హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ షో నిర్వాహకులు, క్లిక్ ప్రతినిధులతో పాటు ఈ వేడుకల్లో పాలుపంచుకున్న వారికి ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలను ప్రజల వరకు విస్తృతంగా చేరవేసిన మీడియా ప్రతినిధులు, యాజమాన్యాలు, సోషల్ మీడియా, ఇన్‌ఫ్లూయెన్సర్ల సహకారాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ఇలాంటి వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక వైభవాన్ని అంతర్జాతీయంగా పరిచయం చేస్తున్నాయని పేర్కొన్న మంత్రి, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తామని, తెలంగాణను దేశ విదేశాల్లో ప్రముఖ పర్యాటక గమ్యంగా నిలపడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## రైల్వే భద్రతలో భారీగా ఆధునీకరణ

- ట్రాక్ రీన్యూవల్, హైస్పీడ్ సామర్థ్యంలో చారిత్రక పురోగతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ రైల్వే భద్రత, వేగం, నమ్మకాన్ని పెంచే దిశగా కీలకమైన ట్రాక్ ఆధునీకరణ కార్యక్రమాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. గత 11 ఏళ్లుగా కొనసాగుతున్న భారీ పెట్టుబడులు, యాంత్రికీకృత నిర్వహణ వల్ల దేశవ్యాప్తంగా రైలు ప్రయాణం మరింత సురక్షితంగా, వేగంగా మారుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 6,851 కిలోమీటర్ల ట్రాక్ రీన్యూవల్ పూర్తి చేయగా, 2025–26లో 7,500 కిలోమీటర్లకు పైగా పనులు కొనసాగుతున్నాయి. ఇక 2026–27లో 7,900 కిలోమీటర్ల ట్రాక్ రీన్యూవల్ చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇది ఆస్తుల నాణ్యత, భద్రతపై రైల్వే ప్రత్యేక దృష్టిని ప్రతిబింబిస్తోంది. టర్నౌట్ రీన్యూవల్‌లోనూ ముందడుగు రైళ్ల సాఫీ ప్రయాణానికి కీలకమైన టర్నౌట్ల పునరుద్ధరణలో భాగంగా 2024–25లో 7,161 థిక్ వెబ్ స్విచ్‌లు, 1,704 వెల్డబుల్ సిఎంఎస్ క్రాసింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8,000కుపైగా స్విచ్‌లు, 3,000కి పైగా CMS క్రాసింగ్‌లు అమలు చేస్తున్నారు. ట్రాక్ బలాన్ని పెంచే డీప్ స్క్రీనింగ్ పనులు నిరంతరంగా సాగుతున్నాయి. 2024–25లో 7,442 కిలోమీటర్లు పూర్తికాగా, 2025–26లో 7,500 కిలోమీటర్లకు పైగా పనులు కొనసాగుతున్నాయి. పశువుల రాక, అనధికార ప్రవేశాన్ని అడ్డుకునేందుకు 15,000 కిలోమీటర్ల మేర భద్రతా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 110కిమీ వేగానికి మించిన రైళ్లు నడిచే మార్గాల్లో ఇది ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తోంది. హైస్పీడ్ ట్రాక్‌లో రెట్టింపు వృద్ధి ఈ సమగ్ర చర్యల ఫలితంగా, 110కిమీ వేగం లేదా అంతకుమించి నడిచే సామర్థ్యం ఉన్న ట్రాక్ పొడవు 2014లోని 31,445 కిలోమీటర్ల (40%) నుంచి ప్రస్తుతం 84,244 కిలోమీటర్లకు (సుమారు 80శాతం) పెరిగింది. దీంతో దేశవ్యాప్తంగా వేగవంతమైన, సమర్థవంతమైన రైలు సేవలు సాధ్యమయ్యాయి. భద్రత ఆధునీకరణే లక్ష్యంగా సాగుతున్న ఈ చర్యలు భారతీయ రైల్వేను భవిష్యత్‌కు సిద్ధం చేస్తున్నాయని రైల్వేవర్గాలు వెల్లడించాయి.



## చార్మినార్‌లో కలిపితే.. రంగారెడ్డి జిల్లా ప్రజల బతుకులు ఆగమవుతాయ్

ఎంపి విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పాలనే ప్రయత్నం జరుగుతోందని చేవెళ్ల బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ బిజెపి కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేసి, ఆగం చేయకండని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయం లేకుండా మున్సిపల్ విభజన జరుగుతుందన్నారు. రంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న గ్రామాలను చార్మినార్‌లో కలుపుతున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పుతున్నారా?, పాత బస్తీలో నీళ్ల బిల్లులు, కరెంట్ బిల్లులు కడతారా?, కట్టని వారితో మా జిల్లా ప్రజలను ఎందుకు కలుపుతున్నారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. మెజారిటీగా హిందూ ప్రజలున్న గ్రామాలను చార్మినార్‌లో కలపడం సరైంది కాదన్నారు. రంగారెడ్డి జిల్లాల గ్రామాల్లోను చార్మినార్‌లో కలపడం వల్ల, ఆ జిల్లా ప్రజల బ్రతుకులు ఆగం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఆర్థిక వనరు రంగారెడ్డి, జిల్లా ఖజానా అంతా నాడు కెసిఆర్ ఫామ్ హౌసు తరలిపోయిందని విమర్శించారు. ఎంఐఎం ఇలాకాలోకి పంపేందుకు ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. పన్నులు కట్టేవారిని, పన్నులు కట్టనివారితో కలపకండన్నారు. ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని, ప్రజాభిప్రాయం తర్వాత నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కాంగ్రెస్ తీరు ‘తులసి వనంలో గంజాయి మొక్క’లా ఉంది



ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ తీరు తులసి వనంలో గంజాయి మొక్కలా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ హయాంలో 2జీ, బొగ్గు వంటి కుంభకోణాలతో దేశం కుదేలైందని, ప్రస్తుతం మోదీ నాయకత్వంలో పారదర్శక పాలన సాగుతోందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జాతీయ అంశాలపై అవగాహన లేదని, ఆయన వ్యాఖ్యలు అపరిపక్వంగా ఉన్నాయన్నారు. సొంత నియోజకవర్గం కొడంగల్ ఉన్న మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌ను గెలిపించుకోలేని రేవంత్, బిజెపి బలాన్ని తక్కువ చేసి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు.

**బిజెపిలో చేరిన వైద్యులు**

ప్రముఖ వైద్యులు డాక్టర్ సాయి చంద్ర ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లు, ఫార్మా నిపుణులు రాంచందర్ రావు సమక్షంలో బిజెపిలో చేరారు. యువత, విద్యావంతులు మోదీ నాయకత్వానికి ఆకర్షితులవుతున్నారని రాంచందర్ రావు అన్నారు. రాష్ట్రంలో బూతుల రాజకీయాలు పోవాలంటే మేధావులు రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## హిట్ అండ్ రన్ : యువకుడి మృతి

- బైక్‌ని కిలోమీటర్‌పాటు లాక్కెళ్లిన కారు
- పోలీసుల అదుపులో నిందితుడు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులను అప్రమత్తం చేసేందుకు పోలీసు శాఖ ఒకపక్క రాష్ట్ర వ్యాప్తంగా ‘అరైవ్ అలైవ్’ ఉద్యమం చేపడుతున్న తరుణంలో ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి ఓ యువకుడి ప్రాణాలను బలితీసుకున్న విషాదకర సంఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బైక్‌పై వస్తున్న యువకుడిని కారు ఢీ కొట్టడమే కాకుండా కిలోమీటర్ దూరం వరకు లాక్కెళ్లింది. దీంతో 30 గంటలు చావుతో పోరాడిన సదరు యువకుడు చివరకు ప్రాణాలు విడిచిన ఘటన స్థానికంగా అందర్ని కలిచివేసింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్‌కు చెందిన దేవరశెట్టి సునీల్ (28) ప్రైవేట్ ఉద్యోగి. శనివారం తెల్లవారుజామున తన బైక్‌పై ఇంటికి వస్తుండగా చంపాపేట్ మెయిన్‌రోడ్డులోని గ్రీన్‌పార్క్ కాలనీ వద్ద వెనక నుంచి వచ్చిన కియా కారు టిఎస్ 07 జెఎఫ్ 3899 ఢీ కొట్టింది. దీంతో బైక్, సునీల్ కిందపడిపోయాడు. బైక్‌తో పాటు సునీల్‌ను కారు సుమారు కిలోమీటరు దూరం వరకు రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ విషయం గమనించిన స్థానికులు, పెట్రోలింగ్ పోలీసు కారు వెంబడిచడంతో కారును ఆపినట్లే ఆపి కారుతో పాటు డ్రైవర్ ఉడాయించాడు. రోడ్డుపై రక్తంమడుగులో పడి ఉన్న సునీల్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సిసిటివి ఆధారంగా కారును గుర్తించి కారును నడిపిన సాయిచరణ్‌ను అదుపులోకి తీసుకోగా సమాచారం మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన అత్యంత క్రూరత్వంతో చోటు చేసుకుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## కర్ల రాజేశ్ కుటుంబానికి న్యాయం చేయాలి

కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీస్ కస్టడిలో మృతి చెందిన దళిత యువకుడు కర్ల రాజేశ్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ వరుస ట్వీట్లు చేశారు. కస్టడిలో ప్రాణాలు కోల్పోయిన కర్ల రాజేశ్ తల్లి గోడును రాహుల్ గాంధీ ఆలకించాలని కోరిన కవిత, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న తెలంగాణలో దళితులపై జరుగుతున్న దాష్టీకాలపై దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురాకపోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దళితులపై ప్రేమ మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని స్పష్టం చేసిన కవిత, వెంటనే రోహిత్ వేముల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కర్ల రాజేశ్ కుటుంబాన్ని ఆదుకొని పూర్తి న్యాయం చేయాలని, లాకప్ డెత్‌కు కారణమైన ఎస్ఐపై వెంటనే చర్యలు తీసుకునేలా ముఖ్యమంత్రికి తగిన సూచనలు ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరారు. కర్ల రాజేశ్ ఘటనపై న్యాయం జరిగే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగిస్తుందని కవిత స్పష్టం చేశారు.

## నీటి గుంతలో కారు పడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

**నోయిడా :** గ్రేటర్ నోయిడాలోని సెక్టార్ 150లో నిర్మాణంలో ఉన్న భవనం బేస్‌మెంట్ కోసం తవ్విన 20 అడుగుల లోతైన నీటితో నిండిన గుంతలో కారు అదుపుతప్పి పడటంతో 27 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మరణించాడని పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. ఆ తర్వాత గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక దళం, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, స్థానిక పోలీసుల బృందాల సహాయంతో ఉదయం తర్వాత మృతదేహాన్ని వెలికితీశారు. సెక్టార్ 150 సమీపంలో ఒక కారు గుంతలో పడిపోయిందని శనివారం తెల్లవారుజామున 12.15 గంటల ప్రాంతంలో తమకు సమాచారం అందిందని నాలెడ్జ్ పార్క్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపారు. మృతుడిని సెక్టార్ 150లోని టాటా యురేకా పార్క్ సొసైటీ నివాసి యువరాజ్ మెహతాగా గుర్తించారు. అతను గురుగ్రామ్‌లోని ఒక ప్రతిష్ఠాత్మక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడని, ఘటన జరిగిన సమయంలో పని నుండి ఇంటికి తిరిగి వస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక దళం, స్థానిక పోలీసుల సహాయంతో 4గంటల ప్రాంతంలో మృతదేహాన్ని వెలికితీశారని అదనపు పోలీసు కమిషనర్ (గ్రేటర్ నోయిడా) హేమంత్ ఉపాధ్యాయ్ పిటిఐకి తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, పొగమంచు, అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని, దానివల్ల కారు ఒక కాలువను దాటి గుంతలో పడిపోయిందని ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్ష కోసం పంపినట్లు, తదుపరి దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

## గణతంత్ర వేడుకలకు
# కశ్మీర్‌లో భద్రత పెంపు



**శ్రీనగర్:** గణతంత్ర దినోత్సవ వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా చూసేందుకు భద్రతా దళాలు కశ్మీర్ అంతటా శానిటైజేషన్, ఏరియా డామినేషన్ ప్రక్రియను ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్ నగరం, లోయలోని ఇతర ప్రాంతాలలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఏదైనా అనుమానాస్పద కదలికను గుర్తించేందుకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.గణతంత్ర దినోత్సవం జరుపుకునే వేదికల చుట్టూ శోధన కార్యకలాపాలు, ఏరియా డామినేషన్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. కశ్మీర్‌లో ప్రధాన గణతంత్ర దినోత్సవ కార్యక్రమం బక్షి స్టేడియంలో జరుగుతుందని అధికారులు తెలిపారు. ఇక్కడ కఠినమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నగరం, ఇతర జిల్లా ప్రధాన కార్యాలయాలలో పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు. శ్రీనగర్‌లోని వివిధ ప్రదేశాలలో, ముఖ్యంగా నగరం, ఇతర జిల్లాల ప్రవేశ ప్రదేశాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. శ్రీనగర్‌లోని స్టేడియంతో సహా లోయలోని గణతంత్ర దినోత్సవ వేడుకల వేదికల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు. వేదికల చుట్టూ బహుళ అంచెల భద్రతా ఉపకరణాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించడానికి లేదా శాంతిని ఉల్లంఘించడానికి ఎవరినీ అనుమతించవద్దని అధికారులు కోరారు. గణతంత్ర దినోత్సవానికి ముందు ఉగ్రవాదులు ఎటువంటి ఐఇడి పేలుళ్లకు పాల్పడకుండా చూసేందుకు స్నిఫర్ డాగ్‌లు, మెటల్ డిటెక్టర్‌లను రంగంలోకి దించారు. ఏదైనా ఘటనను ఎదుర్కోవడానికి లోయలోని వివిధ ప్రదేశాలలో మాక్ సెక్యూరిటీ డ్రిల్స్ నిర్వహించబడినందున భద్రతా సంస్థలు ఏ అవకాశాన్ని వదిలిపెట్టడం లేదని వారు తెలిపారు.

**కిష్త్వార్ ఎన్‌కౌంటర్**

జమ్మకశ్మీర్ కిష్త్వార్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఆదివారం భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. చత్రో ప్రాంతంలోని మాండ్రాల్‌సింగూరా సమీపంలోని సోనార్ గ్రామంలో మధ్యాహ్నం సమయంలో కార్డన్, సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా కాల్పులు ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు. బలగాలు ఆ ప్రాంతంలో మోహరించామన్నారు.

## సైబర్ నేరాల దర్యాప్తు
# ఖాతాల స్తంభనకు 'సుప్రీం'లో పిటిషన్

### పిటిషన్‌ను సిజెఐ ముందు ఉంచాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశం

**న్యూఢిల్లీ :** సైబర్ నేరాల దర్యాప్తు సమయంలో బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం, స్తంభింపజేయడాన్ని నియంత్రించే ఆపరేటింగ్ విధానాన్ని రూపొందించాలని, కేంద్రానికి, భారత రిజర్వ్ బ్యాంక్‌కు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ముందు ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. డిజిటల్ అరెస్టులకు సంబంధించిన సుమోటో అంశాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) నేతృత్వంలోని ధర్మాసనం ఇప్పటికే విచారిస్తోందని, అదే అంశం పరిశీలనలో ఉందని కేంద్రం తెలియజేసిన తర్వాత జస్టిస్‌లు పంకజ్ మిథల్, ఎస్‌విఎన్.భట్టిలతో కూడిన ధర్మాసనం రిజిస్ట్రీని సిజెఐ నుండి సూచన కోరాలని, తదనుగుణంగా తగిన బెంచ్ ముందు ఈ అంశంపై విచారించాలని ఆదేశించారు.'అనిల్ కౌశిక్ ఎఎస్‌జి ఇంకా ఇలా అన్నారు. 'బి', 'సి' ప్రార్థనల విషయానికి వస్తే అవి సుమోటో రిట్ పిటిషన్ (సిఆర్ఎల్.) నెం...లో ఈ కోర్టులోని మరొక ధర్మాసనం ముందు పరిశీలనలో ఉన్నాయి.పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రీ భారత ప్రధాన



న్యాయమూర్తి నుంచి తగిన ఆదేశాలను పొంది' తదనుగుణంగా తగిన విషయాన్ని పోస్ట్ చేయాలి' అని జనవరి 16న తన ఉత్తర్వులో సుప్రీంకోర్టు పేర్కొంది. లిఖితపూర్వక హేతుబద్ధమైన ఉత్తర్వు లేకుండా అటువంటి చర్యతీసుకున్న 24గంటల లోపు ఖాతాదారుకు తెలియజేయకుండా ఏ బ్యాంక్ ఖాతానూ స్తంభింపజేయరాదని సిఆర్‌పిసి యొక్క బిఎన్ఎస్ఎస్/ 102 (3) సెక్షన్ 106(3) కింద నిర్దేశించిన విధంగా ప్రతిస్తంభింపజేసే ఉత్తర్వును వెంటనే జ్యురీస్‌డిక్షన్ పరిధి మెజిస్ట్రేట్‌కు నివేదించాలని పేర్కొంటూ 'బి' ప్రార్థన ఉన్న పిటిషన్‌ను పరిశీలించడానికి అత్యున్నత న్యాయస్థానం గతంలో అంగీకరించింది. దాని ప్రార్థన 'సి' అనేది సైబర్ క్రైమ్స్ దర్యాప్తుల సమయంలో బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం, నిలిపివేయడాన్ని నియంత్రించే ఏకరీతి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్‌ఒపి) రూపొందించడానికి కేంద్రానికి, భారత రిజర్వ్ బ్యాంక్‌కు దిశానిర్దేశం చేయాలని ఆదేశం కోరుతుంది. తద్వారా ఏకపక్ష చర్యలను నిరోధించడానికి, దేశవ్యాప్తంగా సముచితమైన న్యాయాన్ని నిర్ధారించడానికి మార్గం సుగమం అవుతుంది. ముందస్తు సమాచారం లేకుండానే చర్య తీసుకున్నారని ఆరోపించిన పిటిషనర్ల బ్యాంక్ ఖాతాలను కేంద్రం స్తంభింపజేయడాన్ని కౌశిక్ ప్రారంభంలోనే ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పిటిషన్ కాపీని మూడు రోజుల్లోగా కేంద్రానికి అందజేయాలని , ఈ విషయాన్ని వచ్చే వారం జాబితా చేయాలని జనవరి 6న అత్యున్నత న్యాయస్థానం కోరింది.దేశవ్యాప్తంగా ఉన్న సైబర్ సెల్స్ సహా అన్ని దర్యాప్తు సంస్థలకూ తగిన మార్గదర్శకాలను జారీ చేయాలని అటువంటి చర్య తీసుకున్న 24గంటలలోపు ఖాతాదారుడికి రాతపూర్వ, సహేతుకమైన ఉత్తర్వు,సమాచారం లేకుండా ఏ బ్యాంక్ ఖాతానూ స్తంభింపజేయకుండా చూసుకోవాలని కూడా పిటిషన్ కోరింది. ముందస్తు నోటీసు సమాచారం లేదా న్యాయపరమైన అనుమతి లేకుండా తమిళనాడు పోలీసుల సైబర్ సెల్ తన బ్యాంక్ ఖాతాలను ఏకపక్షంగా స్తంభింపజేయడం/నిలుపుదల చేయడం పట్ల తాను ఎంతగానో బాధపడ్డానని, తద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 19 (1) (జి), 21 ప్రకారం తన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించిందని న్యాయవాది తుషార్ మనోహర్ ఖైర్నార్ ద్వారా పిటిషనర్ వివేక్ వర్ష్నే దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కేసులో స్తంభింపజేసే ఉత్తర్వు పూర్తి ఆర్థిక స్తంభనకు దారితీసిందని, అవసరమైన ఖర్చులు, పన్నులు, అప్పుల చెల్లింపుతో సహా తన వృత్తిపరమైన, వ్యక్తిగత బాధ్యతను నిర్వర్తించకుండా పరిమితం చేసిందని పిటిషనర్ పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ లేదా ఆర్థిక దర్యాప్తుల సమయంలో బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం, స్తంభింపజేయడాన్ని నియంత్రించే ఏకరీతి విధానం లేదా ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్ (ఎస్‌ఒపి) ప్రస్తుతం లేదని పిటిషన్ ప్రధానంగా ప్రస్తావించింది.'అనవసరమైన వేధింపుల నుండి సామాన్యుడిని రక్షించడానికి మార్గదర్శకాలను రూపొందించాలి అని ఆ పిటిషన్ కోర్టును కోరింది. సైబర్ సెల్ ఖాతాలను స్తంభింపజేసే నోటీసులు జారీచేసే ఇలాంటి స్వభావం ఉన్న సందర్భాలలో ఏకరీతి విధానం, ఎస్‌ఒపి లు రూపొందించడానికి భారత హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆదేశించాలని కోర్టును కోరింది.

# పాత తరం తప్పుకోవాలి

### కొత్త తరం బాధ్యతలు చేపట్టాలి : నితిన్ గడ్కరీ



**నాగ్‌పూర్:** పరిస్థితులు సజావుగా సాగడం ప్రారంభించినప్పుడు పాత తరం తప్పుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. భవిష్యత్ తరం వారు ముఖ్యమైన బాధ్యతలను చేపట్టాలని సూచించారు. 'అడ్వాంటేజ్ విదర్భ–ఖాస్దార్ ఉద్యోగిక్ మహోత్సవ్' గురించి గడ్కరీ నాగ్‌పూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. దీనిని గడ్కరీ రూపొందించిగా అసోసియేషన్ ఫర్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ (ఎఐడి) అధ్యక్షుడు ఆశిష్ కాలే నిర్వహిస్తున్నారు. కాలే యువ తరాన్ని అడ్వాంటేజ్ విదర్భ చొరవలో భాగస్వాములను చేశారని గడ్కరీ అన్నారు. క్రమంగా తరం మారాలని తాను నమ్ముతున్నానన్నారు. పాత తరం వారు క్రమంగా పదవీ విరమణ చేయాలిస్న సమయం ఆసన్నమైందని, బాధ్యతలు కొత్త తరం వారికి ఇవ్వాలని సూచించారు. బండి సజావుగా నడపడం ప్రారంభించినప్పుడు, మనం వెనక్కి వెళ్లి వేరే పని చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 6 నుండి 8 వరకు నాగ్‌పూర్‌లో జరుగుతున్న అడ్వాంటేజ్ విదర్భ ఎక్స్‌పోలో ఇది మూడవ సంవత్సరం అని అన్నారు. విదర్భ ప్రాంతంలో వివిధ రంగాలలో చాలా మంచి వ్యవస్థాపకులు ఉన్నారని గడ్కరీ అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం లక్ష్యం భారతదేశ పారిశ్రామిక పటంలో విదర్భను బలమైన, అభివృద్ధి చెందుతున్న వృద్ధి కేంద్రంగా స్థాపించడమే అని ఆయన అన్నారు. ఏదైనా ప్రాంత అభివృద్ధికి పారిశ్రామిక రంగం, వ్యవసాయం, అనుబంధ రంగాలు, సేవా రంగం యొక్క ప్రాముఖ్యతను గడ్కరీ నొక్కిచెప్పారు.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

### లక్నోలో అత్యవసర ల్యాండింగ్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా (పశ్చిమ బెంగాల్) ప్రయాణిస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో లక్నోలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సివచ్చింది. ఈ ఘటన ఆదివారం ఉదయం జరిగింది. అయితే, ఈ బాంబు బెదిరింపు గతంలోలాగా ఫోన్, మెయిల్, మెసేజ్ ద్వారా కాకుండా.. విమానంలో ఒక నోట్ ద్వారా వచ్చింది. విమానంలో ఒక టిష్యూ పేపర్‌పై గుర్తు తెలియని వ్యక్తి చేతితో ఈ బెదిరింపు పత్రం రాసినట్లు ఎసిపి రజనీష్ వర్మ తెలిపారు. ఇండిగో విమానం ఉదయం ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళ్తుండగా.. విమానంలో బాంబు ఉందని ఆ విమానంలోని టాయిలెట్‌లో ఉన్న ఒక టిష్యూ పేపర్‌పై చేతి రాతతో రాసి ఉండగా సిబ్బంది గుర్తించారు. దీంతో విమానంలోని పైలట్లు ఎటిసికి సమాచారం అందించారు. అనంతరం ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసేందుకు అనుమతి తీసుకున్నారు. ఉదయం 9.17 గంటలకు లక్నో విమానాశ్రయంలో విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది ఉన్నారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే బాంబ్ స్క్వాడ్ సిఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల్ని తనిఖీ చేశారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## ఎఐడిఎంకె ఎన్నికల హామీలు
# డిఎంకె మేనిఫెస్టో ఫోటోకాపీ

### రాష్ట్ర మంత్రి టిఆర్‌బి రాజా



**చెన్నై:** తమిళనాడులో ప్రతిపక్ష ఎఐడిఎంకె శనివారం ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై అధికారి డిఎంకె మండిపడింది. ప్రస్తుతం డిఎంకె ప్రభుత్వ చొరవపై స్టిక్కర్లు అతికించినట్లుగా ఆ పార్టీ కొత్తగా ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలను ఉన్నాయని మంత్రి టిఆర్‌బి రాజా పేర్కొన్నారు. మ్యానిఫెస్టోను 'ఫోటోకాపీ' చేయడం ఎఐడిఎంకె సంప్రదాయంగా కొనసాగిస్తున్న ఆచారమని ఎద్దేవా చేశారు. 'ప్రతి ఎన్నికలలో, డిఎంకె మేనిఫెస్టో ఒక హీరోగా నిలుస్తుంది. దానిని ఫోటోకాపీ చేసి తమ సొంతంగా విడుదల చేయడం ఎఐడిఎంకెకు ఒక సాధారణ అలవాటుగా మారిందన్నారు. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ 'ద్రవిడ మోడల్' ప్రభుత్వంలో ఇప్పటికే క్రియాశీలంగా ఉన్న పథకాల 'నకిలీ నివేదిక'గా ప్రతిపక్ష పార్టీ తాజా ప్రకటనలను ఆయన అభివర్ణించారు. 2021 ఎన్నికల సమయంలో డిఎంకె విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రస్తావిస్తూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంగా వాగ్దానాలను నెరవేర్చలేమని ఎడప్పాడి పళనిస్వామి వాదించారని రాజా అన్నారు.'మా ముఖ్యమంత్రి తమిళనాడును అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లడమే కాకుండా, ప్రతిపక్ష నాయకుడు చేయలేమని చెప్పిన ప్రతి విషయాన్ని విజయవంతంగా అమలు చేశారు' అని ఆయన అన్నారు. కాగా, ప్రతి కుటుంబ రేషన్ కార్డుదారునికి నెలవారీ రూ. 2,000 ఆర్థిక సహాయం, సిటీ బస్సుల్లో ప్రయాణించే పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం, ఇతరత్రా అంశాలు పళనిస్వామి ఎన్నికల హామీలలో చేర్చారు.

# మోదీ ప్రభుత్వం ఇంకెంతకాలం తిరస్కరిస్తుంది?

### వాయుకాలుష్యంపై ప్రపంచ బ్యాంక్ నివేదికను ప్రస్తావించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** వాయుకాలుష్యంపై ప్రపంచ బ్యాంక్ నివేదికను కాంగ్రెస్ ఆదివారం ఉటంకించింది. ఈ నివేదిక ఇండోగంగా మైదానాలు, హిమాలయ పర్వత ప్రాంతాలలో ప్రతీ ఏటా 10లక్షల అకాలమరణాలు సంభవిస్తాయని వెల్లడించిందని, నరేంద్రమోదీ ప్రభుత్వం ఇలా ఎంతకాలం 'తిరస్కరణ'లో కాలం గడుపుతుందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, కమ్యూనికేషన్స్, కేంద్ర పర్యావరణ శాఖ మాజీ మంత్రి జైరాం రమేష్ మండిపడ్డారు. వాయు కాలుష్యం ప్రమాణాలను కఠినంగా, రాజీలేని విధంగా అమలుచేయడంతో సహా వాయుకాలుష్య ప్రేరిత ఆరోగ్య సంక్షోభం తీవ్రతరమవుతున్న నేపథ్యంలో తమ పార్టీ అనేక చర్యలను సూచించినా పెడచెవిన పెట్టడం శోచనీయమని జైరాం రమేష్ అన్నారు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ దాదాపు 1 మిలియన్ అకాల మరణాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రాంతీయ జిడిపిలో దాదాపు 10శాతం ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నాయని నివేదిక హైలెట్ చేస్తున్నదని జైరాం రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. ప్రజా రవాణా విస్తరణ, విద్యుద్దీకరణ, వాహన ఉద్గార, ఇంధన ప్రమాణాలను కఠినతరం చేయడం వంటి ఇతర విషయాలతో పాటు ఏమి చేయాలో నివేదిక వివరిస్తుందని రమేష్ అన్నారు. 'ఇటీవలి సంవత్సరాలలో చాలా వాస్తవమైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) ఆరోగ్య సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ పదేపదే వాయు కాలుష్య (నియంత్రణ, నివారణ1981, జాతీయ పరిసర వాయు నాణ్యత ప్రమాణాలు (ఎన్ఎఎక్యూఎస్) 2ను పిఎం 2.5 పై దృష్టి సారించి సమీక్షించాలని సూచిస్తోంది' అని మాజీ పర్యావరణ శాఖ మంత్రి జైరాం రమేష్ తెలిపారు.ఆర్థిక వ్యయం, భౌగోళిక కవరేజీ పరంగా జాతీయ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) విస్తృత విస్తరణను కాంగ్రెస్ సూచించిందన్నారు. పనితీరు గంటకు 2.5 స్థాయిల కొలత కొలమానంగా ఉందని మాజీ పర్యావరణ శాఖ మంత్రి అయిన జైరాం రమేష్ అన్నారు.దక్షిణాసియాలో అత్యంత ఆరోగ్య, అభివృద్ధి సవాళ్లలో ఇండోగంగా మైదానాలు, హిమాలయ పర్వత ప్రాంతాలలో వాయు కాలుష్యం ఒకటి అని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది.దేశ రాజధానిలో కాలుష్యం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడి వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి.

## మెజారిటీ లేని రాష్ట్రాల్లో మిత్రపక్షాలను
# అణగదొక్కడమే బిజెపి వ్యూహం

### రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్



**న్యూఢిల్లీ :** అధికారంలో లేని లేదా మెజారిటీ లేని రాష్ట్రాల్లో ఇతర రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి రావడమే బిజెపి రాజకీయ వ్యూహం అని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ పేర్కొన్నారు. ఈ తరువాత ఆ పార్టీలను నామరూపం లేకుండా చేయడమే కాషాయ పార్టీ ప్రధాన ఉద్దేశమని మండిపడ్డారు. ఈ వ్యూహం బిహార్‌లో విజయవంతమైందని, మహారాష్ట్రలో అమలు చేయబడుతోందని ఆయన అన్నారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలలో బిజెపి 2,869 సీట్లలో 1,425 సీట్లు గెలుచుకుంది, ముంబయి, పుణెలతో సహా డజనుకు పైగా మునిసిపల్ కార్పొరేషన్లలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది.

# గంగానదిలో పుణ్యస్నానాలు



**ప్రయోగ్‌రాజ్ :** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మాఘమేళాలో ప్రధాన స్నానోత్సవం అయిన మౌని అమావాస్య సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నాటికి 3.15 కోట్లకు పైగా భక్తులు గంగా నదిలో, సంగంలో పవిత్ర స్నానాలు చేశారని అధికారులు తెలిపారు. దట్టమైన పొగమంచును తట్టుకుని అర్ధరాత్రి నుండి భక్తులు గంగా, సంగం ఘాట్‌లకు రావడం ప్రారంభించారని, తెల్లవారుజామున అన్ని దిశల నుండి ప్రవాహం కొనసాగిందని మేళా పరిపాలన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలను అనుసరించి ఉదయం హెలికాప్టర్ నుండి భక్తులపై పూలరేకులు కురిపించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. గతంలో, మకర సంక్రాంతి సందర్భంగా దాదాపు 1.03 కోట్ల మంది భక్తులు స్నానాలు చేయగా, ఏకాదశి నాడు దాదాపు 85 లక్షల మంది గంగా, సంగంలో స్నానం చేశారు. యాత్రికులు సరిగ్గా నావిగేట్ చేయడానికి మేళా ప్రాంతం అంతటా స్తంభాలపై ప్రతిబింబ టేపతిబింబ ఏర్పాటు చేశామని, భక్తులకు మార్గనిర్దేశం చేయడానికి పౌర రక్షణ వాలంటీర్లను నియమించామని డివిజనల్ కమిషనర్ సౌమ్య అగర్వాల్ తెలిపారు. మాఘమేళా 800 హెక్టార్లలో విస్తరించి ఏడు సెక్టార్లుగా విభజించబడిందని ఆమె చెప్పారు. మేళా ప్రాంతంలో 25,000 కంటే ఎక్కువ టాయిలెట్లు ఏర్పాటు చేయబడ్డాయని, పరిశుభ్రతను కాపాడుకోవడానికి 3,500 కంటే ఎక్కువ పారిశుధ్య కార్మికులను నియమించారు. పర్యాటకులు, యాత్రికుల కోసం స్వల్పకాలిక కల్పవాస్ (శుద్ధీకరణ ఆచారాలు) ఆచరించడానికి, ధ్యానం, యోగా కోసం సౌకర్యాలతో కూడిన టెంట్ సిటీని ఏర్పాటు చేసినట్లు అగర్వాల్ తెలిపారు. సజావుగా ప్రయాణించడానికి, బైక్ టాక్సీలు, గోల్ఫ్ కార్ట్‌లు వంటి సేవలను కూడా అందించినట్లు తెలిపారు. భక్తుల భద్రత, సజావుగా ప్రయాణించడానికి మేళా ప్రాంతం అంతటా 10,000 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించినట్లు పోలీసు సూపరింటెండెంట్ (మాఘమేళా) నీరజ్ పాండే తెలిపారు. రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం, ఈ సంవత్సరం లక్షకు పైగా వాహనాలను ఉంచే సామర్థ్యంతో 42 తాత్కాలిక పార్కింగ్ జోన్‌లను సృష్టించారు. 2025–26 మాఘమేళా కోసం మొత్తం 12,100 అడుగుల పొడవైన స్నానపు ఘాట్‌లను నిర్మించామని, అవసరమైన అమర్చామని చెప్పారు.

# చొరబాటుదారులను తరిమికొడతాం

### నాటి కాంగ్రెస్ సర్కార్ అసోం భూములను చొరబాటుదారులకు అప్పగించింది : ప్రధాని మోదీ



**కలియాబోర్:** భారత్ నుంచి చొరబాటుదారులను తరిమికొడుతామని ప్రధాని నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. 'చొరబాటుదారులు జనాభా సమతుల్యతను దెబ్బతీస్తున్నారు, సంస్కృతిపై దాడి చేస్తున్నారు, పేదల, యువత ఉద్యోగాలను లాక్కుంటున్నారు. గిరిజన ప్రాంతాలలో మోసపూరితంగా భూములను ఆక్రమిస్తున్నారు. ఇది ముఖ్యంగా అసోం, దేశ భద్రతకు తీవ్రమైన ముప్పుగా పరిణమించింది' అని ప్రధాని పేర్కొన్నారు. ఎన్నికలు జరగనున్న అసోంలో తన పర్యటనలో రెండో రోజు ఆదివారం కలియాబోర్‌లో జరిగిన ర్యాలీలో మోదీ పాల్గొని మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రమైన అసోంలో తమ పాలన సమయంలో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర భూములను చొరబాటుదారులకు అప్పగించిందని ఆ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో చొరబాట్లు పెరుగుతూనే వచ్చాయని, అక్రమ వలసదారులు 'అడవులు, జంతువుల సంచార మార్గాలు, సాంప్రదాయ సంస్థలను ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. భూములను ఆక్రమించుకున్న చొరబాటుదారులను తొలగించడం ద్వారా బిజెపి ప్రభుత్వం అసోం గుర్తింపును, సంస్కృతిని కాపాడుతోందన్నారు. కాంగ్రెస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను హెచ్చరించారు, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయని, బిహార్ ఎన్నికల సమయంలో, వారు చొరబాటుదారులను రక్షించడానికి మార్చ్‌లు, ర్యాలీలు నిర్వహించారు, కానీ అక్కడి ప్రజలు వారిని పూర్తిగా తిరస్కరించారన్నారు. అభివృద్ధి కోసం ఎటువంటి ఎజెండా లేనందున ప్రతిపక్షం దేశం విశ్వాసాన్ని కోల్పోయిందని, అటువంటి పార్టీ అసోం లేదా కజిరంగ ప్రయోజనాలకు ఎప్పటికీ సేవ చేయదని మోదీ తెలిపారు.

**భారత జీవవైవిధ్యానికి అమూల్యమైన రత్నం 'కజిరంగ'**

కజిరంగ కేవలం జాతీయ ఉద్యానవనం కాదు, 'అసోం ఆత్మ, భారతదేశ జీవవైవిధ్యానికి అమూల్యమైన రత్నం, దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది' అని ప్రధాని అన్నారు. రూ. 6,957 కోట్ల విలువైన కజిరంగ ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత, రెండు అమృత్ భారత్ రైళ్లను వాస్తవంగా ప్రారంభించారు. అనంతరం నాగాంవ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో మోదీ మాట్లాడారు. కాజిరంగ ఒక కొమ్ము గల ఖడ్గమృగానికి నిలయంగా ఉందని పేర్కొంటూ, వరదల సమయంలో వన్యప్రాణులు ఎత్తైన ప్రదేశాన్ని వెతుక్కుంటూ జాతీయ రహదారులను దాటవలసి వచ్చినప్పుడు సవాళ్లను ఎదుర్కొంటాయన్నారు. అడవిని సురక్షితంగా ఉంచుతూ సజావుగా రాకపోకలు సాగించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎలివేటెడ్ కారిడార్ పూర్తయిన తర్వాత, వాహనాలు పై నుండి వెళ్తాయి, కింద వన్యప్రాణుల కదలికకు ఎటువంటి ఆటంకం ఉండదు, ఖడ్గమృగాలు, ఏనుగులు, పులుల సాంప్రదాయ ప్రయాణ మార్గాలను దృష్టిలో ఉంచుకుని డిజైన్ తయారు చేయబడుతుందని మోదీ అన్నారు. ఈ కారిడార్ ఎగువ అసోం, అరుణాచల్ ప్రదేశ్ మధ్య కనెక్టివిటీని కూడా మెరుగుపరుస్తుందని, కొత్త రైలు సేవలతో పాటు, ప్రజలకు కొత్త అవకాశాలను తెరుస్తుందని చెప్పారు.

## మరో ఇద్దరు
# మావోయిస్టులు ఎన్‌కౌంటర్

**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు మరణించిన మరుసటి రోజున ఆదివారం ఈ ప్రాంతంలో అదే ఆపరేషన్‌లో మరో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. జిల్లాలోని వాయువ్య ప్రాంతంలోని అటవీ కొండలలో ఉదయం తాజా కాల్పులు జరిగాయి. ఇక్కడ భద్రతా దళాల ఉమ్మడి బృందం నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తోందని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర యాదవ్ తెలిపారు. శనివారం జరిగిన అదే ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మరణించారు. వారిని డివిజనల్ కమిటీ సభ్యుడు సీనియర్ కేడర్ దిలీప్ వేద్జా, ఏరియా కమిటీ సభ్యులు మాద్వి కోసా, లక్కీ మద్కం, పార్టీ సభ్యురాలు రాధా మెట్టాగా గుర్తించారు. నలుగురూ మావోయిస్టుల నేషనల్ పార్క్ ఏరియా కమిటీలో చురుకుగా ఉన్నారని ఎస్‌పి తెలిపారు. ఆదివారం మృతి చెందిన ఇద్దరు మావోయిస్టుల ఇంకా గుర్తించలేదన్నారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), రెండు పోలీసు విభాగాలు, సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ అయిన కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్) సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. వేద్జా, ఇతర సాయుధ దళాలు ఈ ప్రాంతంలో ఉన్నాయనే నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు శనివారం ఈ ఆపరేషన్ ప్రారంభించబడింది. ఎన్‌కౌంటర్ ప్రదేశాల నుండి ఎకె47 రైఫిల్, ఇన్సాస్ రైఫిల్, కార్బైన్, .303 రైఫిల్‌తో సహా ఆరు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్‌తో, ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో కనీసం 20 మంది మావోయిస్టులు మరణించారు. జనవరి 3న, బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలను కలిగి ఉన్న బస్తర్ ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 14 మంది మావోయిస్టులు హతమయ్యారు. గత సంవత్సరం, రాష్ట్రంలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో 285 మంది మావోయిస్టులు మరణించారు.

## మంచు కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలు ఢీ..
# మంటల్లో ఇద్దరు సజీవ దహనం



**చండీగఢ్:** మంచు కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై పలు వాహనాలు ఢీకొన్నాయి. మంటలు చెలరేగడంతో ఒక వాహనంలోని ఇద్దరు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. హర్యానాలోని నుహ్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో పొగమంచు కారణంగా కుండ్లిమనేసర్‌పల్వాల్ (కెఎంపి) ఎక్స్‌ప్రెస్‌వేపై పలు వాహనాలు ఢీకొన్నాయి. కాగా, ఒక భారీ వాహనం ఆకస్మికంగా బ్రేక్‌లు వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. దాని వెనుక ఉన్న వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. కంకర లోడ్ ఉన్న డంపర్, అమెజాన్ వస్తువులను రవాణా చేస్తున్న కంటైనర్‌లో మంటలు వ్యాపించాయి. డంపర్‌లో ఉన్న రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్, హెల్పర్ మంటల్లో కాలి సజీవ దహనమయ్యారు. గాయపడిన మరి కొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు గురుగ్రామ్ నుంచి లక్నో వెళ్తున్న అమెజాన్ కంటైనర్‌లో బట్టలు, షూస్, మొబైల్ ఫోన్లు వంటి వస్తువులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మంటల కారణంగా సరుకు పూర్తిగా దగ్ధమైందని చెప్పారు. సుమారు రూ.1.25 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన కొన్ని పార్సిల్‌ను కొందరు వ్యక్తులు ఎత్తుకెళ్లగా మిగతా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మూడు గంటలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఆ తర్వాత క్రేన్ సహాయంతో దగ్ధమైన వాహనాలను రోడ్డు పక్కకు తొలగించారు. ఈ ప్రమాదం వల్ల సుమారు ఆరు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నాలుగు గంటలకుపైగా శ్రమించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అయితే ఒక డంపర్, అమెజాన్ పార్సిల్ కంటైనర్, మూడు ట్రైలర్స్ ఈ ప్రమాదంలో ధ్వంసమైనట్లు పోలీస్ అధికారి తెలిపారు. సజీవ దహనమైన డంపర్ డ్రైవర్, హెల్పర్ మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు చెప్పారు. చలికాలంలో వాహన డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## రూ.7.65 చోరీ కేసు..
# 50 ఏళ్ల తర్వాత తీర్పు

**ముంబయి:** మహారాష్ట్రలో యాభై ఏళ్ల క్రితం నాటి ఓ చోరీ కేసుకు సంబంధించి ముంబయి కోర్టు తాజాగా తుది తీర్పు వెలువరించింది. ఎన్నో ఏళ్లు నిందితుల గురించి పోలీసులు వెతికినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో కోర్టు ఈ కేసుకు తాజాగా ముగింపు పలికింది. ఇంతకీ చోరీ అయిన మొత్తం ఎంతో తెలుసా.. 7.65 రూపాయలు. 50 ఏళ్ల క్రితం అంటే 1977లో రూ. 7.65 అంటే కొంచెం పెద్ద మొత్తమే. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎంత ప్రయత్నించినా నిందితులను మాత్రం పట్టుకోలేకపోయారు. దక్షిణ ముంబయిలోని మజగావ్ న్యాయస్థానం తాజాగా పాత కేసులపై దృష్టి సారించింది. ఈ క్రమంలో 1977 నాటి రూ.7.65 కేసు వెలికి తీసింది. 1977 నుంచి ఈ కేసు పెండింగ్‌లోనే ఉంది. రూ.7.65 చోరీ కేసులో అప్పట్లో ఇద్దరు వ్యక్తులపై ఫిర్యాదు అందింది. ఆ ఇద్దరి కోసం పోలీసులు ఎంత గాలించినా, అనేక సార్లు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. దాదాపు 50 ఏళ్లుగా మరుగున పడి ఉన్న ఈ కేసు ఇటీవల విచారణకు వచ్చింది. ఈ కేసును పెండింగ్‌లో ఉంచడంలో అర్థం లేదని మజగావ్ న్యాయస్థానం అభిప్రాయపడింది. దాదాపు 50 ఏళ్ల నాటి ఈ కేసులో ఎటువంటి పురోగతీ లేకపోడంతో నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టేసింది.

# సమాజహితం... సాహిత్యఫలం..

సాహిత్యం అణగారినవారిని, పేదలను, దోపిడీకి గురవుతున్న వారికి ఎందుకు ప్రాతినిధ్యం వహించాలి అనే ప్రశ్న సంప్రదాయవాదుల నుంచి మత ఛాందుల నుంచి ఇటీవలి కాలంలో బలంగా వినిపిస్తున్నది. వివిధ రచనా ప్రక్రియలను మతానికి, మత విశ్వాసాలకు, రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్న తరుణంలో, ఈ ప్రశ్నకు సమాధానం అన్వేషించాల్సిన అవసరం ఏర్పడింది. నిజానికి ఈ ప్రశ్న, సాహిత్యం అంటే ఏమిటి? అనే మూల ప్రశ్నతో ముడిపడి ఉంది. సాహిత్యం కేవలం వినోదం కోసం, సౌందర్యాస్వాదన కోసం మాత్రమే అయితే, అది సమాజానికి బాధ్యత వహించనవసరం లేదు. కానీ, సాహిత్యం ఒక సామాజిక చర్యగా, మానవ అనుభవాల సాక్ష్యంగా, చరిత్రకు నైతిక అద్దంగా ఉంటే, అది తప్పనిసరిగా అణగారిన వర్గాల వైపు తిరగాలి. ఎందుకంటే సమాజంలోని అసమానతలు, అన్యాయాలు, దోపిడీలు అత్యంత తీవ్రంగా అనుభవించేది వారే. ప్రపంచ జనాభాలో అత్యధిక సంఖ్య కూడా వారిదే. అందుకే, వారికి సంబంధించిన అంశాలకే ప్రాధాన్యం పెరిగితీరాలి. చరిత్రను పరిశీలిస్తే, అధికారంలో ఉన్నవారి కథలు ఇప్పటికే అనేక రూపాల్లో నమోదయ్యాయి. రాజులు, సామ్రాజ్యాలు, ధనిక వర్గాలు తమ విజయాలను శిల్పాల్లో, గ్రంథాల్లో, చరిత్ర పుస్తకాల్లో శాశ్వతంగా నిలిపాయి. కానీ కూలీ జీవితం, రైతు కన్నీరు, కార్మికుడి శ్రమ, మహిళల అణచివేత, దళితుల అవమానం వంటి దారుణాలు కొన్ని శతాబ్దాలపాటు మౌనంగా మిగిలిపోయాయి. ఈ మౌనాన్ని భగ్నం చేయగల శక్తి సాహిత్యానికి మాత్రమే ఉంది. అందుకే సాహిత్యం అణగారినవారి వైపు నిలబడాలి. పేదరికం కేవలం ఆర్థిక లోపం కాదు. అది ఒక మానవ అనుభవం. ఆకలి, భయం, అవమానం, అస్థిరత కలగలిసిన దుస్థితి. ఈ అనుభవాన్ని గణాంకాలు, ప్రభుత్వ నివేదికలు పూర్తిగా ఆవిష్కరించవు. కానీ ఒక కథ, ఒక కవిత, ఒక నవల ఆ బాధను మనసుకు తాకేలా నిజాలు చెప్పగలుగుతుంది. సాహిత్యం పేదరికాన్ని సంఖ్యగా కాదు, మనిషిగా చూపిస్తుంది. ఇది సాహిత్యం నిర్వహించే అత్యంత ముఖ్యమైన నైతిక బాధ్యత. దోపిడీకి గురవుతున్న వర్గాలు... సాధారణంగా మాట్లాడే అవకాశం లేని మనుషులు.... వారి గొంతులు రాజకీయ వ్యవస్థల్లో, మీడియా వేదికల్లో, అధికార భాషల్లో వినిపించవు. అలాంటి సమయంలోనే, సాహిత్యం ఆ మౌన గొంతులకు భాషను ఇస్తుంది. రచయిత ఒక మధ్యవర్తి కాదు; ఒక బాధ్యత గల సాక్షి. అతడు చూసిన అన్యాయాన్ని, అనుభవించిన అసమానతను, వినిపించని అరుపును మాటలుగా మార్చాలి. అలా చేయకపోతే, సాహిత్యం తన మానవ బాధ్యతను విస్మరించినట్టే అవుతుంది. కాగా, సాహిత్యం అణగారినవారిని ప్రతినిధ్యం వహించాల్సిన మరో కారణం 'నిజం'. సమాజంలోని నిజం ఎప్పుడూ పై వర్గాల జీవితాల్లో ఉండదు. అది వీధుల్లో, పొలాల్లో, ఫ్యాక్టరీల్లో, గనుల్లో, మురికివాడల్లో ఉంటుంది. అక్కడే జీవితం అత్యంత ముడి రూపంలో కనిపిస్తుంది. వాస్తవ పరిస్థితులను పరిచయం చేస్తుంది. అక్కడే శ్రమ ఉంటుంది. ఆకలి ఉంటుంది. అంతర్లీనంగా ప్రతిఘటన అభిలాష కూడా ఉంటుంది. ఈ నిజాన్ని పక్కన పెట్టి చేసే రచనలు అసత్యాలు లేదా అర్ధ సత్యాలు మాత్రమే. సంపూర్ణ సత్యం అణగారిన వర్గాల అనుభవాలను గమనిస్తేనే తెలుస్తుంది. పరిశీలిస్తేనే అర్థమవుతుంది. సమీక్షిస్తేనే రచన పండుతుంది. సాహిత్యం కేవలం 'అద్దం' మాదిరి ఉన్న పరిస్థితులను ప్రతిబింబించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్న ప్రముఖ రచయిత, సాహిత్య పరిశోధకుడు ఏటుకూరి ప్రసాద్ అభిప్రాయాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవాలి. సాహిత్యం సమాజాన్ని కేవలం ప్రతిబింబించడంతోపాటు, లోపాలను ప్రశ్నించాలి. ఇలా ఎందుకు జరుగుతోంది? అనే ప్రశ్న సామాజికంగా, ఆర్థికంగా దోపిడికి గురైన వర్గాల జీవితాల నుంచే ఉద్భవిస్తుంది. ఎందుకు ఒక వర్గం నిరంతరం శ్రమిస్తూనే పేదగానే ఉంటుంది? ఎందుకు కొందరి సంపద మరి కొందరి ఆకలిపై నిలబడుతుంది? ఈ ప్రశ్నలు సాహిత్యంలోకి వచ్చినప్పుడే, అది విమర్శాత్మక శక్తిగా మారుతుంది. అణగారినవారి జీవితాలను రాయడం ద్వారా సాహిత్యం ఈ ప్రశ్నలను సమాజం ముందుకు తెస్తుంది. చాలా కాలం పాటు సాహిత్యం ఉన్నత లేదా సంపన్న వర్గాల భాషలో, వారి అభిరుచులకు అనుగుణంగా రూపొందింది. క్లిష్టమైన భాష, అలంకారిక శైలి, రాజస వాతావరణం వంటి అంశాలే సాహిత్యానికి ప్రమాణాలుగా పేర్కొన్నారు. ముద్ర వేశారు. సంకెళ్లు బిగించారు. ఆలోచనలకు పరిధులు నిర్ణయించారు. కానీ అట్టడుగు వర్గాల అనుభవాలు సాహిత్యంలోకి ప్రవేశించకుండా ఎవరూ నిలువరించలేకపోయారు. ఫలితంగా, సాహిత్యం భాష సరళంగా మారింది. స్పష్టత పెరిగింది. ప్రజల మాటగా మారింది. ఈ పరిణామాన్నిసాహిత్య ప్రజాస్వామ్యీకరణగా పేర్కోవచ్చు. పేదల కథలు రాయడం.. వెతలు ప్రస్తావించడం అంటే కేవలం అంశాన్ని లేదా శిల్పాన్ని మార్చడం కాదు.. సాహిత్య నిర్మాణాన్ని మార్చడం. అణగారిన ప్రజలకు ప్రతినిధ్యం వహించే సాహిత్యం కేవలం వారి మాత్రమే పరిమితం కాదు.. అది సమాజం మొత్తానికి అవసరం. ఎందుకంటే, అలాంటి సానుభూతిని పెంచుతుంది. మనకు ప్రత్యక్షంగా అనుభవం లేని బాధను, సాహిత్యం మనసులోకి తీసుకువస్తుంది. ఒక దళితుడి అవమానం, ఒక కార్మికుడి శ్రమ, ఒక పేద మహిళ నిస్సహాయత వంటి అంశాలను చదివినప్పుడు పాఠకుడు తన సౌకర్య స్థితిని ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. ఇది సాహిత్యం కలిగించే నైతిక అసౌకర్యం. ఈ అసౌకర్యమే మార్పుకు మొదటి మెట్టు. 'చరిత్ర' కూడా సాహిత్యంమవ కీలక పాత్ర పోషించింది. ఇప్పటికీ పోషిస్తునే ఉంది. అయితే, అధికారిక చరిత్రలు ఎక్కువగా విజేతల కథలే. ఓడిపోయినవారి గురించి ప్రస్తావన ఎక్కడా ఉండదు. కానీ, అణచివేతకు గురైన వారి చరిత్రలే సాహిత్యంలోనే ఎక్కువ కాలం నిలుస్తాయి. ఈ సాహిత్యమే భవిష్యత్తు తరాలకు ఇది కూడా జరిగింది అని చెప్పే ఆధారం. అణగారినవారి కథలు లేకపోతే, చరిత్ర అసంపూర్ణం. ఈ కోణంలో చూస్తేనా, సాహిత్యం అత్యధికుల పక్షాన లేదా అణచివేతకు గురైన వర్గాల పక్షపాతిగా ఉండాల్సిన అవసరం స్పష్టమవుతుంది. సాహిత్యం రాజకీయాలకు దూరంగా ఉండాలన్నది కొంత మంది వాదన. కానీ, తరచి చూస్తే, అణచివేతకు గురైన వారి జీవితాలన్నీ ఆయా కాలాల రాజకీయా పరిస్థితులకు ప్రతిబింబాలే. వారి ఆకలి, వారి శ్రమ, వారి అవమానం.. అన్నీ రాజకీయ నిర్ణయాల ఫలితాలే. వాటిని ప్రస్తావించడం రాజకీయాకరణ అనిపించుకోదు. అది ముమ్మాటికీ రాజకీయ వాస్తవాన్ని అంగీకరించడం. సాహిత్యం తటస్థంగా ఉండాలన్న మరో చిత్రమైన వాదన కూడా వినిపిస్తుంది. ఈ ఆలోచన, దోపిడీ వర్గాలకు కొమ్ముకాచే రచయితల నుంచి మాత్రమే వస్తుందనేది బహిరంగ రహస్యం. అణగారినవారికి తటస్థత అనే అవకాశం ఉండదు. శతాబ్దాల అణచివేతను ఎదుర్కోవడానికి వారిని ఆలోచింప చేయడం.. ప్రశ్నించే గుణాన్ని రగిలిచడం.. కొత్త ఉత్సాహాన్ని నింపడం సాహిత్యం ధర్మం. వారి గురించి రాయడం అంటే వారి పట్ల దయ చూపడం కాదు.. వారిని గౌరవించడం. వారిని బాధితులుగా చూడడం కాదు.. ధిక్కరించే పోరాట యోధులుగా, మార్పుకోరే మనుషులుగా చూపడం. ఇది సాహిత్య కనీస బాధ్యత. సాహిత్యం వారిని కేవలం ప్రతినిధ్యం వహించదు.. వారిని చరిత్రలో క్రియాశీల పాత్రలుగా నిలుపుతుంది. ఏ రకంగా చూసినా, సాహిత్యం అణగారినవారిని, పేదలను, దోపిడీకి గురవుతున్న వారిని ప్రతినిధ్యం వహించాలనేది ఐచ్ఛికం కాదు. ఒక నైతిక అవసరం. సాహిత్యం మానవ అనుభవాల సంపూర్ణ చిత్రాన్ని ఆవిష్కరించాలంటే, సమాజంలోని అతి బలహీన వర్గాల జీవితాలు అందులో ఉండితీరాలి. వారి కథలు లేకుండా సాహిత్యం అందంగా ఉండొచ్చు, కానీ నిజంగా ఉండదు. మానవీయ కోణం ఉండదు. మానవతను చూపలేని సాహిత్యం ఎందుకు? ఎవరిని ఉద్ధరించడానికి?

– బిఎల్




సాహిత్యం పరీక్షల కోసం పుట్టిన పాఠ్యాంశం కాదు.. రచన ఏదైనా, అది మనిషి అనుభూతి నుంచి పుట్టిన జీవంతమైన కళ. నిజంగా కవిత్వాన్ని అనుభవించినప్పుడు, మనలో ఒక కొత్త భావం మేల్కొంటుంది లేదా పాత అనుభూతి కొత్తగా పునర్జన్మిస్తుంది. అందుకే సాహిత్యం ఇంతకాలంగా నిలిచి ఉంది.... దానికి మనిషి అంతఃకరణాన్ని తాకగలిగే శక్తి కలిగి ఉంది. పదాలు, చర్యలు, భావాలు పరస్పరం కలిసే విధానం నుంచే సాహితీ ప్రక్రియలు ఉద్భవించాయి. ఒకే మాట వేర్వేరు వ్యక్తుల చేతిలో వేర్వేరు లోతులను సంతరించుకుంటుంది. కొన్ని ప్రయోగాలు పైపైగా ఉంటే, మరికొన్ని మనల్ని లోపలికి తీసుకెళ్తాయి. ఆ లోతునే రచనలు అన్వేషిస్తుంటాయి. కవిత్వం పుస్తకాల ద్వారా మన దగ్గరకు వచ్చినా, అది నిజంగా జీవించాలంటే పాఠకుడి అంతర్గత స్పందన అవసరం. మన జ్ఞాపకాలు, భావోద్వేగాలు, శరీరస్పందన... ఇవే కవితకు ప్రాణం పోస్తాయి. కవిత్వాన్ని కేవలం అర్థం చేసుకోవడం కాదు, దానిని మనలోకి అనుమతించడం ముఖ్యం. చదివేటప్పుడు కవి మనకంటే దిగువగా మాట్లాడుతున్నట్టు అనిపించకూడదు.. మనమే అతని స్థాయికి ఎదిగి చదవాలి. కవిత్వం ప్రతి రోజు కొత్తదిగా అనిపిస్తుంది. ఒకే సూర్యుడిని వేర్వేరు మనుషులు వేర్వేరు రీతుల్లో చూసినట్లే, ఒకే కవిత కూడా ప్రతి పాఠకుడికి భిన్నంగా అనుభూతి ఇస్తుంది. ఈ విధంగా కవిత్వం ప్రపంచాన్ని వ్యక్తిగతంగా స్వంతం చేసుకునే అత్యంత లోతైన మార్గాన్ని మనకు అందిస్తుంది. అందుకే కవిత్వాన్ని ఆస్వాదించడమంటే, దానిని త్వరగా ముగించడం కాదు, దానితో కొంతసేపు జీవించడం. అప్పుడు మాత్రమే అది మనకు ఇవ్వగలిగిన నిజమైన ఆనందం, అవగాహన లభిస్తాయి.



## 'జార్జ్ ఆర్వెల్'ను చదవడానికి ధైర్యం అవసరం

జార్జ్ ఆర్వెల్‌ను చదవడం కేవలం ఒక సాహిత్య అనుభవం. నైతిక అసౌకర్యాన్ని స్వీకరించే ధైర్యం. ఆయన రచనలు పాఠకుణ్ణి ఊరడించవు. సమస్యల నుంచి పారిపోవడానికి దారులు చూపవు. అవి నేరుగా మన ఆలోచనల మధ్య నిలబడి ప్రశ్నిస్తాయి. అధికారానికి నిజం అసౌకర్యంగా మారిన వేళ, రచయిత ఎక్కడ నిలబడాలి అనే ప్రశ్నకు ఆర్వెల్ తన జీవితం, రచనల ద్వారా 'సత్యం వైపు' మాత్రమే నిలబడతానన్న సమాధానం.. సందేశం ఇచ్చాడు. 1903లో బ్రిటిష్ ఇండియాలో జన్మించిన ఎరిక్ ఆర్థర్ బ్లేర్, తరువాత జార్జ్ ఆర్వెల్‌గా ప్రపంచానికి పరిచయమయ్యాడు. సామాజికంగా గౌరవం ఉన్నా ఆర్థికంగా అస్థిరమైన కుటుంబంలో పెరిగిన ఆర్వెల్, చిన్ననాటి నుంచే వర్గ భేదాల గమనించాడు. అనుభవించాడు. ప్రతిష్ఠాత్మక పాఠశాలల్లో చదువుతున్న సమయంలో కూడా, ధనం లేని ప్రతిభ ఎలా అవమానానికి గురవుతుందో ప్రత్యక్షంగా చూశాడు. ఈ అనుభవాలే అధికార వ్యవస్థల పట్ల ఆయనలో సహజమైన అనుమానాన్ని పెంచాయి. బర్మా (నేటి మయమ్మార్)లో బ్రిటిష్ సామ్రాజ్య పోలీస్ అధికారిగా పనిచేసిన కాలం ఆర్వెల్ జీవితంలో కీలక మలుపు. అక్కడే అణచివేత పాలన బాధితులను మాత్రమే కాదు, పాలకులను కూడా నైతికంగా పాడు చేస్తుంది' అనే ఒక కఠినమైన నిజాన్ని ఆయన గ్రహించాడు. 'షూటింగ్ యాన్ ఎలిఫెంట్' వంటి వ్యాసాలు సామ్రాజ్యవాదం అమానుషత్వాన్ని, అధికారంలో ఉన్న వ్యక్తి అంతర్లీన అసహాయతను బహిర్గతం చేస్తాయి. చివరికి ఆయన ఆ ఉద్యోగాన్ని వదిలి, రచననే తన ప్రతిఘటనా పథంగా ఎంచుకున్నాడు. రచయితగా మారిన తరువాత ఆర్వెల్ ఉద్దేశపూర్వకంగానే పేదల జీవితాన్ని అనుభవించాడు. పారిస్, లండన్‌లలో నిరాశ్రయులు, కార్మికులతో కలిసి జీవిస్తూ, నాగరిక సమాజం దాచిపెట్టిన నిజాలను చూశాడు. 'డౌన్ అండ్ అవుట్ ఇన్ పారిస్ అండ్ లండన్' ఈ అనుభవాల ప్రత్యక్ష ఫలితం. జార్జ్ ఆర్వెల్ అనే కలం పేరు కూడా సాధారణ ప్రజలతో తన అనుబంధానికి ప్ర తీక. ఆర్వెల్ రాజకీయంగా సామ్యవాదానికి దగ్గరగా ఉన్నప్పటికీ, ఏ భావజాలానికీ అంధ భక్తుడు కాలేదు. స్పానిష్ సివిల్ వార్‌లో పాల్గొన్నప్పుడు, ఫాసిజంతో పాటు స్టాలినిజం చేసిన ద్రోహాన్ని కూడా ప్రత్యక్షంగా చూశా డు. 'హోమేజ్ టు కాటలోనియా' ఆయన రాజకీయ నిజాయితీకి సాక్ష్యం. తనకు అనుకూలంగా లేని నిజాన్ని కూడా నిర్భయంగా రాయగల ధైర్యమే ఆర్వెల్ ప్రత్యేకత. 'యానిమల్ ఫార్మ్', 'నైన్టీన్ ఎయిటీ ఫోర్' (1984) వం టి రచనలు ఆయన ఆలోచనల శిఖరాలు. ఇవి కేవలం రాజకీయ రూపకా లు... అధికార దుర్వినియోగం, ప్రచారం, భాషా వక్రీకరణలపై తీవ్రమైన హెచ్చరికలు... ముఖ్యంగా భాషను అస్పష్టంగా మార్చడం ద్వారా నిజాన్ని ఎలా చంపుతారో ఆయన చూపించిన తీరు, ఈ రోజుకీ అంతే సమకాలీనం గా ఉంది. ఆర్వెల్‌ను నవలా రచయితగా మాత్రమే గుర్తించడం అన్యా యం. తన జీవితంలో ఎక్కువ భాగం ఆయన జర్నలిస్టు, వ్యాసకర్త, విమర్శకుడర, సమాజాన్ని దగ్గర నుంచి గమనించిన ప్రత్యక్ష సాక్షి. 'ది రోడ్ టు విగాన్ పియర్'లో కార్మిక వర్గ జీవనాన్ని, తరగతి విభజనల క్రూరత్వా న్ని నిర్భయంగా చిత్రించాడు. సాహిత్య విమర్శకుడిగా ఆయన స్పష్టత, నైతిక బలం ప్రసిద్ధి చెందాయి. ఏ రచన చదివినా, 'పేజీ వెనుక ఎక్కడో ఒక ముఖం కనిపిస్తుంది' అనే ఆయన వ్యాఖ్య, రచన–రచయిత వ్యక్తిత్వాల మధ్య ఉన్న అనుబంధాన్ని లోతుగా తెలియజేస్తుంది. సత్యం ఎప్పుడూ సౌకర్యంగా ఉండదు. కానీ దాన్ని వదిలిపెడితే మానవత్వమే ప్రమాదంలో పడుతుందనే ఒక స్పష్టమైన సందేశాన్ని ఆర్వెల్ వారసత్వం మనకు అందిస్తుంది. ఆర్వెల్ మనల్ని ఊరడించలేదు.. మేల్కొలిపాడు. అందుకే ఆయన రచనలు కాలాన్ని దాటి, ఇంకా మన వెంటే నడుస్తున్నాయి.




## కమ్యూనిజంతో కొత్త ఒరవడి...


నిజమైన సాహిత్యం ఎప్పుడూ సమాజంతో మమేకమవుతుంది. సమాజంలోని ఆర్థిక నిర్మాణాలు, రాజకీయ శక్తులు, వర్గ సంబంధాలు, చరిత్రాత్మక సంక్షోభాల మధ్యనే రూపుదిద్దుకుంది. ఈ వాస్తవాన్ని అత్యంత స్పష్టంగా, ఎలాంటి భేషజాలు లేకుండా వెల్లడించే సిద్ధాంతమే కమ్యూనిజం. ప్రపంచ సాహిత్యంపై ప్రభావం చూపిన సామాజిక అంశాలను.. కమ్యూనిజం భావజాలాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూడడం పొరపాటు. శ్రమ దోపిడీని వ్యతిరేకించి, సమసమాజాన్ని కమ్యూనిజం కోరుకుంటుంది. అందుకే, అది సాహిత్య దృష్టికోణాన్నే మౌలికంగా మార్చిన చారిత్రక పరిణామంగా నిలుస్తుంది. వ్యక్తిగత భావోద్వేగాలకే పరిమితమైన సాహిత్యాన్ని, సామాజిక బాధ్యతగా మార్చిన శక్తి కమ్యూనిజం. కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాద సిద్ధాంతం సాహిత్యానికి ఒక కొత్త అవగాహనను ఇచ్చింది. సాహిత్యం అనేది శాశ్వత మానవ స్వభావానికి ప్రతిబింబం అనే భావనకు బదులుగా, అది నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల ఫలితం అనే కొత్త ఆలోచన తెరపైకి తెచ్చింది. వర్గ పోరాటమే చరిత్రకు మూలమైతే, సాహి త్యం ఆ పోరాటానికి ఒక సాంస్కృతిక ప్రతిరూపం అనే అవగాహన ఏర్పడింది. ఈ దృష్టి సాహిత్య విమర్శలో, రచనా పద్ధతుల్లో, పాత్ర నిర్మాణంలో, భాష వినియోగంలో విప్లవాత్మక మార్పులకు దారితీసింది. పదొమ్మిదవ శతాబ్దం చివరి వరకు



యూరప్ సాహిత్యం ప్రధానంగా మధ్యతరగతి లేదా అరిస్టోక్రాటిక్ అనుభవాలను ప్రతిబింబించింది. పరిశ్రమల విప్లవం వల్ల పుట్టిన కార్మిక వర్గం సాహిత్యంలో కనిపించినా, అది ప్రధాన పాత్రగా కాదు, నేపథ్యంగా మాత్రమే ఉండేది. కమ్యూనిజం ఈపరిస్థితిని తల్లకిందులు చేసింది. కార్మికుడు, రైతు, పేదవాడు, అణగారిన వర్గాలు సాహిత్యంలో చరిత్ర సృష్టించే శక్తులుగా ప్రవేశించాయి. పాత్రలు మాత్రమేకాదు.. కథ కేంద్ర బిందువు మారింది. రష్యన్ విప్లవం తరువాత సాహిత్యం పొందిన మార్పు దీనికి స్పష్టమైన ఉదాహరణ. మాక్సిమ్ గోర్కీ రచనల్లో కార్మిక వర్గం ఒక దయనీయ స్థితిలో ఉన్న సమూహంగా కాకుండా, చైతన్యంతో కూడిన చారిత్రక శక్తిగా కనిపిస్తుంది. 'మదర్' నవలలో తల్లి పాత్ర వ్యక్తిగత మాతృత్వాన్ని మించి, సామూహిక రాజకీయ చైతన్యానికి ప్రతీకగా గోచరిస్తుంది. ఇది కమ్యూనిస్టు సాహిత్యం తీసుకువచ్చిన కొత్త పాత్ర నిర్మాణ పద్ధతి. సాహిత్యం తటస్థంగా ఉండలేదనే ఈ భావన స్పష్టంగా మా ర్క్సిస్టు ప్రభావంతోనే పుట్టింది. రచయిత తన కాలానికి, తన సమాజానికి జవాబుదారీ అనే ఆలోచన, అప్పటి వరకూ కొనసాగుతున్న ఆధునిక సాహిత్య మౌలిక స్వరూపాన్ని మార్చింది. తెలుగు సాహిత్యంలో కమ్యూనిజం ప్రభావం భాషా స్థాయిలోనే ఒక విప్లవాన్ని తెచ్చింది. శ్రీశ్రీ కవిత్వం సాంప్రదాయ కవితా భాషను పక్కకునెట్టింది. ప్రజల మాటను సాహిత్యంగా మార్చిం ది. ఇది కమ్యూనిజం చేసిన అత్యంత కీలక సా హిత్య సేవ. సరళమైన భాషలో ప్రజలకు చేరడం ద్వారా సాహిత్యం అధికార కేంద్రాల నుంచి జనబాహుళ్యం చేతుల్లోకి వచ్చింది. హక్కుల నినాదం... కార్మికుడి మాట.. రైతు ఆవేదన... శ్వేదం వలువ వంటివి సాహిత్యంలో కీలకంగా మారాయి. సాహిత్యాన్ని సామాజిక బాధ్యతతో ముడిపెట్టడం, అణగారిన వర్గాల అనుభవాలను కేంద్రంగా నిలపడం, భాషను ప్రజల వైపు మళ్లించడం వంటివి సాహిత్యానికి కమ్యూనిజం అందించిన అత్యంత విలువైన భావనలు. స్థూలంగా చెప్పాలంటే, కమ్యూనిజం ప్రపంచ సాహిత్యాన్ని ఒక కీలక ప్రశ్న అడగడం నేర్పింది.. సాహిత్యాన్ని తటస్థ వినోదం నుంచి బయటకు తీసుకొచ్చింది. చరిత్రలో జోక్యం చేసుకొని, సమూలంగా మార్చగల శక్తిగా తీర్చిదిద్దింది. దోపిడి ఉన్నంత కాలం... అణచివేతలు కొనసాగినంత కాలం.. లేనివాడిని ఉన్నవాడు దోచుకుతింటున్నంతకాలం.. ధనిక, పేద వర్గాల మధ్య అగాథం పెరిగినంతకాలం... కమ్యూనిజం సాహిత్యంలో ప్రవేశపెట్టిన చైతన్యం ఎప్పటికీ జీవించే ఉంటుంది.

## నాజీలను ధిక్కరించిన 'ది యంగ్ గార్డ్'

అలెగ్జాండర్ ఫదేయేవ్ రాసిన 'ది యంగ్ గార్డ్' రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన సోవియట్ యువకుల గెరిల్లా దళం యంగ్ గార్డ్ నిజ ఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న నవల. ఒలెగ్ కొషోవోయ్, ఉల్యానా, ల్యూబా వంటి యువకులు రహస్యంగా యువతను సంఘటితం చేసి నాజీలకు ఎదురుదాడులు చేస్తారు. దేశ భక్తి, త్యాగం, ఐక్యత, ద్రోహం వంటి అంశాలపై కథ సాగుతుంది. సోషలిస్టు రియలిజం భావజాలానికి అనుగుణంగా ఈ నవల యువత యొక్క ధైర్యం, సమూహశక్తి, విప్లవ నిబద్ధతను చాటి చెప్పే రీతిలో నిర్మితమైంది. నిజ జీవిత యోధులను ఆదర్శవంతంగా చూపుతూ, సోవియట్ సమాజం కోరుకున్న విలువలను ప్రతిబింబిస్తుంది. నికొలాయ్ ఓస్ట్రోవ్‌స్కీ రచించిన 'హౌ ది స్టీల్ వాజ్ టెంపర్డ్' సోవియట్ సాహిత్యంలో అత్యంత ప్రభావవంతమైన, ప్రేరణాత్మక కృతి. ఇది సోషలిస్టు రియలిజం సంప్రదాయానికి ఆదర్శంగా నిలిచిన నవల. ఇందులో ప్రధాన పాత్ర పావెల్ కొర్చాగిన్, విప్లవం, పౌర యుద్ధం, సామాజిక మార్పు వంటి కఠిన పరిస్థితుల్లో తన మనోబలాన్ని, నిబద్ధతను ఎలా 'ఉక్కు'లా పదును పెట్టుకున్నాడో రచయిత వివరిస్తాడు. పావెల్




బాల్యంలో ఎదుర్కొన్న అన్యాయం, యుద్ధంలో పొందిన గాయాలు, శారీరక వైకల్యం వంటి అంశాలేవీ అతని సంకల్పాన్ని తగ్గించవు సరి కదా, మరింత బలపరుస్తాయి. వ్యక్తిగత జీవితం కంటే సమాజ సేవకు అతను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు. పావెల్ ప్రయాణం కేవలం ఒక వ్యక్తిగత పోరాటం మాత్రమే కాదు.. సమాజవాద నిర్మాణంలో ఒక సాధారణ కార్మికుని పాత్ర ఎంత మహత్తరమైందో చూపించే ప్రతీక. త్యాగం, అచంచల సంకల్పం, శ్రమజీవుల వీరత్వం, సిద్ధాంత నిబద్ధత వంటివి ఈ రచనలో ప్రధానాంశాలు. కథా నిర్మాణం భావోద్వేగం, వాస్తవికత మేళవింపుతో ఉంటుంది. సోవియట్ యువతకు ఈ నవల దశాబ్దాల పాటు ప్రేరణగా నిలిచింది.

జర్మన్ సాహిత్యంలో అత్యంత పేరుప్రఖ్యాతులు ఆర్జించిన నాటక రచయిత, కవి బెర్టోల్ట్ బ్రెచ్ట్ (1898–1956). సామాజిక రుగ్మతలు, అసమానతలు, కళ్లు అతని రచనల్లో వ్యంగ్యంగా కనిపిస్తాయి. రాజకీయ విమర్శ, మనస్తత్వ పరిశీలనలు అతని నాటకాలు చదివిన లేదా ప్రదర్శిస్తున్నప్పుడు చూసిన ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఆలోచనలకు జీవం పోస్తాయి. బ్రెచ్ట్ ఎపిక్ థియేటర్ అనే కొత్త నాటక రూపాన్ని పరిచయం చేశాడు. ఈ పద్ధతిలో ప్రేక్షకులు కథలో మునిగిపోకుండా, సంఘటనలపై విశ్లేషణాత్మకంగా ఆలోచిస్తారు. యుద్ధం వల్ల సాధారణ ప్రజలకు వచ్చే పీడను చూపే 'మదర్ కరేజ్ అండ్ హర్ చిల్డ్రన్', నేర, సామాజిక అసమానత, దారిద్రతపై వ్యంగ్యాత్మక వ్యాఖ్య 'ది త్రీపెన్నీ ఒపెరా', శాస్త్రవేత్తల సామాజిక బాధ్యతను, సైన్సు–సామాజిక సంబంధాన్ని ప్రతిబింబించే 'ది లైఫ్ ఆఫ్ గెలీలియో' అతని రచనల్లో ప్రధానమైనవి. అవన్నీ సోషలిస్టు రియలిజం స్వభావాలను కలిగి ఉంటాయి.

## ఈ వారం కవితలు (వందేళ్ల సిపిఐ సంబురాల సందర్భంగా)

### మా మాట కమ్యునిజం



మా మాట కమ్యునిజం
మా పాట కమ్యునిజం
మా బాట కమ్యునిజం
మా ఆశ కమ్యునిజం
మా శ్వాస కమ్యునిజం

మా ఆశయం కమ్యునిజం
మా ఆదర్శం కమ్యునిజం
మా ఆలోచన కమ్యునిజం
మా ఆచరణ కమ్యునిజం
మా ప్రేరణ కమ్యునిజం
మా ఉత్ప్రేరణ కమ్యునిజం

మా ఇజం కమ్యునిజం
మా నిజం కమ్యునిజం
మా నడక కమ్యునిజం
మా నడత కమ్యునిజం
మా నాదం కమ్యునిజం
మా నినాదం కమ్యునిజం

మా వాదం కమ్యునిజం
మా వేదం కమ్యునిజం
మా స్వప్నం కమ్యునిజం
మా స్వర్గం కమ్యునిజం
మా వరం కమ్యునిజం

మా శిక్షణ కమ్యునిజం
మా క్రమశిక్షణ కమ్యునిజం
మా రక్షణ కమ్యునిజం
మా నిరీక్షణ కమ్యునిజం
మా కులం కమ్యునిజం

మా కలం కమ్యునిజం

మా హలం కమ్యునిజం
మా బలం కమ్యునిజం
మా మతం కమ్యునిజం
మా అభిమతం కమ్యునిజం
మా జ్ఞానం కమ్యునిజం
మా విజ్ఞానం కమ్యునిజం
మా తత్వం కమ్యునిజం
మా శాస్త్రం కమ్యునిజం
మా శస్త్రం కమ్యునిజం
మా అస్త్రం కమ్యునిజం

మా కవిత కమ్యునిజం
మా కళలు కమ్యునిజం
మా సంగీతం కమ్యునిజం
మా సాహిత్యం కమ్యునిజం
మా నృత్యం కమ్యునిజం
మా కళారూపాలు కమ్యునిజం

మా గమనం కమ్యునిజం
మా గమ్యం కమ్యునిజం
మా బతుకు కమ్యునిజం
మా భవిత కమ్యునిజం

– ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

### ప్రగతిమార్గం



ఆకాశమంతా అరుణపతాకం
సుత్తి కొడవలి కార్మిక కర్షక చిహ్నం
చైతన్యంతో సాగిపోతుంది
మన భారత కమ్యూనిస్టు సైన్యం

ఎంతోమంది అమరుల రక్తంతో
ఎరుపెక్కినది ఆ జెండా, అది సత్యం
వందేళ్ళుగా రెపరెపలాడుతూ
అదే చైతన్య స్రవంతిలో అనునిత్యం.
॥ ఆకాశ ॥

మారక్స్ ఎంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళిక
రష్యా బకునిన్ సిద్ధాంతం వెలుగులో
కర్షక కార్మికులను ఏకంచేసి
ప్రజాసైన్యం నిర్మించినది
॥ ఆకాశ ॥

గద్దర్ వీరులు, బొల్షివిక్ విప్లవం
రష్యామార్గం ప్రపంచ పోరాటాలు స్ఫూర్తితో
భారత దేశంలో కమ్యూనిస్టు సైన్యం
కవాతు చేస్తూ నడిచింది
॥ ఆకాశ ॥

లాఠీలు తూటాలు నిషేధాలు
నిర్బంధాలు ఎదుర్కొని
అతివాద మితవాద
కాంగిరేసుతో భుజం కలిపి
ఆంగ్లేయులను దేశం నుండి
తరిమికొట్టిన పార్టీరా!
॥ ఆకాశ ॥

బ్రిటీషు దొరలను తరిమికొట్టినది
సంస్థానాధీషులను అంతమొందించినది
బూర్జువా భూస్వాముల గడీలను
ధ్వంసం చేసినది మూడక్షరాల
మన సిపిఐ ముందు కేగినదిరా!
॥ ఆకాశ ॥

ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్
కార్మిక కర్షక మేధావి ప్రజాసంఘాలే
అంగాలుగా ముందుకునడిచి
అన్నిరంగాల్లో దూసుకు పోయిన
చైతన్య కెరటమే మన సిపిఐ రా!

కర్షకులకు గిట్టుబాటు ధరలు
కార్మికులకు కనీస వేతనాలు
స్త్రీలకు శ్రమకు తగ్గ జీత భత్యాలు
నియమిత పనిగంటలు
విద్యా, వైద్య సౌకర్యాలు
సాధించిపెట్టిన పార్టీ మనదిరా!
॥ ఆకాశ ॥

భారత కమ్యూనిస్టు పార్టీ
ఉమ్మడికుటుంబం నుండి
చిన్న చిన్న సైద్ధాంతిక వైరుధ్యాలతో
మన అన్నదమ్ములు
కమ్యూనిస్టులు వేరుపడినారు.
ఉమ్మడి ఆశయం కోసం
వారు పోరాడుతున్నారు.
॥ ఆకాశ ॥

చీలిపోయి పేలిపోయి చిన్న పార్టీలుగా
బలహీనపడి ప్రజలకు దూరమయ్యారు
ఓ కమ్యూనిస్టు సోదరులారా!
సామ్రాజ్య వాద, పెట్టుబడిదారి
పార్టీలకు బలమిస్తున్నారు
॥ ఆకాశ ॥

మనదేశంకోసం మన ప్రజలకోసం
మనమంతా ఒక్కటై
వామపక్ష ప్రజాతంత్ర
ఐక్య సంఘటనగా ఏర్పడి
బలమైన రాజకీయశక్తిగా
ఎదుగుదాం భారతదేశాన్ని
ప్రగతిమార్గంలో నడుపుదాం

బూర భిక్షపతి
సెల్ : 9866612717

### అవని పైన గొప్పగా ఎగురుతున్న ఎర్రజెండ

అవని పైన గొప్పనైన
ఎగురుతున్న జెండా
ఎర్రజెండరో
అన్నలారో కూలన్నలారో
అన్నలారో రైతన్నలారో
అవని పైన గొప్పనైన
ఎగురుతున్న జెండా ఎర్రజెండరో

భారతావనిలో నూరేళ్ల కేతనం
అరుణ కేతనం రా
కష్టాలను కడదేర్చ ఎర్రజెండ పట్టరా
కమ్యూనిస్టుగ నీవు వీరుడవై కదలిరా
॥ అన్నలారో ॥

మానవతను పంచియిచ్చే
గొప్పనైన జెండా ఎర్రజెండరా
మనువాదాన్ని మట్టుబెట్టే
జెండరా ఎర్రజెండరా
మనుషులంత ఒకటని చెప్పే జెండరా
ఏకైక జెండరా ఎర్రజెండారా
॥ అన్నలారో ॥

దోపిడీని ఎండగట్టె
జెండా ఎర్రజెండరా
ఉన్నోడు లేనోడని లేకుండా
చేసేది ఎర్రజెండరా
అసమానతలద్దంటూ
పోరుజేసే జెండా ఎర్రజెండరో
సమసమాజాన్ని తెచ్చే జెండా
ఎర్రజెండరో //
॥ అన్నలారో ॥

శత్రువెవడో మిత్రువెవడో తేల్చేటి
జెండా ఎర్రజెండారా
శత్రువును ఓడించ
మిత్రులను కలుపుకుంటూ
పయనమయ్యే జెండా ఎర్రజెండరా
కాపిటలిస్టు సమాజాన్ని
సమాధిజేసేటి జెండా ఎర్రజెండరా
॥ అన్నలారో ॥

ప్రజాస్వామ్యానికి పట్టం గట్టేది
ఎర్రజెండారా
మతోన్మాదాన్ని మసి జేసే
జెండా ఎర్రజెండరా
ఫాసిజానికి పాడెగట్టె జెండా
ఎర్రజెండరా సోషలిజం తెచ్చే
ఏకైక జెండా ఎర్ర జెండరా
॥ అన్నలారో ॥

డా. మార్క శంకర్ నారాయణ
9908416664



## 'ప్రజాపక్షం' ఎల్లప్పుడూ ప్రజల పక్షమే

**ప్రజాపక్షం/చింతలపాలెం :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపక్షం దినపత్రిక పనిచేస్తుందని సిపిఐ జిల్లా నాయకులు ఉస్తెల నారాయణ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి సిహెచ్ రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నందు ప్రజాపక్షం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించి వారు మాట్లాడారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజంలో ఎటువంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం కొరకు నిరంతరం పనిచేస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ వస్తుందని తెలిపారు. ప్రజాపక్షం ఎల్లప్పుడూ ప్రజల పక్షంగా ఉంటూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం మండల రిపోర్టర్ షేక్ అబ్దుల్ రహీం, సిపిఐ గ్రామ కార్యదర్శి గంధం మంగయ్య, నాయకులు అబ్దుల్ భాష, భూక్య రామారావు, గంధం కొండ, మహ్మద్ ఖాసీం, గాలి సాబ్, తోకల సైదులు, హైమావతి, భీమిశెట్టి పద్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుక ప్రజాపక్షం



**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రజల గొంతుకగా ప్రజాపక్షం జాతీయ దినపత్రిక పనిచేయాలని వర్కాల గ్రామ సర్పంచ్ కుర్మేటి పుష్పలత ప్రశాంత్ అన్నారు. మండల పరిధిలోని వర్కాల గ్రామంలో ఆదివారం ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను పుష్పలత చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు పని చేయాలన్నారు. నిత్యం ప్రజా సమస్యలను పరిశీలిస్తూ వాటిని ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం పత్రికలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్మేటి కృష్ణయ్య, కుర్మేటి ప్రశాంత్, కుర్మేటి పెంటయ్య, జగన్, జంగయ్య, ప్రజాపక్షం రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/నల్లగొండ:** సంక్రాంతి పండుగ అనంతరం తిరుగు ప్రయాణాలు చేసే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించి ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ సంక్రాంతి పండగ ముగించుకొని తిరుగు ప్రయాణ రద్దీ దృష్ట్యా సమగ్ర ట్రాఫిక్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. నల్లగొండ జిల్లా పరిధిలో సంక్రాంతి పండగ ముగించుకుని ఆంధ్ర ప్రాంతం నుంచి హైదరాబాద్ దిశగా తిరుగు ప్రయాణాలు అధికంగా సాగుతున్న నేపథ్యంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పో లీస్ శాఖ సమగ్రచర్యలు చేపట్టినట్లు తెలిపారు.జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ముఖ్య కూడళ్లలో 450 మంది పోలీస్ అధికారులు, సిబ్బం దితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టామన్నారు. వాహన రద్దీని ఎప్పటి కప్పుడు గమనించేందుకు డ్రోన్ల ద్వారా గాలిలో నుంచే నిరంతర పర్యవేక్షణ నిర్వహి స్తూ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చోట్ల వెంటనే ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పద్మశాలీలు రాజకీయంగా బలపడాలి


### డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పద్మశాలీలు రాజకీయంగా బలోపేతమై రాజ్యాధికారంలో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత అన్నారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2026 నూతన క్యాలెండర్ ని ఆదివారం నల్లగొండ జిల్లా కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస నేత నల్లగొండ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏశాల విశ్వకుమార్ తదితర నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగుల సంఘం పేద పద్మశాలీలలకు ఆర్థికంగా ఎదగడానికి సహకరించాలని పద్మశాలీలు రాజకీయంగా బలోపేతమై రాజ్యాధికారంలో పాలుపంచుకోవాలన్నారు. ఆ సంఘం నల్లగొండ ,సూర్యాపేట జిల్లాల అధ్యక్షులు నల్ల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి యేశాల విశ్వకుమార్లు మాట్లాడుతూ సంఘం ద్వారా పేద విద్యార్థులను ఆదుకోవటంతో పాటుగా పలు సేవా కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలోరాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు మిర్యాల వెంకటేశం, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నల్లగొండ సూపరింటెండెంట్ గుర్రం నర్సింహా రావు నేత, విద్యుత్ శాఖ బిసి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజలకు నాయకులుగా ఉండాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సర్పంచులు రాజకీయ పార్టీలకు బందీలుగా కాకుండా ప్రజలకు నాయకుడిగా ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ట్రైకర్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు, లంబాడి పోరాట హక్కుల సమితి అధ్యక్షులు భూక్య రాజు నాయక్ అధ్యక్షతన ఎల్‌హెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో గిరిజన సర్పంచులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రైకర్ నుంచి కూడా గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తానని గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో తండాలకు నిధులు కేటాయించాలని గ్రామ పంచాయితీలకు రూ.5 కోట్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎల్‌హెచ్‌పిఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆయా తండాలలో సర్పంచులుగా ఎన్నికైన వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాల నాయక్, ధరావత్ బిక్షం నాయక్, భూక్య కోటియా నాయక్, బానోత్ నందులాల్, మోతిలాల్, వాంకుడోత్ వెంకన్న, ధరావత్ అజయ్, చత్రు నాయక్, సక్రు నాయక్ పాల్గొన్నారు.







## ఖమ్మం సభకు సిపిఐ శ్రేణులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభ సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ జెండా ఆవిష్కరించారు. మహాసభకు బయలుదేరిన వాహనాలకు పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవిఎల్, బొమ్మగాని నాగభూషణం, చామల అశోక్ కుమార్, అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దీకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సిపిఐ భారతదేశంలో ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి అయిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన బహిరంగ సభకు నల్లగొండ నుండి పెద్ద ఎత్తున కార్మికులు ప్రజలు తరలివెళ్లిన బస్ లను దేవేందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కెవిఎస్‌రెడ్డి. ఏఐటీయూసీ జిల్లా నాయకులు డి వెంకటేశ్వర్లు.పి నాగరాజు. జిల్లా యాదయ్య,ఎన్‌ఆర్‌సి రాజు.సైదులు,ఎండి జానీ, మదార్, యూసుఫ్. ధనలక్ష్మి, సుజాతా, స్వామి, జనయ్యా ,నాగార్జున,శ్రీను పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు ఆదివారం ఖమ్మం సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు బయలుదేరారు. దేవరకొండ నియోజకవర్గం జనసేవా దళ్ ఏఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ బృందానికి జెండా ఊపి ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి. దేవరకొండ నియోజకవర్గం నుండి భారీగా సిపిఐ క్యాడర్ తరలివెళ్లినట్లు తెలిపారు.



## ఇబ్రహీంపురంలో చిరుత పులి కలకలం

### లేగదూడలపై దాడిచేసి చంపిన పులి

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి,అటవీశాఖ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** గత రెండుమూడు రోజులనుంచి చిరుతపులి అలజడితో ఇటు తుర్కపల్లి మండలం, అటు రాజపేట మండలంలోని గ్రామాల్లో చిరుతపులి కలకలం రేపుతోంది. ప్రజలు అటు భయాందోళనకు గురవుతున్న సమయంలో శనివారం రాత్రి తుర్కపల్లి మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో మాటూరి కృష్ణగౌడ్ అనే రైతుకు చెందిన రెండు లేగదూడలపై దాడి చేసి చంపి సమీపంలోని ఫారెస్ట్ అడవిలోకి వెళ్లిందని పోలీసులు తెలిపారు. బావులవద్ద కట్టేసిన ఆవుల వద్దకు రాత్రి దాడికి పాల్పడిన చిరుత ఒక దూడను మెడ కొరికి తాడుతో కట్టేయడంతో దాన్ని అక్కణ్ణే వదిలేసి, కేవలం 20 రోజుల కిందట జన్మించిన పసి లేగదూడను చంపి ఎత్తుకెళ్లడంతో రైతులు, ప్రజల గుండెల్లో భయం మరింత ఎక్కువైంది. విషయాన్నీ తెలుసున్న డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఫారెస్ట్ జిల్లా అధికారులు సుధాకర్ రెడ్డి, యాదగిరిగుట్ట సిఐ శంకర్ గౌడ్, తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్, అటవీశాఖ, ఫారెస్ట్ పోలీస్ అధికారులు రమేష్ నాయక్, షాలిని, శేఖర్ రెడ్డి, బీట్ ఆఫీసర్ నర్మద, మల్లేశం, పార్వతిలు ఘటనా స్థలాన్ని పరిశీలించి చిరుత దాడి, దాని కదలికలపై అప్రమత్తమయ్యారు. ఇబ్రహీంపురం గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ముఖ్యంగా రైతులు ప్రతిక్షణం జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. చిరుతపులిని ఎలా కట్టడి చేసి పట్టుకోవాలి, ఎలా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు ఒంటరిగా రాత్రి సమయాల్లో బయట తిరగకూడదని, త్వరలో పులిని పట్టుకొని రక్షణ చర్యలు తీసుకుంటామని, భయాందోళనకు గురికావొద్దని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ స ర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ నాగాయపల్లి శివారాములు, పాలకవర్గం సభ్యు లు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అటవీశాఖ అధికారులకు సహకరించాలని తెలిపారు.



## లక్కీ డ్రాల పేరుతో మోసాలపట్ల జాగ్రత్త

### జిల్లా ఎస్‌పి కె నరసింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట :** బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై రాష్ట్రవ్యాప్తంగా కఠిన చర్యలతో ఆ దందాకు దాదాపు బ్రేక్ పడడంతో, ఇప్పుడు కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సోషల్ మీడియా వేదికగా లక్కీ డ్రా పేరుతో కొత్త మోసాలకు తెరలేపుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. కార్లు, బైకులు, ఖరీదైన గ్యాడ్జెట్లు ఇస్తామంటూ అమాయక ప్రజలను ఆకర్షించి నగదు దోచుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో లక్కీ డ్రా పేరుతో జరుగుతున్న మోసాలపై రాష్ట్రంలో కొన్ని ముఖ్య నగరాల్లో, పట్టణాల్లో పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలు తమ ఫాలోయింగ్‌ను ఉపయోగించి డ్రాలో పాల్గొంటే ఖచ్చితంగా బహుమతి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇలాంటి డ్రాలకు ఎలాంటి చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. బహుమతులు అందకుండా ప్రజలు మోసపోవడం జరుగుతుందని తెలిపారు. లక్కీ డ్రా పేరుతో డబ్బులు వసూలు చేయడం, ప్రజలకు లాభాల ఆశ చూపించి మోసం చేయడం నేరమని అన్నారు. ఈ తరహా కార్యకలాపాలు ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బ్యానింగ్) యాక్ట్, 1978 కింద నేరుగా పరిగణించబడుతాయని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమించి లక్కీ డ్రాలు నిర్వహించే వారిపై, వాటిని ప్రమోట్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఇలాంటి వాటిని నిర్వహించిన, ప్రోత్సహించిన వారు ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తీవ్రంగా హెచ్చరించారు.

## మద్యం విషయంపై నా నిర్ణయంలో మార్పు లేదు

### ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వైన్‌షాప్ నిర్వాహకులకు వార్నింగ్

**ప్రజాపక్షం/మునుగోడు :** నియోజకవర్గంలో కొనసాగుతున్న మద్యం షాపుల సమయపాలన లో మునుగోడు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య మేలు కోసం నేను తీసుకున్న నిర్ణయం లో ఎలాంటిvమార్పు ఉండదని మరోమారు స్పష్టం చేశారు. ఆదివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలవడానికి వచ్చిన మద్యం వ్యాపారులతో మద్యం షాపుల సమయపాలన పై మద్యం నియంత్రణపై వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. వ్యాపారాల కోసం ప్రజల ఆరోగ్యాలు పాడుచేయొద్దని,ఉదయం నుండి మద్యం తాగే విధానానికి స్వస్తి పలికేలా మద్యం వ్యాపారులు బిజినెస్ మైండ్‌ని మార్చుకోవాలని హెచ్చరించారు. మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపుల విషయంలో తాను తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతే వైన్ షాపులు తెరుచుకోవాలని 6 గంటల తర్వాతే పర్మిట్ రూమ్ లలో అనుమతి ఉండాలని అన్నారు.అవసరమైతే నియోజకవర్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లను ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షించేందుకు ఆదేశాలు ఇస్తానని అన్నారు.ఉదయమంతా పనిచేసుకొని సాయంత్రం పూట మాత్రమే తాగేలా మార్పు తీసుకొస్తున్నామన్నారు.మద్యం విషయంలో మీరు తీసుకున్న నిర్ణయం మహా గొప్పదని ఇతర నియోజకవర్గ ప్రజలు మెచ్చుకుంటున్నారని గుర్తు చేశారు. యువత మద్యానికి బానిసై పెడదొవ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. యువత ఆలోచనలు మద్యం వైపు నుండి తమ వ్యక్తిగత అభివృద్ధి వైపు మళ్లిస్తూ గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణ నెలకొల్పడానికే ఈ ప్రయత్నం చేస్తున్నానని అన్నారు.



## లాకప్ డెత్ కేసులో డిఎస్‌పి, ఎస్‌పిలు కూడా నిందితులే

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కోదాడ కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనలో నాటి కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి, సూర్యాపేట ఎస్‌పి నరసింహ పాత్ర ఉందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జె గార్డెన్‌లో ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేష్‌పై ఏ ఫిర్యాదు లేకున్నా చట్టవిరుద్ధంగా చిలుకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం డిఎస్‌పి, ఎస్‌పిలకు తెలుసన్నారు. ప్రతిరోజూ పోలీసు స్టేషన్ లాకప్‌లకు సంబంధించిన సమాచారం (డైలీ సిట్యువేషన్ రిపోర్టు) ఎస్‌పి, డిఎస్‌పిలకు ఉన్నప్పటికి ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసి రాజేష్ మరణానికి వారు కూడా కారకులయ్యారని ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టించేందుకు మొదటి నుండి అన్ని విధాలుగా ప్రయత్నాలు చేశారని విమర్శించారు. అందులో భాగంగానే రాజేష్ పోస్టుమార్టంకు ముందు ఎస్‌పి నరసింహ గాంధీ హాస్పటల్‌కు ఎస్‌ఐ, సిఐలను పంపించారని తెలిపారు. పోలీసులే గాంధీ హాస్పటల్ డాక్టర్లను, ముషీరాబాద్ మేజిస్ట్రేట్‌ను మేనేజ్ చేసి పోస్టుమార్టం చేయించుకున్నారని అన్నారు. అందుకే ఆ రోజు డ్యూటిలో లేని లక్ష్మి కాంత్‌రెడ్డి అనే రెడ్డి డాక్టర్‌ను పిలిపించి పోస్టుమార్టం చేయించారన్నారు. వీడియో గ్రాఫర్‌ను కూడా కోదాడ నుండి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రామకృష్ణరెడ్డిని పిలిపించారని చెప్పారు. ఈ కేసును కప్పిపుచ్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేయడంతో తమ విధుల్లో నిర్లక్ష్యం వహించిన డిఎస్‌పి శ్రీధర్ రెడ్డిని ఏ3 గా, ఎస్‌పి నరసింహను ఏ4 గా, రాజేష్ లాకప్ డెత్ కేసులో చేర్చాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖకు నిజాయితీ ఉంటే ఈ ఘటన మీద ప్రధానంగా డిఎస్‌పి, ఎస్‌పి పాత్రల మీద డిఐజి లేదా ఐజి లేదా అంతకన్నా ఉన్నతస్థాయి అధికారితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి రాజేష్ లాకప్ డెత్ ఘటన మీద సిబిఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులు వికె విశ్వనాధం మాదిగ, జయకర్, చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, దప్పు మల్లయ్య మాదిగ, బచ్చలికూర వెంకటేశ్వర్లు మాదిగ, జానకిరామయ్య చౌదరి, చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, యాతాకుల రాజన్న మాదిగ, యర్ర వీరస్వామి పాల్గొన్నారు.















## ఖమ్మం సభకు సిపిఐ కార్యకర్తలు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100వ వార్షికోత్సవ ముగింపు సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభకు చింతలపాలెం మండలం నుంచి సిపిఐ కార్యకర్తలు భారీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింత్రియాల రవి, గ్రామ కార్యదర్శి అబ్దుల్ భాషా, గంధం కొండ, భీమిశెట్టి పద్మ, హైమావతి, తోకల సైదులు, ముఖ్య రామారావు, రాకేష్, సత్యం, శీను తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** అల్వాలపురం గ్రామ శాఖ నుండి సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోతురాజు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ నాయకులు కంబాల స్వామి, కంబాల నరసింహారావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, గోవర్ధన్, లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు :** ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేంద్రంలో మండల కేంద్రంలో భారీగా కవాతు నిర్వహించారు. ముందుగా కవాతును సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను జెండాతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్, ఏఎస్ఎఫ్ నాయకులు బండారు శంకర్,కట్కూరి లింగస్వామి,బుల్గురి వంశీకృష్ణ,గోపాగోని ఉదయ్, గోస్కొండ మల్లేష్, దశరథ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఖమ్మంలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభకు మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మిర్యాలగూడ, వేములపల్లి, దామరచర్ల మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, పద్మ, షమీం, బంటు రేణుక, సైదమ్మ, ప్రమీల, యాదగిరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** తొండ గ్రామం నుండి సిపిఐ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్ళడం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తుంగతుర్తి నియోజక వర్గ ఇంచార్జి యాదగిరి జెండా ఊపి ప్రారంభించారు.

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ ఆధ్వర్యంలో భారీ సంఖ్యతో పార్టీ శ్రేణులు బయలుదేరివెళ్లారు. జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి కళ్లెం రామచంద్రు, రామన్నపేట పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షులు ఊట్కూరి కృష్ణ, ఏనుతుల రమేష్, ఊట్కూరి భగవంత, బాలగోని మల్లయ్య, గంగాపురం యాదయ్య, గంగాపురం వెంకటయ్య, వీరమల్ల ముత్తయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గుండాల :** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగింపు సభకు ఆదివారం ఖమ్మం పట్టణానికి గుండాల మండల సిపిఐ పార్టీ శ్రేణులు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి భారీ ఎత్తున తరలివెళ్ళారు. ఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య వాహన శ్రేణికి జెండా ఊపి ప్రారంభించారు. సభకు తరలిన వారిలో మండల కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, వృధ్వి, కొమురయ్య, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## ఆర్టిఐ బోర్డుల నిర్వహణలో నిర్లక్ష్యం




**ప్రజాపక్షం/పెబ్బేరు :** సామాన్యుని చేతిలో వజ్రాయుధం లాంటి సమాచార హక్కు చట్టం యొక్క బోర్డులు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్లక్ష్యానికి, ఉదాసీన వైఖరికి అద్దం పడుతున్నాయి. పెబ్బేరు మండలానికి కొత్త ఎంపీడీవో వచ్చి నెలలు గడుస్తున్నప్పటికీ గుమ్మడం గ్రామపంచాయితీ కార్యాలయంలోని సమాచార హక్కు బోర్డులో రిటైర్మెంట్ అయిపోయిన పాత ఎంపీడీవో పేరును నేటికీ కొనసాగించడం గమనార్హం. ఈ విషయాన్ని సమాచార హక్కు స్వచ్ఛంద కార్యకర్తలు విమర్శిస్తున్నారు. గత నెలలో పదవీ బాధ్యతలు తీసుకున్న కొత్త సర్పంచుల పదవీ బాధ్యతలు తీసుకున్న కొత్త సర్పంచుల పేరు కూడా సూచిక బోర్డులపై రాయకుండా పాత సర్పంచులు, వార్డు మెంబర్ల పేర్లు నేటికీ కొనసాగించడం ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ఉద్యమ కళాకారుల పోరుదీక్షను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ కేంద్రంలో ఆదివారం రోజు ఉద్యమ కారుల సంఘం మండల ఇంచార్జి దుబాయ్ కృష్ణ గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ నెల 20 వ తెదిన హైదారాబాద్‌లోని ఇందిరా పార్క్ దగ్గర ఉన్నా ధర్నా చౌక్ కళాకారుల పోరుదీక్షను నియోజకవర్గంలోని కవులు ,కళాకారులు అందరు కదిలి వచ్చి ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయగలరని కోరారు. తెలంగాణ సాంస్కృతిక సారధిలో అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు, ఉద్యమంలో పనిచేసి వృద్యాప్యంలో ఉన్నా అర్హులైనా వృద్యాప్య పింఛను, నిరుపేద కళాకారులకు 250 గజాల స్థలం, ఇందిరమ్మ ఇల్లులు, ఆరోగ్య భద్రత ,ఉచిత హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎన్‌టిఆర్ 30వ వర్ధంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిడిని వ్యవస్థాపకులు, మాజీ సిఎం నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి కార్యక్రమం హైదరాబాద్ పార్లమెంట్ చార్మినార్ నియోజకవర్గ పరిధిలోని లాల్ దర్వాజా మోడ్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు పెద్దోజు రవీంద్ర చారి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేశారని కొనియాడారు. 1982లో పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి, రూ. 2కే కిలో బియ్యం, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర కుమార్, శ్రీకాంత్, చాంద్ పాషా, శైలేష్ కుమార్, వై. నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

### ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన నందమూరి కుటుంబ సభ్యులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్‌టిఆర్ 30వ వర్ధంతిని పురస్కరించుకుని నెక్లెస్ రోడ్‌లోని ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. నారా భువనేశ్వరి, నందమూరి బాలకృష్ణ, నారా లోకేష్ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం దోమలగూడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన పోరాడుతుందని, రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, బక్కని నర్సింహులు, నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, నాగు నగేష్ పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత మనందరి బాధ్య

### ‘అరైవ్ అలైవ్’’ ప్రతిజ్ఞలో భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాదు నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు వాహనదారుల్లో క్రమశిక్షణను పెంపొందించడానికి తెలంగాణ పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమం సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం లుంబినీ పార్క్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయాలని,తమ నిబద్ధతను చాటుతూ 9240015225 ఫోన్ నెంబర్ కి మిస్డ్ కాల్ చేసి 'సర్టిఫికేట్ ఆఫ్ కమిట్‌మెంట్' పొందాలని సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ సూచిస్తున్నారు.వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడటం ప్రాణాంతకమని, ముఖ్యంగా మెడ వంచి ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణ నష్టం జరుగుతుందని, భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.ఈ సామాజిక బాధ్యతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పోలీస్ సిబ్బంది ప్రజలను కోరుతున్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా కేవలం మీ ప్రాణాలే కాకుండా, ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చునని హైదరాబాదు ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మధుసూదన్, ఎస్ఐ వినయ్ ట్రాఫిక్ సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఓటు బ్యాంకు రాజకీయాలకు చెల్లుచీటి

### అభివృద్ధి మంత్రంతో ముందుకు
### సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన విజయవంతం
### డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఓటు బ్యాంకు రాజకీయాలతోనే పాలమూరుకు తీవ్రం నష్టం జరిగిందని ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రజల ప్రభుత్వంలో పాలమూరు త్వరితగతిన అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తుందని డిసిసిబి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం డిసిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వామ్యం చేస్తూ అన్ని వర్గాలకు అవసరమైన సంక్షేమ పథకాలను రూపొందిస్తూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు. పాలమూరులో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో జిల్లాకు మహర్దశ పట్టనుందని అన్నారు. ఈ జిల్లా బిడ్డగా రూ.1463 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు అంకురార్పణ చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. రేవంత్‌రెడ్డి పర్యటనతో జిల్లాకు స్వర్ణ యుగం ప్రారంభం అయిందన్నారు. ట్రిబుల్‌ఐటి తో పాటు యువ భారత్ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించడం ఈ జిల్లా పై ఉన్న శ్రద్ధ కనబడుతుందని అన్నారు. అలాగే పాలమూరులో రూ. 600 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడం రూ.220 కోట్లతో మంచి నీటి సౌకర్యం మెరుగుపరుచుటకు శంఖుస్థాపన చేసేందుకు జిల్లా ప్రజల అదృష్టమని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నికలప్పుడే ప్రజలను మభ్యపెట్టడానికి కొత్త కొత్త స్కీమ్‌లు రూపొందించి ఎన్నికల అనంతరం మరుగున పడేస్తున్నారని అలా కాకుండా రేవంత్ రెడ్డి ప్రజలకు అవసరమేరకే పథకాలు రూపోందిస్తూ అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. జిల్లా ప్రజలపై చూపిస్తున్న ఆధారఅభిమానులకు ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అక్తర్, లతో పాటు కాంగ్రెస్ నాయకులు, బెనహర్ , నవీన్ కుమార్, బాలాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ అభ్యర్థి బిసి మహిళకు కేటాయించడం పట్ల హర్షం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ తొలి మేయల్‌గా బీసీ మహిళకు అవకాశం కల్పించడం పట్ల బీసీ సమాజ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ప్రకటించినప్పటి నుండి కార్పొరేషన్ కు తొలి మేయర్ గా బీసీలకు కేటాయించాలని చాలా సందర్భాంలో ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగిందని, ప్రభుత్వం బీసీ మహిళను మేయర్ గా ప్రకటించడం పట్ల బీసీ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ సంతోషం వ్యక్తం చేశారు. గతం నుంచి మహబూబ్ నగర్ నియోజకవర్గం బీసీల నియోజకవర్గంగా ఉన్న సందర్భాన్ని గుర్తు చేస్తూ ప్రభుత్వం బీసీ లకు కేటాయించడంతో వివిధ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు కూడా ఈ ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు.

## ఎజిఎఫ్ పోటీలలో గిరిజన గురుకులం క్రీడాకారులు ద్వితీయ స్థానం

**ప్రజాపక్షం/ధన్వాడ :** ఈనెల 16 నుండి 18 వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో కేంద్రీ విల్లా విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన 69 వ ఎస్‌జి ఎఫ్ రాష్ట్ర స్థాయి 14 సంవత్సరాల లోపు బాల బాలికల నేట్ బాల్ పోటీలలో పాల్గొన్నారు. ధన్వాడ మండలం కొండాపూర్ గ్రామం పీఎం గిరిజన గురుకులానికి చెందిన 8 మంది విద్యార్థులు క్రీడాకారుల సెమీఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టును 2205 స్కోరుతో ఓడించి ఫైనల్ కు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో స్థానిక ఖమ్మం జట్టుతో హోరాహోరీగా జరిగిన పోటీలో 1715 స్వల్ప తేడాతో ఓడిపోయి ద్వితీయ స్థానం (రన్నర్స్‌అప్ ) సాధించిందని శిక్షకులు డాక్టర్ రామ్మోహన్ గౌడ్ తెలిపారు. కొండాపూర్ గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ రాజారాం పిఈటి ఆంజనేయులు , నారాయణపేట జిల్లా ఎస్‌జిఫ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారుల క్రమశిక్షణ, కఠిన సాధన వల్లే ఈ విజయం సాధ్యమైందని వారు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లోనూ నారాయణ పేట జిల్లా జట్టు మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



# సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ:** మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన వసుపుల వెంకటేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధిని నుండి మంజూరైన రూ.60 వేల చెక్‌ను ఆదివారం గ్రామ సర్పంచ్ కేశమళ్ల అనూష కృష్ణ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోనే పెద్దాపూర్ గ్రామానికి అదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్‌లను అనారోగ్యానికి గురైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్ చారి, వార్డు సభ్యులు శ్రీధర్,ప్రసాద్‌గౌడ్, తిరుపతినాయక్, లలితమ్మమల్లయ్య, మమత, అనిల్‌కుమార్, గుద్దటి లక్ష్మారెడ్డి, వరికుప్పల ఆంజనేయులు, నెంట శ్రీను, హరిలాల్‌నాయక్, వసుపులు రాఘవులు, సుధాకర్, వెంకటేష్, రామచంద్రయ్యగౌడ్, శ్రీశైలం,అజార్, కాటిక రాములు, వెంకటయ్య, లింగయ్య, శ్రీను, భరత్, శేఖర్‌లతో పాల్గొన్నారు.

## కష్టజీవులకు ప్రశ్నించటం, పోరాటం నేర్పిందే ఎర్రజెండా

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** దేశంలో శ్రమజీవులకు ప్రశ్నించటం, పోరాడటం , సాధించటం నేర్పిందే ఎర్రజెండా అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో సిపిఐ వందేళ్ల ఆవిర్భావ పండుగకు వనపర్తి టౌన్ పానుగల్ వీపనగండ్ల మండలాల నుంచి కార్యకర్తలు నేతలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో మాజీ సర్పంచు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, పానుగల్ మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, వీపనగండ్ల మండల కార్యదర్శి ఎం.కుర్మయ్య, వార్డు సభ్యులు సుజాత, దంగు లక్ష్మి , సహదేవ్, మాజీ ఉపసర్పంచు బాలస్వామి, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మీ నారాయణ, కాకం చిన్న నారాయణ, రమణ, పెద్ద హనుమంతు, కుర్వ హనుమంతు, వంశీ, శివ, కాశన్న, ఎలగొడ్డు రాముడు, మహిళా నేతలు జయమ్మ, శిరీష, జయశ్రీ, పావని, వెంకటమ్మ, లావణ్య, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఏకైక వ్యక్తి ఎన్‌టిఆర్



కొత్తకోట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మూడవత్ కిషన్ నాయక్

**ప్రజాపక్షం/ కొత్తకోట :** సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న గొప్ప మహనీయుడు ఎన్టీఆర్, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఏకైక వ్యక్తి నందమూరి తారక రామారావు అని కొత్తకోట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మూడవత్ కిషన్ నాయక్ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా దేవరకద్రలోని నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని పట్టణ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ నాయుడు, దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి జనార్ధన్ నాయుడు, ఈశ్వరయ్య, బలరాం నాయక్, మాజీ ఉపసర్పంచ్ జనార్ధన్ సాగర్, గంగాధర్, లక్ష్మయ్య, బాలరాజు, రవి కుమార్, ఒలియోద్దీన్, బలరాం, కొండన్న, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నవరస నట సార్వభౌముడు, యుగపురుషుడు నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని మండలంలోని కల్వరాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు బిచ్చరెడ్డి, నాయకులు పలువరి వెంకటేశ్వర్లు, శ్రీను, బాబు, యల్లయ్య, విష్ణు, నాగయ్య, కృష్ణయ్య, మద్దిలెట్టి, జగన్ , నరసింహ, ఈశ్వరయ్య, తదితరులు ఉన్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో వ్యాపారి హత్య

### కుటుంబం నిర్బంధం

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఒక వ్యాపారి లిటన్ చంద్ర ఘోష్‌ను ఒకే కుటుంబంలోని ముగ్గురు కొట్టి చంపారు. ఈ ఘటనలో ఆ ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 55 ఏళ్ళ వయసుగల మృతుడు ఘోష్ బైశాఖి స్వీట్‌మీట్–హోటల్ వ్యాపారి. ఐతే ఘాజీపూర్‌జిల్లా కాళీగంజ్ ప్రాంతంలో శనివారం జరిగిన ఈ ఘటన ఆ దేశంలో మైనారిటీ హిందువులపై జరుగుతున్న వరుస దాడుల పరంపరలో భాగంగా జరిగిందా? అనే విషయం ధృవీకరణ కాలేదు. కాళీగంజ్ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్‌ఛార్జి జాకీర్ హుస్సేన్ చెప్పిన సమాచారం ప్రకారం ఈ కేసులో స్వపన్ మియా (55), ఆయన భార్య మజేదా ఖతున్ (45), కుమారుడు మాసమ్ మియా (28)లను పోలీసులు నిర్బంధించారు. దాడికి పాల్పడిన మాసుమ్‌కు ఒక అరటితోట ఉంది. తోటలో అరటి గెల లెక్క తేలలేదు. ఆ గెల ఘోష్ హోటల్‌లో కనిపించింది. ఇక తర్వాత వారిమధ్య వివాదం మొదలైంది. దీంతో భౌతికదాడి జరిగింది. ఘోష్ తల నేలకు తగిలి అక్కడికక్కడే మరణించాడు.

## సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం పోరాటం



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడేందుకు ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతి ర్యాలీని అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఫిబ్రవరి మొదటి వారంలో కోర్టు అనుమతితో భారీ ర్యాలీ నిర్వహిస్తామని ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ప్రభుత్వం దిగిరాకపోతే సికింద్రాబాద్ బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

**ముఖ్యమంత్రివా లేక ముఠా నాయకుడివా?: కెటిఆర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ జెండా గద్దెలను కూల్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తీవ్రంగా స్పందించారు. హింసను ప్రేరేపించేలా మాట్లాడిన సిఎంపై డిజిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి తన పాత బాస్ (చంద్రబాబు) ఆదేశాలతో తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు.

# ఈశాన్యరాష్ట్రాల ‘అష్టలక్ష్మి’

### కళావైభవాన్ని చాటిచెప్పే రిపబ్లిక్ డే ఆహ్వానపత్రిక

**న్యూఢిల్లీ:** ఈసారి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్రపతి ద్వారా ప్రముఖులకు వెళ్ళే ఆహ్వాన పత్రిక ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక,హస్తకళా ప్రాంతీయ వైభవానికి చిహ్నం కానున్నది. భారత ఈశాన్యప్రాంతంలో ఉన్న ఎనిమిది రాష్ట్రాలకు చెందిన ఉమ్మడి సంప్రదాయ వృత్తులకు ప్రతిబింబంగా ఈ ఆహ్వాన పత్రిక ఉంటుంది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన 350 మంది వృత్తి నిపుణులు ఉమ్మడి సమన్వయంతో రాష్ట్రపతి ‘‘ఎట్‌హోం’ ఆహ్వానం రూపు దిద్దుకోనున్నది. అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడి) ఈ ఆహ్వాన పత్రికను వారి సమన్వయంతో తీర్చిదిద్దింది. దేశ ఈశాన్యప్రాంతంలో ఉన్న ఈ ఎనిమిది రాష్ట్రాలనూ అష్టలక్ష్మి రాష్ట్రాలు అని కూడా పిలుస్తున్నారు. ఈశాన్యప్రాంత రాష్ట్రాలలోని ప్రజల చతురత, బుద్ధికుశలత,సాంస్కృతిక సౌందర్య నైపుణ్యాలకు ఒక మచ్చుతునక కానున్నది. ఈ ఆహ్వానపత్రికలో ప్రతి అణువునూ చాలా జాగ్రత్తగా తీర్చిదిద్దారు. ఈశాన్యప్రాంత రాష్ట్రాలలో ఉన్న సంప్రదాయ కళానిపుణుల శక్తిసామర్థ్యాలకు ప్రతీక కానున్నది. ప్రాంత ప్రజల అసమానమైన హస్తకళానైపుణ్యాన్ని దేశం అంతటికీ చాటి చెబుతుంది. ఈ ప్రాంతాలకు వెళ్ళడం దేశంలోని అందరికీ సాధ్యం కాదు. అక్కడి సంస్కృతి,కళానైపుణ్యాలను ప్రతిఒక్కరూ ఆస్వాదించలేరు. అందుకే ఈ రూపంలో దీనిని అందరికీ అందుబాటులోకి తెస్తున్నారు. ఈశాన్య ప్రాంత రాష్ట్రాలలోని హస్తకళా చాతుర్యానికి ఈ ఆహ్వాన పత్రిక ఒక గొప్ప గౌరవంగా నిలుస్తుంది. వెదురు పుల్లలతో జాతీయ జెండాను ప్రతిబింబించే అల్లికతో రంగులతో ఆ ప్రాంత వైశిష్ట్యానికి ప్రతీకగా నిలుస్తుంది. నిజం చెప్పాలంటే ఈశాన్యప్రాంత కళావైభవ నైపుణ్య సంగమంగా ఉంటుంది.

### గిగ్, ప్లాట్‌ఫామ్, గృహ కార్మికుల కోసం..

## సూక్ష్మ రుణ పథకాన్ని స్వాగతిస్తున్నాం

### టిజిపిడబ్ల్యుయు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిగ్, ప్లాట్‌ఫామ్, గృహ నిర్మాణ కార్మికులకు వార్షికంగా రూ. 10 వేల వరకు భద్రత లేని (కోలాటరల్ ఫ్రీ) రుణాలు అందించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వంలో ప్రతిపాదించబడిన సూక్ష్మ రుణ పథకాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) స్థాపక అధ్యక్షులు షేక్ సలాఉద్దీన్ అన్నారు. గిగ్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక అస్థిరతను గుర్తించి, వారి స్వయం ఉపాధి, వ్యాపార ప్రయత్నాలను ప్రోత్సహించే సమయోచితమైన, అత్యవసరమైన చర్య అని ప్రశంసించారు. అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలకు ఇప్పటివరకు దూరంగా ఉన్న కార్మికులకు ఇది గణనీయమైన సహాయంగా నిలుస్తుందన్నారు. ఈ పథకం పారదర్శకంగా, కార్మికులకు అనుకూలంగా, సులభమైన విధానాలు, తక్కువ పత్రాల అవసరంతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలతో అమలవుతుందని టిజిపిడబ్ల్యుయు ఆశిస్తోందని, తద్వారా అర్హులైన ప్రతి కార్మికుడు ఈ పథకం ప్రయోజనాలను పొందగలుగుతారని పేర్కొన్నారు. ఈ పథకం సమర్థవంతంగా అమలయ్యేలా, దీర్ఘకాలికంగా విజయవంతంగా కొనసాగేందుకు భారత ప్రభుత్వం, సంబంధిత శాఖలతో సానుకూల సహకారం అందించేందుకు తాము ముందుంటామని తెలిపారు.



## ఖమ్మం సిపిఐ సభకు పాతబస్తీ నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖమ్మంలో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డమీద చంద్రమోహన్ గౌడ్ ఆధ్వర్యంలో పాతబస్తీ నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఖమ్మంకు వెళ్లి గౌలిపుర డివిజన్ నాయకులు రాజు, సునీల్, జి.ప్రభాకర్, అనిల్, సునీల్, బాలయ్య, రచయిత, డైరక్టర్ సూర్యప్రకాష్, విద్యార్థి నాయకుడు వినీత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఆస్ట్రేలియా పర్యటనకు డబ్ల్యుపిఎల్ స్టార్..

వన్డే, టీ20లకు ఎంపికైన స్పిన్ సంచలనం!



వన్డే వరల్డ్‌కప్ విజేత భారత జట్టు తొలి విదేశీ పర్యటనకు సిద్ధమవుతోంది. ఇటీవలే శ్రీలంకను వైట్‌వాష్ చేసిన టీమిండియా.. ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఇప్పటికే షెడ్యూల్ ఖరారు కావడంతో ఆదివారం వన్డే, టీ20లకు స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ, స్మృతి మంధాన డిప్యూటీగా 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఈమధ్యే శ్రీలంకపై తిప్పేసిన వైష్ణవి శర్మ వన్డే, టీ20లకు ఎంపికవ్వగా.. డబ్ల్యుపిఎల్‌లో చెలరేగి ఆడుతున్న గుజరాత్ జెయింట్స్ హిట్టర్ భారతి ఫుల్‌మాలి టీ20 స్క్వాడ్‌లోకి వచ్చింది. శ్రీలంకపై వికెట్లతో మెరిసిన వైష్ణవి శర్మ వన్డే, టీ20 స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో భారీ సిక్సర్లతో రెచ్చిపోతున్న భారతి ఫుల్‌మాలి జాతీయ జట్టులోకి తొలిసారి ఎంపికైంది. డబ్ల్యుపిఎల్‌లో వికెట్ వేట కొనసాగిస్తున్న శ్రేయాంక పాటిల్ పొట్టి ఫార్మాట్ స్క్వాడ్‌లోకి దూసుకొచ్చింది. వన్డే ప్రపంచకప్‌లో ఆల్‌రౌండర్‌గా.. డబ్ల్యుపిఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతున్న అమన్‌జోత్ కౌర్ రెండు ఫార్మాట్లకు ఎంపికైంది. అయితే.. ఏకైక టెస్టుకు స్క్వాడ్‌ను ప్రకటించాల్సి ఉంది.

**భారత వన్డే స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని(వికెట్ కీపర్), స్నేహ్ రానా, దీప్తి శర్మ, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జోత్ కౌర్, కశ్వీ గౌతమ్, రేణుకా సింగ్, శ్రీచరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్

**భారత టీ20 స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని (వికెట్ కీపర్), జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జోత్ కౌర్, రేణుకా సింగ్, అరుంధతి రెడ్డి, భారతి ఫుల్‌మాలి, శ్రేయాంక పాటిల్, స్నేహ్ రానా, శ్రీచరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్

**ఫిబ్రవరి 15న తేదీన..**

ఆస్ట్రేలియా పర్యటనలో మూడు టీ20లు, మూడు వన్డేలు, ఏకైక టెస్టు ఆడనుంది టీమిండియా. ఫిబ్రవరి 15వ తేదీన తొలి టీ20తో సిరీస్ షురూ కానుంది. ఫిబ్రవరి 19న రెండో మ్యాచ్, ఫిబ్రవరి 21న మూడో మ్యాచ్‌తో పొట్టి సిరీస్ ముగుస్తుంది. అనంతరం.. మూడు వన్డేల సిరీస్ మొదలవుతుంది. ఫిబ్రవరి 24న బ్రిస్బేన్‌లో వన్డే సిరీస్ ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి 27న హోబర్ట్‌లో రెండో వన్డే, మార్చి 1వ తేదీన చివరి మ్యాచ్ నిర్వహించనున్నారు. భారత జట్టుతో వన్డే సిరీస్ అనంతరం ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగియనుంది.

## పోరాడి ఓడిన భారత్..

సిరీస్ కివీస్ సొంతం



భారత్‌తో జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 2-1తో కైవసం చేసుకుంది. తొలుత న్యూజిలాండ్ 8 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. లక్ష్యఛేదనకు దిగిన టీమ్ఇండియా 296 పరుగులకు ఆలౌటైంది. విరాట్ కోహ్లీ (124; 108 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సులు), నితీశ్ రెడ్డి (53; 57 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), హర్షిత్ రాణా (52; 43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) పోరాడినా భారత్‌కు ఓటమి తప్పలేదు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (23), రవీంద్ర జడేజా (12), రోహిత్ శర్మ (11) పరుగులు చేశారు. శ్రేయస్ అయ్యర్ (3), కేఎల్ రాహుల్ (1) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జాక్ ఫౌక్స్ 3, లెనాక్స్ 2, కైల్ జేమీసన్ ఒక వికెట్ చొప్పున పడగొట్టారు.

కివీస్ బ్యాటర్లలో డారిల్ మిచెల్ (137; 131 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సులు), గ్లెన్ ఫిలిప్స్ (106; 88 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు) సెంచరీలతో విరుచుకుపడ్డారు. విల్ యంగ్ (30), మైఖేల్ బ్రాస్‌వెల్ (28*) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. కుల్‌దీప్, సిరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కింది.

## 'ఎమ్మా రాడుకాను' అలవోక విజయం

రెండో రౌండ్‌లో 'అల్కరాస్'!



కొత్త ఏడాదిని టాప్ సీడ్స్ ఘనంగా ఆరంభించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో కార్లోస్ అల్కరాస్, మహిళల ఫేవరెట్ ఎమ్మా రాడుకాను అలవోక విజయంతో ముందంజ వేశారు. మెల్‌బోర్న్ పార్క్‌లో జరుగుతున్న ఈ గ్రాండ్‌స్లామ్ తొలి పోరులో 38 విన్నర్స్‌తో ఆడం వాల్టన్‌పై విరుచుకుపడిన అల్కరాస్ ఈ సీజన్‌లో మొదటి విజయం నమోదు చేశాడు.

తొలి రౌండ్‌లో అల్కారస్‌కు ఆడమ్ వాల్టన్ గట్టి పోటీనిచ్చాడు. తొలి సెట్ 6–3తో గెలుపొందిన స్పెయిన్ కుర్రాడికి షాకిస్తూ.. రెండో సెట్‌లో (7–6) ఒక్క పాయింట్‌తో సొంతం చేసుకున్నాడు ఆడమ్. అయితే.. నిర్ణయాత్మక సెట్‌లో జోరు చూపించిన అల్కరాస్ 6–2తో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. రెండో రౌండ్‌లో యన్నిక్ హన్ఫ్‌మన్‌తో అతడు తలపడనున్నాడు.

**వరుస సెట్లలో జోరు**

మహిళల సింగిల్స్‌లో బ్రిటీష్ టెన్నిస్ స్టార్ ఎమ్మా రాడుకాను పవర్‌ఫుల్ షాట్లతో ప్రేక్షకులను అలరించింది. అనారోగ్యం కారణంగా గతేడాది పలు టోర్నీలకు దూరమైన తను.. ఆస్ట్రేలియా ఓపెన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన మనన్‌చయ సవాంగ్క్యేను వరుస సెట్లలో (6–4, 6–1) చిత్తుగా ఓడించింది. ఏకపక్ష విజయంతో ఎమ్మా రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది.

## ఆరోగ్యం



### పార్కిన్సన్ వ్యాధిపై కొత్త పరిశోధనలు

పార్కిన్సన్ వ్యాధి అనేది ఒక నాడీ సంబంధిత సమస్య. ఇది ముఖ్యంగా వృద్ధుల్లో కనిపిస్తూ, శరీర కదలికలను నియంత్రించే మెదడులో డోపమైన్ ఉత్పత్తి చేసే కణాలు నష్టపోవడంతో కొనసాగుతుందని శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు నమ్ముతున్నారు. డోపమైన్ శరీరంలోని ముఖ్యమైన న్యూరో ట్రాన్స్‌మిటర్‌గా పనిచేస్తుంది. దీనిలేమి తగ్గితే, కదలిక నియంత్రణ, సమన్వయ సమస్యలు, ఇబ్బందులు మొదలైన లక్షణాలు వ్యక్తంలో రావచ్చు. తాజా పరిశోధనలు ఈ దృష్టికోణాన్ని మరింత విస్తరుస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఏమిటంటే పార్కిన్సన్ వ్యాధి ప్రారంభం పూర్తిగా మెదడులోనే కాకుండా, శరీరంలోని ఇతర అవయవాలలో... ముఖ్యంగా మూత్రపిండాల్లో.. మొదలవుతుందని సూచనలు వెలుగులోకి వచ్చినవి. మూత్రపిండాల్లో నాడీ సంబంధిత బ్యాలెన్స్‌ను ప్రభావితం చేసే కొన్ని రోగ నిరోధక మార్పులు లేదా ఫిల్టరింగ్ సామర్థ్యంలో తేడాలు ఉంటే, అవి నేరుగా నాడీ కణాలపై ప్రభావం చూపవచ్చని కనుగొన్నారు. మూత్రపిండాలతో సంబంధం ఉండే రసాయనాల అసమతులనం లేదా ఫంక్షన్ తగ్గుముఖం ఉన్నపుడు, మెదడులో డోపమైన్ నిర్మాణ దశలను నెమ్మదిగా ధ్వంసం చేస్తుందని సూచనలు ఉన్నాయి. పార్కిన్సన్స్ వ్యధి పూర్తిగా మెదడులో మొదలవుతుందన్న ప్రాచీన భావనను ఈ పరిణామం సవాలు చేస్తున్నది.

ఈ కొత్త ప్రామాణిక దృష్టికోణం ప్రకారం, మనిషికి మూత్రపిండాల ఆరోగ్యం చాలా ముఖ్యం. మూత్రపిండాల సమర్థవంతమైన కార్యాచరణ లేకపోతే, శరీరంలోని అనేక నాడీ సంబంధిత మార్గాలు ప్రభావితమవుతాయని తెలుస్తోంది. అందువల్ల డోపమైన్ తగ్గుదలకు తోడ్పడే మూలకాలు బయటపడే ప్రమాదం ఉంది. మూత్రపిండాల పనితీరు, మైటోకాండ్రియల్ ఫంక్షన్, ప్రోటీన్ మడతలు, రసాయన అసమతుల్యత వంటి అంశాలను ముందుగానే పరీక్షించడం ద్వారా వ్యాధి ప్రమాదం తగ్గించవచ్చు. పురాతన విధానాలు కేవలం మెదడులోని నష్టాన్ని పూరించడం, డోపమైన్ బియ్యించడం మీదే కేంద్రీకృతమై ఉండగా, నూతన ఔషధ లక్ష్యాలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఉండవచ్చు.

పార్కిన్సన్ వ్యాధి సాధారణంగా శరీర కదలికలలో వణికిపోతున్న భావన, సరైన కదలికలు లేకపోవడం లేదా కదలికపై నియంత్రణ కోల్పోవడం వంటి లక్షణాల ద్వారా బయటపడుతుంది. దీని వల్ల నిద్రలో మార్పులు సంభవిస్తాయి. మానసిక మార్పులను కూడా గుర్తించవచ్చు. కొంత మందిలో మాట తడబడుతుంది లేదా స్పష్టత కోల్పోతుంది. ఎక్కువగా వృద్ధుల్లో ఈ వ్యాధి కనిపిస్తుంది. అయినంత మాత్రాన మధ్య వయస్కులకు రాకూడదని ఏమీ లేదు. కొత్త పరిశోధనల ప్రకారం మూత్రపిండాలు నాడీ వ్యవస్థకు ప్రత్యక్ష లేదా పరోక్ష ప్రభావాలను చూపే అంశాలను ఉత్పత్తి చేస్తాయని తెలుస్తోంది. ఇది నాడీ మార్గాల సంక్లిష్టతను మెరుగ్గా అర్థం చేసుకునేందుకు, పార్కిన్సన్స్ వంటి వ్యాధుల నివారణలో ముందస్తు చర్యలను తీసుకోవడానికి దారి తీస్తుంది. పార్కిన్సన్ వ్యాధిని సరళంగా మెదడులోని డోపమైన్ కణాల నష్టం వల్లే అవుతుందని భావించడం కన్నా, ఇప్పుడు అందులో మూత్రపిండాల ఆరోగ్యపరమైన పాత్రను కూడా మనం అర్థం చేసుకోవాల్సి వస్తోంది. ఇది ముందస్తు పరీక్షలు, జీవనశైలి మార్పులు, చికిత్సను కొత్త దిశలో మార్చి, వ్యాధి బాధితుల జీవిత నాణ్యతను మెరుగుపరచే శక్తిని కలిగి ఉంది.

**గమనిక :** ఈ సమాచారంలో పేర్కొన్న వైద్య సంబంధిత అంశాలు శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత వైద్య సూచనల కోసం నిపుణులతో సంప్రదించడం అవసరం.

### డిమెన్షియాకు కారణం తెలిసింది!



డిమెన్షియాపై ఎంతోకాలంగా జరుగుతున్న పరిశోధనలు కొలిక్కి వచ్చినట్టు కనిపిస్తున్నది. తాజా అధ్యయనాల ప్రకారం, మెదడులో వ్యర్థ పదార్థాలను శుద్ధి చేసే 'గ్లింఫాటిక్' వ్యవస్థలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు లేదా అంతరాయం కలిగినప్పుడు, డిమెన్షియా వంటి మేధస్సు నష్టం వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. కృత్రిమ మేధస్సు (ఎఐ)ని ఉపయోగించి, ఎంఆర్ఐ సహకారంతో 40,000 మందిపై చేసిన అధ్యయనాల్లో గుండె ఆరోగ్యం సమస్యలు, నిద్రలేమి ఈ బ్రెయిన్ క్లీనింగ్ సిస్టమ్ పనితీరును దెబ్బతీస్తాయని గుర్తించారు. ఈ గ్లింఫాటిక్ వ్యవస్థ ప్రధానంగా నిద్ర సమయంలో పని చేస్తుంది. దీని ద్వారా 'సెరెబ్రోస్పైనల్ ఫ్లూయిడ్' (సిఎస్ఎఫ్) మెదడులోకి ప్రవహించి, వ్యర్థాలను శుద్ధి చేసి, ప్రమాదకరమైన 'అమిలాయిడ్' వంటి కణాలను బయటకు పంపుతుంది. సిఎస్ఎఫ్ ప్రవాహం సరయిన విధంగా సాగనప్పుడు లేదా నిద్రకు అంతరాయం కలిగినప్పుడు, వ్యర్థ పదార్థాలు మెదడులో నిల్వ ఉండిపోతాయి. దీని వల్ల డిమెన్షియా సంక్షోభం మొదలవుతుంది. జీవనశైలిలో మార్పులు, నిద్రను మెరుగుపరచడం, రక్తపోటును నియంత్రించడం వంటి చర్యలు మెదడు శుద్ధి వ్యవస్థను బలోపేతం చేసి, మేధస్సు ఆరోగ్యాన్ని కాపాడే అవకాశాన్ని పెంచుతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## రీల్

### 23న 'పోలీసోడు' రీ-రిలీజ్




స్టార్ హీరో విజయ్, టాప్ హీరోయిన్ సమంత జంటగా, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి థాను నిర్మించిన తమిళ చిత్రం 'తెరి' ఘన విజయం సాధించింది. తెలుగులో 'పోలీసోడు' పేరుతో అనువాదమై ప్రేక్షకుల హృదయాలను దోచుకుని సూపర్ హిట్ చిత్రంలా నిలిచింది. ఈ చిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. ఈ 'పోలీసోడు' చిత్రం ఈ నెల 23న రీరిలీజ్ కానుంది.ఈ చిత్రాన్ని నైజాం ప్రాంతంలో ప్రముఖ పంపిణీ సంస్థ ఏషియన్ ఫిలిమ్స్ వారు, ఆంధ్రాలో సురేష్ మూవీస్ భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. తండ్రి–కూతురు అనుబంధం, పోలీస్ బ్యాక్‌డ్రాప్, భావోద్వేగాలు, యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవించి అట్లీ ఈ 'పోలీసోడు' చిత్రాన్ని రూపొందించారు. విజయ్ ద్విపాత్రాభినయంలో మెప్పించగా, సమంత పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.



### వరుణ్ తేజ్ కొత్త సినిమా

వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్న చిత్రం టైటిల్ గ్లిమ్స్ విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ నేడు రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్–కామెడీ, ఇండియన్ అండ్ కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. కమెడియన్ సత్య మరో కీలమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ – థమన్ కలసి ఈ సినిమా చేస్తున్నారు.

### ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

సినీ ప్రముఖుల నివాళి



విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. ఫిల్మ్‌నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి సినీ పరిశ్రమకు చెందిన పలు శాఖల ప్రముఖులు పూల మాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి ఎన్టీఆర్. స్వార్థం లేని మనిషి ఆయన. సినిమాల్లో ఆయన చేయని ప్రయోగం లేదు కథ లేదు. అలాంటి వ్యక్తిని ఏడాదికి ఓసారి జయంతి, వర్ధంతులకు గుర్తు చేసుకొని, పూల మాలలు వేసి నివాళులు అర్పించడం కాదు. రాజకీయలో అయినా, సినిమాల్లో అయినా ఆయన్ను ఆదర్శంగా తీసుకునే ధైర్యం ఉండాలి. ఇవాళ ఎంతమందిలో ఆ ధైర్యం ఉంది. ఆయనలా స్వార్థం లేకుండా రాజకీయం చేయగలరా? చేయాలనే ఆలోచన జనాల్లో రావాలంటే ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలి' అని అన్నారు. మాదాల రవి మాట్లాడుతూ 'తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి నందమూరి తారకరామారావు. తెలుగు జాతికి, సినిమాకు గుర్తింపు తీసుకొచ్చిన అలాంటి వ్యక్తి భారతరత్న ఇవ్వాలి. దానికోసం మనమంతా కృషి చేయాలి' అన్నారు.పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ 'మనదేశం' చిత్రంలో ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ ప్రకారమే ఒక్కోమెట్టు ఎక్కుతూ ఏ స్థాయికి ఎదిగారో అందరికీ తెలిసిందే! ఆయన మనల్ని విడిచి 30 ఏళ్లు దాటిని... ఇప్పటికీ మా అందరికీ సజీవంగా వచ్చి పలకరిస్తునట్టే ఉంటుంది. అన్నగారు లేరని ఏరోజు అనుకోలేదు' అని అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు వై వి ఎస్ చౌదరి, ప్[పరుచూరి గోపాలకృష్ణ, ఫిలిం నగర్ హోసింగ్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, నందమూరి జానకీరామ్ భార్య దీపిక, మోహనరూప తదితరులు పాల్గొన్నారు.

### ఊపున్నారు... మెగా మేకోవర్



రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా తదుపరి షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుంది. భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దీనికోసం రామ్ చరణ్ మేకోవర్ అవుతున్నారు. గంటల కొద్దీ జిమ్ లో కసరత్తు చేస్తున్నారు. మర్చి 27వ తేదీన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు ఎనభై శాతం షూటింగ్ పూర్తయింది. త్వరలోనే జరగబోయే షెడ్యూల్‌తో షూటింగ్ దాదాపుగా పూర్తి కానుంది. యాక్షన్ సన్నివేశాలను భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్నారు. క్లైమాక్స్ వంటి సన్నివేశాల చిత్రీకరణ కోసం రామ్ చరణ్ మేకోవర్ అవుతున్నారు. చికిచికి అనే పాట ఇప్పటికే బాగా పాపులర్ అయింది. చికిరి చికిరి ఐదు భాషలలో 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్, రామ్ చరణ్ వైరల్ డ్యాన్స్‌తో ఈ సాంగ్ గ్లోబల్ మూమెంట్‌గా మారింది. త్వరలోనే మరో పాటను కూడా రిలీజ్ చేయబోతున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు.

### 'యుఫోరియా' ట్రైలర్ విడుదల

దర్శకుడు గుణశేఖర్ రూపొందించిన లేటెస్ట్ మూవీ 'యుఫోరియా'. శ్రీమతి రాగిణి గుణ సమర్పణలో గుణ హ్యాండ్ మేడ్ ఫిలమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా 'యుఫోరియా'. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కొన్ని దారుణాల్ని ఉన్నది ఉన్నట్లుగా తెరకెక్కించా. యువత ఎంత తప్పుదోవ పడుతుందన్నది బోల్డ్‌ చూపించా' అన్నారు దర్శకుడు గుణశేఖర్. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో భూమిక, సారా అర్జున్, విఘ్నేశ్ గవిరెడ్డి, గౌతమ్ మేనన్ ప్రధాన పాత్రలు పోషించారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు.



ఈ సందర్భంగా భూమిక మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. 23ఏళ్ల తర్వాత గుణశేఖర్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం చేస్తున్నప్పుడు నాకు మా అబ్బాయి గుర్తొచ్చాడు. పిల్లల్ని ఎలా పెంచాలనేది అందరూ తెలుసుకోవాలి' అన్నారు. 'ఇది చాలా సున్నితమైన అంశంతో రూపొందింది. ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యా. ఇది కచ్చితంగా అందరూ మెచ్చే సినిమా అవుతుంది' అంది నటి సారా అర్జున్. దర్శకుడు గుణ శేఖర్ మాట్లాడుతూ.. 'నా మనసుని కదిలించిన కథ ఇది. ఈ చిత్రం చూస్తున్నప్పుడు కొందరు మధ్యలోనే వెళ్లిపోయే అవకాశముంది. ఎందుకంటే వాళ్లకి నాపై కోపం వస్తుంది. కచ్చితంగా ఈ చిత్రం చూశాక అందరూ ఆలోచిస్తారు. ప్రతి కుటుంబం దీనితో కనెక్ట్ అవుతుంది. ఈ కథ వింటున్నప్పుడే నీలిమ దీనికి సారా అర్జున్ అయితే బాగుంటుందని చెప్పింది. ఆమె నటిస్తానంటేనే ఈ సినిమా తీద్దాం లేదంటే ఆపేద్దాం అని నీలిమతో చెప్పా. ఈ చిత్రం విడుదలయ్యాక భూమిక తప్పకుండా అందరి ప్రశంసలు అందుకుంటుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో నీలిమ, పృథ్వీ అడ్డాల, యుక్త గుణ, విఘ్నేశ్ గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'మన శంకర వర ప్రసాద్ గారు' రూ.226+ కోట్ల వరల్డ్ గ్రాస్



మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' ఈ సంక్రాంతి సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద రికార్డులు క్రియేట్ చేస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్లను పండుగ వేడుకగా మార్చింది. తెలుగు రాష్ట్రాలలో భారీగా ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరిస్తోంది.మన శంకర వర ప్రసాద్ గారు ఇప్పటివరకు ఎపి/తెలంగాణలో పెద్ద సంఖ్యలో వసూళ్లు సాధించింది, గత రికార్డును బద్దలు కొట్టింది. పరిశ్రమలో అత్యధిక 5వ రోజు వసూళ్లు సాధించిన చిత్రంగా మన శంకర వర ప్రసాద్ గారు సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం ఐదు రోజుల్లో 2.5 మిలియన్లకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి, ప్రపంచవ్యాప్తంగా 226+ కోట్ల వసూళ్లు సాధించింది. మౌత్ టాక్ తో థియేటర్లు హౌస్‌ఫుల్ షోలతో సందడి చేస్తున్నాయని నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి చెప్పారు.

### 'అమీర్ లోగ్' ఫస్ట్ లుక్




అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ నుంచి ప్రొడక్షన్ నంబర్ 1గా 'అమీర్ లోగ్' చిత్రం రాబోతోంది. ఈ చిత్రంలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా, వేదా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి మాధవి రెడ్డి సోమ నిర్మాతగా, మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సక్సెస్ ఫుల్ హీరో శ్రీ విష్ణు చేతుల మీదుగా రిలీజ్ చేసిన 'అమీర్ లోగ్' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతగానో వైరల్ అయింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా రిలీజ్ చేసిన మాస్ సాంగ్ ఇప్పుడు ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన 'అవ్వల్ దావత్' సాంగ్ ఇప్పుడు యూట్యూబ్‌లో వన్ మిలియన్ వ్యూస్‌కు పైగా వీక్షణలతో దూసుకుపోతోంది.'అవ్వల్ దావత్' సాంగ్‌లో రాహుల్ సిప్లిగంజ్ గాత్రం, అనీ మాస్టర్ స్టెప్పులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ పాట యూట్యూబ్‌లో అందరినీ ఆకట్టుకుంటూ ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ఈ చిత్రానికి ఎస్‌వికె సినిమాటోగ్రఫీని అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు. రోహిత్ పెనుమత్స ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చే కుట్ర



**ప్రజాపక్షం/యాచారం :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కలకొండ జంగయ్య విమర్శించారు. అదివారం మండల పరిధి లోని తమ్మలోనిగూడ గ్రామంలో విబిజిరామ్ వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈసంధర్భంగా జంగయ్య మాట్లాడుతూ కూలీల పొట్టగొట్టి కార్పోరేట్ శక్తుల జేబులు నింపడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేసి పాత చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శీలం జంగారెడ్డి, తోట్ల రవి, తోట్ల అరుణ్, మని, సురేందర్, తోట్ల యాదయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కొత్తూరు :** తెలంగాన గిరిజన ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆదివారం క్యాంపు కార్యాలయంలో టిజియుఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వి.తావుర్యానాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిజియుఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్ రాథోడ్, ఉపాధ్యాయులు బి.శంకర్, వి.రాజు, సంజు, ఎం.లింబ్యా, కె.శంకర్, ప్రవీణ్, మేఘా భాయ్, గిరిజన నాయకులు రఘు, ఏడి రామ్ సింగ్ నాయక్, బిల్డర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకారం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శ్రీ కట్ట పోచమ్మ అమ్మవారి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ తెలిపారు. ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీ కట్ట పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పులిమామిడి శ్రీకాంత్ గౌడ్ దేవాలయానికి 12కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో నల్లమోని బిక్షపతి, జిటి సంతోష్, రోమియో రమేష్, అందె రాజేశ్వర్, అందె జంగరాజ్ ముదిరాజ్, మంచిర్యాల సురేష్, భరత్, మల్లేష్, ఆనంద్, నర్సింలు, రఘు, పరమేష్, శ్రీను, అశోక్, మహేష్, బూర్గుల రమేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన ఎన్‌టిఆర్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రజలందరికి అందుబాటులోకి తీసుకువచ్చిన మహా వ్యక్తి ఎన్‌టిఆర్ అని మాజీ ఎంపిపి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో గంధం ఆనంద్, మాచవరం వెంకటయ్య గౌడ్, ప్రవీణ్‌కుమార్, కందూరి అంజయ్య గౌడ్, ఎర్రోళ్ల లక్ష్మయ్య, అప్పన్నగారి భాస్కర్‌రెడ్డి, నందుగారి భూపతిరెడ్డి, దాసరి అనంతయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు, విత్యాల పాషా, యాదయ్య గౌడ్, గంటల శంకరయ్య, రమేష్, కొండన్నగూడ చీపిరి చంద్రశేఖర్ యాదవ్, బక్కని కృష్ణయ్య, వెంకటయ్య, ఎర్రోళ్ల రామకృష్ణ, ఎండి మహ్మముద్, వెంకటయ్య, వీరేష్ గౌడ్, బక్కని నరేష్, అశోక్ గౌడ్, బక్కని శ్రీను, నవీన్, విఘ్నేష్‌లు పాల్గొన్నారు. కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని బివిరావు నగర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమ్మ సమైఖ్యవేధిక అధ్యక్షులు మనవ సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మాకినేని వెంకటనారాయణ, కోశాధికారి కాప్రా వెంకటేశ్వర్‌రావు, ఆనందరావు, కాపారామారావు, బండ్ల శివనాగమల్లేశ్వర్‌రావు, పికపాక ప్రభాకర్ పాల్గొన్నారు.

## సోదర ప్రేమ, ఐక్యతను పెంపొందించేందుకే లవ్‌ఫెస్ట్

ఎమ్మెల్యే సబితారెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సరూర్‌నగర్ క్రైస్తవ సంఘంలో సోదర ప్రేమ, ఐక్యతను పెంపొందించేందుకే ఏర్పాటు చేసే కార్యక్రమమే లవ్‌ఫెస్ట్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. అదివారం మహేశ్వరం నియోజకవర్గం ఎన్‌టిఆర్‌నగర్ డివిజన్‌లోని పాస్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో బాప్టిస్ట్ చర్చ్‌లో జరిగిన క్రైస్తవులు లవ్ ఫేస్ట్ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తను చిన్నతనంలో మిషనరీ స్కూల్లో చదివానని అప్పటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మురుకుంట్ల అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల శేఖర్, రాం నర్సింహగౌడ్, సాజిద్, వెంకటేష్‌గౌడ్, సంతోష్, శంకర్, యాదమ్మ, జయ్యమ్మ పాల్గొన్నారు.

### మాజీ మంత్రిని కలిసి రాంనర్సింహగౌడ్

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమల్ల రాంనర్సింహాగౌడ్ ఆదివారం మర్యాదపుర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సబితారెడ్డిని కలిసి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం అని అన్నారు.

# యువ ఐపిఎస్‌లతో ట్రాఫిక్‌కు చెక్

గ్రేటర్ హైదరాబాద్‌పై సిఎం ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యువ ఐపిఎస్ అధికారులను ట్రాఫిక్ విభాగాల్లో కీలక బాధ్యతలకు నియమిస్తూ ముఖ్యమంత్రి తాజాగా బదిలీలు చేపట్టారు. చట్ట సవ్యస్థల పటిష్టతతో పాటు ప్రజలను నేరుగా ఇబ్బంది పెడుతున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ముఖ్యమంత్రి, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఫీల్డ్ అనుభవం కలిగిన యువ, చురుకైన ఐపిఎస్ అధికారులను ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్లుగా నియమించారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ చర్యలు కొనసాగుతూనే, ఇప్పుడు నగర జీవన నాణ్యతను ప్రభావితం చేస్తున్న ట్రాఫిక్ సమస్యలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్లతో పాటు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టారు. జిల్లాల్లో అదనపు ఎస్‌పిలుగా సమర్థవంతంగా పనిచేసిన అధికారులను పట్టణ కమిషనరేట్లలో డిసిపి (ట్రాఫిక్) హోదాల్లో నియమించారు.

ఈ మేరకు ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్‌లకు ట్రాఫిక్ డిసిపిగా అవినాష్ కుమార్, గోల్కొండ, జూబ్లీ హిల్స్ జోన్‌ల ట్రాఫిక్ డిసిపిగా కాజల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌ల ట్రాఫిక్ డిసిపిగా ఎస్.శేషాద్రినిరెడ్డి, మల్కాజ్‌గిరి ట్రాఫిక్ డిసిపిగా కంకనాల రాహుల్ రెడ్డి, ఇక ఫ్యూచర్‌సిటీ ట్రాఫిక్ డిసిపిగా శివమ్ ఉపాధ్యాయ్, అదనపు పోలీసు కమిషనర్ (ట్రాఫిక్)గా జి. చంద్రన దీప్తి, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌ల ట్రాఫిక్ డిసిపిలుగా బి.కె. రాహుల్ హెగ్డే, శేరిలింగంపల్లి జోన్ ట్రాఫిక్ డిసిపిగా జి. రంజన్ రతన్ కుమార్‌లను నియమించారు.

ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా అక్రమ కార్యకలాపాల నియంత్రణకు అభిషేక్ మోహంతీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఐజిగా నియమించారు. అక్రమ ఇసుక రవాణా వంటి అక్రమాలపై ఉక్కుపాదం మోప డం, సహజ వనరుల పరిరక్షణ, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటం ఆయన ప్రధాన బాధ్యతగా ఉండనుంది. యువశక్తి–అనుభవాల సమన్వయంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు ఈ బదిలీలు నిదర్శనంగా భావిస్తున్నారు. పోలీస్ వర్గాల్లో ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారగా, నగర ట్రాఫిక్ నిర్వహణతో పాటు ప్రజాసేవలో స్పష్టమైన మెరుగుదల కనిపిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే, తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో అటు అనుభవానికి, ఇటు యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### బిసి రిజర్వేషన్ల కేసు తేల్చకుండా

## మున్సిపల్ ఎన్నికలకెళ్తే అగ్గిరాజేస్తాం

బిసి జెఎసి చైర్మన్, ఎంపి కృష్ణయ్య హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 రిజర్వేషన్లు కల్పించే అంశంపై హైకోర్టు తీర్పు రాని నేపథ్యంలో మున్సిపల్, జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకెళ్తే రాష్ట్రంలో అగ్గిరాజేస్తామని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన 14 బిసి సంఘాల సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. హైకోర్టులో బిసి రిజర్వేషన్ల కేసు గెలిచే అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయకుండా ఎన్నికలకు తొందరపడటం సరికాదన్నారు. జనాభా లెక్కలు ఉండటం, సుప్రీంకోర్టు ఇడబ్ల్యూఎస్ 10శాతం రిజర్వేషన్లతో 50శాతం సీలింగ్ ఎత్తివేయటం వంటి కారణాల చట్టప్రకారంగా కేసు గెలుస్తుందన్నారు. హైదరాబాద్‌లోని 121 మున్సిపాల్టీల్లో కేవలం 38శాతం రిజర్వేషన్లు కేటాయించి బిసిలకు అన్యాయం చేశారన్నారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఈ సమావేశంలో అనంతయ్య, రాజేందర్, రాందేవ్‌మోదీ పాల్గొన్నారు.

## ఒసి కమిషన్ కోసం ఫిబ్రవరి 27న చలో ఢిల్లీ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఒసి కమిషన్ ఏర్పాటు చేయాలని ఒసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు, రెడ్డి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అప్పమ్మ గారి రాంరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 27న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 10వేల మందితో చేపట్టే ఒసిల మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి జాతీయ ఉపాధ్యక్షులు చందుపట్ల నరసింహరెడ్డి, ప్రధాన కార్యదర్శి గట్టు మహేశ్‌బాబు, ప్రచారకార్యదర్శి గూడూరి స్వామిరెడ్డిలతో కలిసి వారు మహాధర్నా కరపత్రాలు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ కోసం కేటాయించిన బ్యాక్‌లాగ్ పోస్టులను ఇడబ్ల్యూఎస్ వారితోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి ఆదాయ పరిమితిని రూ.10లక్షల వరకు పెంచాలని కోరారు. సమావేశంలో జెఎసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజిరెడ్డి, నేతలు దివాకర్‌రావు, చకిలం రమణయ్య, సింగిరికొండ నర్సింహుల గుప్త, చకిలం రాజు తదితరులు పాల్గొన్నారు.

## 20 నుంచి కాంగ్రెస్ పల్లెబాట

రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విబిజి రామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నాయకత్వంలో పల్లెబాట కార్యక్రమం ఈనెల 20 చేవెళ్ల మండలం ఆలూరు నుంచి ప్రారంభించనున్నారు. ముఖ్య నేతలంతా జనవరి 20 నుండి ఫిబ్రవరి1 వరకు జనం మధ్యే ఉండాలని చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి కేంద్రం వైఖరిని ఎండగట్టాలని ఆయన పేర్కొన్నారు.

## భవిష్యత్తు అంతా బిసిలదే : ఎంపి ఈటల




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రేపటి భవిష్యత్తు బిసిలదే అని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎల్.బి నగర్ లో నిర్వహించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ,కొత్తగా ఎంపికైన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం అలసిపోవద్దు,చరిత్రలో ఏ సామాజిక ఉద్యమాలు ఒక తరంలో విజయం సాధించలేదని గుర్తు చేశారు. బిసి సంఘాలు అనేక సంవత్సరాలుగా కొట్లాడుతున్నాయని చెప్పారు.దాని ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయని తెలిపారు. మన శ్రమ వృధా పోదు.యాభై శాతం పైగా సర్పంచ్ లు గెలిచారు అంటే అది మన పోరాట ఫలితమే అని ఆయన పేర్కొన్నారు. మనం ఎంత ఐక్యంగా,మేధా సంపత్తితో ఉంటే మేము అంత గట్టిగా కొట్లాడే అవకాశం ఉంటుందన్నారు. మీరు స్ట్రాంగా లేకపోతే మేము కూడా కొట్టుకుపోతాం.మేము లైన్ దాటకుండా,మాలో ధైర్యం చెడిపోకుండా ఉంచే శక్తి మీ ఐక్యతలో మాత్రమే ఉంటుందన్నారు.రేపటి భవిష్యత్తు బిసి లదే అని ఎంపి ఈటల రాజేందర్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్, రిటైర్డ్ ఐఎఎస్ టి. చిరంజీవులు,బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్, సీనియర్ హైకోర్టు అడ్వకేట్ రాపోలు భాస్కర్,ఎర్ర మాద వెంకన్న నేత,మత్స్య సుధాకర్ రావు,వేముల బాలరాజ్, మేడం రామకృష్ణ, ఎల్బీనగర్ బి జెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సామ రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలన్నదే సంకల్పం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిస్వార్థంగా సేవ చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తూరు మండలం తిమ్మాపూర్ గ్రామం నుండి నానాజీపూర్ మీదుగా గూడూరు వరకు వేయనున్న బిటి రోడ్డు నిర్మాణానికి రూ.5.75కోట్లు, కేశంపేట మండలం పాటిగడ్డ వంతెన నిర్మాణానికి రూ.2.25కోట్లు, కొందుర్గు మండలం ఆగిర్యాల ఎస్సీ కాలనీ నుండి కొల్లూరు వరకు నిర్మించనున్న బిటి రోడ్డుకు రూ.2కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటిలోని వార్డుల్లో సిసి రోడ్లు, పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.2.90కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా మున్సిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, రఘు, బస్వం, అందె మోహన్, విశ్వం, ముబారక్, రాజేష్ గౌడ్, అనిల్, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, వీరేశం, జంగ నర్సింహులు, సర్పంచులు అఖిల్, భాస్కర్ గౌడ్, రాందాస్ పాల్గొన్నారు.

### వాహనాల చలాన్లకు

## బ్యాంక్ ఖాతా జతచేయడం సరికాదు

**ప్రజాపక్షం/కేశంపేట:** వాహనాల చలాన్లకు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాను జతచేయడం ఎంతవరకు సమంజసమని బిజెపి సంస్కృతిక శాఖ జిల్లా కో కన్వీనర్ కరెడ్ల నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం కేశంపేట మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరెడ్ల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలాంటి పనులు చేయడం సరైన పద్ధతి కాదని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# శతాబ్ది ఉత్సవాలకు తరలివెళ్లిన ఎర్రసైన్యం






**ప్రజాపక్షం/కొందుర్గు:** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన సభకు కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల నుండి సిపిఐ కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలుస్తూ అనేక ఉద్యమాలు చేసి హక్కులను సాధించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి బాగళ్ల నరసింహ్, సహాయకార్యదర్శి సి.సురేష్, జిల్లేడు చౌదరిగూడ మండల సహాయ కార్యదర్శులు బాలరాజ్, ఎండి షబ్బీర్, నాయకులు భీమయ్య, రాములు, వీరేష్, యాదయ్య, జంగయ్య, లింగమయ్య, అనంత, మంజుల, లక్ష్మమ్మ, నరసమ్మ, భూపాల్ తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

**సరూర్‌నగర్:** ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల ముగింపు సభకు బయలుదేరిన వాహనాలను సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ్ జెండా ఊపి ప్రారంభించారు. భగత్‌సింగ్‌నగర్, ఎన్‌టిఆర్‌నగర్, శంకర్‌నగర్, ఎల్‌బినగర్, హస్తినాపురం, భూపేష్‌గుప్తానగర్ నుండి సిపిఐ శ్రేణులు తరలివెళ్ళారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతికుమార్, నాయకులు జిల్లాల కృష్ణ, సక్రూనాయక్, మహబూబ్, సరూర్‌నగర్ ఎఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి వినోద్, ఉషా పాల్గొన్నారు.

**తుర్కయంజాల్:** ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు సభకు. తుర్కయంజాల్ డివిజన్, తొర్రూర్ డివిజన్‌ల నుంచి సిపిఐ రైతుసంఘం అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు ఏర్పాటుచేశారు. సభకు బయలుదేరిన ఆ బస్సును తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన 22వ వార్డు మాజీ కౌన్సిలర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య జెండా ఊపి ప్రారంభించారు. సభ నిర్వహణకు సహకారంగా కొశికె ఐలయ్య రూ.51,000 విరాళాన్ని సిపిఐ రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డికి అందజేశారు

సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు సిపిఐ తుర్కయంజాల్ కార్యదర్శి అనంతుల కాటంరాజు గౌడ్ అధ్యక్షతన బయలుదేరిన వాహనాలకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శివకుమార్‌గౌడ్, సిపిఐ తుర్కయంజాల్ ఆదిభట్ల సర్కిల్ నాయకులు అనురాధ, శివప్రసాదు, రోజా, విజయ, దుబ్బ యాదయ్య, బబ్బురి కృష్ణయ్య, నారాయణ, శ్రీకాంత్, నాగేశ్వర్, సుందరమ్మ, నీలా, లక్ష్మి, జనార్ధన్, శీనుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.








## ఖమ్మం బహిరంగ సభకు మేడిపల్లి సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** జిహెచ్ఎంసి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి మండలం నుంచి సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగే సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున తలరి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు విబి.బాలరాజు, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు సిహెచ్.మాధవి, దండు రమేష్, కె.ప్రమీల, కె.మహాలక్ష్మి, జి.నాగరాజు, కనకయ్య, బి.ఐలయ్య, బాపు రాజు, రమాతర, నర్సమ్మ, భారతి, ఇస్తారి, దండుమదర్, కస్తూరి ప్రభాకర్, ఉపేందర్, సైదమ్మ, గణేష్ పి.ఆండాలు, సరిత, రాజ రాజమ్మ, సాత్విక్ పాల్గొన్నారు.




## శతాబ్ది సభకు తరలిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతాబ్ది వందేళ్ళ భారీ బహిరంగ సభకు సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర ఆధ్వర్యంలో ఘట్‌కేసర్, పోచారం జిహెచ్ఎంసి పరిధి నేతలు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో ఎర్రజెండాలు పట్టుకొని సిపిఐ జిందాబాద్, ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో సదాశివ, మురళి, చౌదరి, శ్యామ్ బాబు, శ్రీను,ఎం రామచంద్రయ్య, వెంకటస్వామి, శివలింగం, చెన్నయ్య, ఎం.కృష్ణ, వెంకట్, సువర్ణ, రామ్‌కుమార్ రామ్‌చంద్రర్, ఎల్.సరిత, ఎస్.వాణి, శ్రీరామ్, పద్మ, బాల్ నరసింహ, మేరీ తదితరులు పాల్గొన్నారు.



## మూడుచింతలపల్లి మున్సిపల్ సిపిఐ ప్రధాన కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్ ఆధ్వర్యంలో..

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భారత కమ్యూనిస్ట్ పార్టీ తలపెట్టిన శతజయంతి ఉత్సవాలకు మూడుచింతలపల్లి మున్సిపల్ సిపిఐ ప్రధాన కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఆదివారం ఖమ్మం బయల్దేరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటేష్ యాదవ్, కొంపల్లి యాదగిరిగౌడ్, పల్లె యాదగిరి, నర్సింగరావు, ఉడతల ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన దుండిగల్ సర్కిల్ బిజెపి నాయకులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్, దుండిగల్, నాగులూరు, డి పోచంపల్లి, బహదూర్‌పల్లి, మల్లంపేట్ గ్రామాలలోని కన్‌జర్వేషన్ జోన్ ఎత్తి వేయడంలో ప్రత్యేక చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి రాంకీ ప్లాంట్ పర్యటన వచ్చిన సందర్భంగా స్థానిక బిజెపి నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డా.ఎస్.మల్లారెడ్డి మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.విఘ్నేశ్వర్, నాయకులు గోనె మల్లారెడ్డి, ఎంబరి ఆంజనేయులు ముదిరాజ్, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, డి.సీతారాంరెడ్డి, తురాయి భానుగౌడ్, నర్సింగ్‌రావ్, ఆర్.నర్సింహాచారి, ఎ.శ్రీనివాస్ యాదవ్, ఎం.అతీష్ బాబు, ఎం.వెంకటేష్ నాయక్, శివనాయక్, విజయ్ నాయక్, రోహిత్ నాయక్, శ్రీను నాయక్, శంకర్ నాయక్, క్యాసారం రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ అందరివాడు

నత్తి మైసయ్య

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 361వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా ఐద్వా అధ్యక్షురాలు సృజన పాల్గొని అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి ఫలితంగానే భారతీయులందరికీ స్వేచ్ఛ, సమానత్వంతో ఓటు హక్కు హక్కుతోపాటు మహిళలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని, ఆయన త్యాగ ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాలలో మగవారితో సమానంగా రాణిస్తున్నారని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒకరి బాధ్యత అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, రఘు రూపుల మల్లేష్, బండారి సాయి, జై భీమ్ అజయ్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

### మూడు మున్సిపాలిటీల్లో..

# చైర్మన్ పీఠాలు హస్తగతం ఖాయం

మేడ్చల్ జిల్లా అధక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం బి ఫారమ్ ఏ అభ్యర్థికిచ్చినా గెలిపించి తీరాలని, మేడ్చల్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో అన్ని మున్సిపల్ కౌన్సిలర్లను గెలిపించుకుని చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంటామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అలియాబాద్ మున్సిపాలిటీలోని శుభం గార్డెన్‌లో అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ అధ్యక్షతన ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర సర్వే ప్రకారం మూడు మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు కేటాయించడం జరిగిందన్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా రాలేదని నాయకులు నిరుత్సాహం చెందకూడదని బి ఫారమ్ ఇచ్చిన అభ్యర్థుల వెన్నంటి ఉంటూ వారి గెలుపునకు కృషి చేయాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. మేడ్చల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లకు రూ.175కోట్లు కేటాయించామని చెప్పారు. సుమారు రూ.470కోట్లతో నూతనంగా రోడ్లు వేస్తున్నారని చెప్పారు. 82 వేల మందికి ఉచిత కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, పెన్షన్లు, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. కొత్తగా ఏర్పాటైన మూడు మున్సిపాలిటీలకు రూ.45 కోట్లు నిధులను మంజూరు చేసిన ఘనత సిఎం రేవంత్‌దేనని చెప్పారు. పార్టీలో పాత, కొత్త కలయికలో అందరం కలిసి గెలుపే లక్ష్యంగా పనిచేసి మూడు చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుని సిఎం రేవంత్‌కు కానుకగా ఇవ్వాలని సూచించారు. వెన్నుపోటు రాజకీయాలకు దూరంగా ఉండాలని, ఒకవేళ అలాంటి వారు ఉంటే పార్టీకి రాజీనామా చేయాలని చెప్పారు. మాజీ ఎంఎల్ఎ మలిపెద్ది సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో ఉన్న అభ్యర్థులకు ఆర్థికంగా చేయూతనిస్తామని చెప్పారు. సత్తా ఉన్న అభ్యర్థులను రంగంలోకి దించి గెలిపించుకుంటామని బిఆర్ఎస్‌తోనే మనకు పోటీ ఉందని బిజెపి ఎక్కడా లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, మాజీ డిసిసి హరివర్ధన్‌రెడ్డి, హజ్‌కమిటీ మెంబర్ ముజుబుద్దీన్, ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మూడుచింతలపల్లి అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, ఎల్లంపేట అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు మహేందర్‌రెడ్డి, బాలేష్, ఎద్దు నాగేష్, సత్యనారాయణ, సుజాత, నర్మద, శ్యామల, లతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు అన్నివిధాలా ప్రభుత్వ ప్రాధాన్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/పరిగి :** మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా ప్రాధాన్యం కల్పిస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో పరిగి మండలనికి చెందిన 92మంది లబ్ధిదారులకు రూ.9,210,672ల విలువ గల కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం ,మౌలికవసతుల అభివృద్దిని సమాంతరంగా అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు,ఆర్థిక, సమాజిక స్వాలంబనదిశగా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయణం, పరిగి పట్టణంలో 27కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రినూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. మహిళ ఇంటి కలను సాకారం చేసేలా ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహిణులపై భారం తగ్గించే ఉచిత విద్యుత్ పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. పరిగి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## క్రీడలు సోదర భావాన్ని పెంపొందిస్తాయి

**ప్రజాపక్షం/పరిగి :** క్రీడలు సోదర భావాన్ని పెంపొందిస్తాయని నిఖిల్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లాలోని పరిగి మండల పరిధిలోని జాఫర్‌పల్లి గ్రామంలో భాగంగా జాఫర్ పల్లి క్రికెట్ ప్రీమియర్‌లీగ్ సీజన్3కి నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీమ్‌కు క్రికెట్ జెర్సీ టీషర్ట్స్ అందజేశారు. విన్నర్‌గా గెలుపొందిన చెన్నై సుపర్ కింగ్స్ కెప్టెన్ శంకర్ రెడ్డి , రన్నర్స్ రాయల్ చాలెంజర్స్ బెంగులర్ అనిల్‌కుమార్ , మాన్‌ఆఫ ది సిరీస్‌వంశి , మాన్‌ఆఫ్‌దమ్యాంచ్ శంకర్‌రెడ్డికి ,పరిగి ఎస్ఐ మోహన్‌కృష్ణతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ మ్యాచ్ ఏర్పాటు చేయడం జరిగింది. క్రికెట్ ఆడటం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు యువత చేడు అలవట్ల కు పాల్పడకుండా గ్రామాలలో క్రీడలు నిర్వహించడం ఆనందకరమన్నారు. క్రీడల్లో గెలుపుఓటమిలను సమనంగా చూడలన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉంటుందని నఖిల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు ,గ్రామస్తులు పాల్గోన్నారు.



## చూపు లేని జీవితాలలో అక్షరాల వెలుగు నింపిన మహానుభావుడు లూయిా బ్రెయిలీ

ఎమ్మెల్యే కె.పి.వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** చూపు లేని జీవితాలలో అక్షరాల వెలుగు నింపిన మహానుభావుడు లూయిస్ బ్రెయిలీ అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీలో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ నూతన సంవత్సర క్యాలెండర్‌ని వివేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా వారికి ప్రత్యేక భవనం ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి లూయిస్ బ్రెయిలీ కృషి చేశారని అన్నారు. రానున్నో రోజుల్లో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుండి రావాల్సిన ప్రతి సంక్షేమ పథకాన్ని, రాయితీలను, బ్యాక్లాక్ పోస్టులను భర్తీలో అండగా నిలవాలని కోరారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేశ్ రెడ్డి, నేషనల్ షెడరేషన్ ఆఫ్ ద బ్లైండ్ తెలంగాణ రాష్ట్ర బ్రాంచ్ అధ్యక్షులు విసి వీర రాఘవన్, వెల్ఫేర్ అసోసియేషన్ డిసబుల్డ్ అధ్యక్షులు అంజయ్య, సారా ప్రవీన్‌కుమార్ గౌడ్, లూయిస్ బ్రెయిలీ సూరారం అసోసియేషన్ సభ్యులు సత్యం, రాజ్ కాఉమర్, నరేందర్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్, శివాజీ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

* బస్వాపూర్ గ్రామ సర్పంచ్ స్రవంతి శివరాజ్



**ప్రజాపక్షం/బంట్వారం :** మండల పరిధిలో ఉన్న బస్వపూర్ గ్రామానికి చెంది సీత ప్రభు (45) అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి రూ.6,100లు గ్రామ సర్పంచు స్రవంతి శివ రాజ్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఎవరు మరణించిన పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తన వంతుగా అంత్యక్రియల ఖర్చుల కోసం సహాయం ఇవ్వడం జరుగుతుందని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచు ప్రభాకర్, వార్డు సభ్యులు యేసయ్య, జగదీష్, సంతోష, అక్కమ్మ, మరియు మధుసుధన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ‘ప్రజాపక్షం’



**ప్రజాపక్షం/చర్లపల్లి :** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రజాపక్షం దినపత్రిక ముందుంటుందని టిడిపి జిల్లా సీనియర్ నాయకులు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం చర్లపల్లిలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026వ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రుద్రగోని రాంచందర్‌గౌడ్ నాయకులు,రిపోర్టర్ నర్సింగ్‌గౌడ్‌తో కలసి ఆవిష్కరించారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలను ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగీరు సత్యనారాయణగౌడ్, ఆర్ నాథం, కాసుల నందంగౌడ్, సత్యంయాదవ్,బిక్షపతి గౌడ్, సురేష్‌గుప్తా, కొమ్ము ఉపేదర్, బాలకృష్ణగౌడ్, బీరప్ప, గడ్డం కృష్ణ,కె.కుమార్, పి.శ్రీనివాస్,ఆటో గిరి,శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో ఆవిష్కరణ...**

ప్రజా పక్షం జాతీయ దినపత్రిక 2026వ సంవ్సర నూతన క్యాలెండర్‌ను నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి రిపోర్టర్ రుద్రగోని నర్సింగ్‌గౌడ్,నాయకులతో కలసి ఆవిష్కరించారు.ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, టిడిపి అధ్యక్షులు కొండా జంగారెడ్డి,నక్క కిషోర్‌గౌడ్, జలీల్, శ్రీశైలంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని..

# ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్‌టిఆర్

కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత రెడ్డి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వర్గీయ ఎన్‌టిఆర్ అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రగతినగర్ కమాన్ చౌరస్తాలో స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను పార్టీలకు అతీతంగా నిర్వహించారు. తెలుగుదేశం, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయ వర్మ, టిడిపి సీనియర్ నాయకులు కొలన్ నర్సింహారెడ్డి, బిఆర్ఎస్ ఎన్ఎంసి అధ్యక్షుడు వాకలపూడి రంగరాయ ప్రసాద్, ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**చర్లపల్లి :** ఎన్‌టి రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకుని చర్లపలి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాగీరు సత్యనారాయణగౌడ్,బింగి బిక్షపతిగౌడ్,ఆర్ నాధం గౌడ్, కాసుల నందంగౌడ్, సత్యం యాదవ్, కొమ్ము ఉపేందర్, బాలకృష్ణగౌడ్, బీరప్ప, వై.రవికుమార్, గడ్డం కృష్ణ, కె.కుమార్, పి.శ్రీనివాస్, ఆటో గిరి, శ్రీకాంత్‌గౌడ్, నరసింహచారి, రమేష్, సునీల్ పాల్గొన్నారు.

**కుషాయిగూడలో...**ఎన్‌టిఆర్ 30వ వర్ధంతిని పురస్కరించుకుని కుషాయిగూడ బస్టాండ్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్, కొమ్ము ఉపేందర్, బింగి బిక్షపతిగౌడ్, సురేష్‌గుప్తా, నందంగౌడ్, సత్యం యాదవ్, కెకె.రావు, నర్సింహ, రాగీరునాధం గౌడ్, తైదల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

**నాగారం :** నాగారం డివిజన్ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో టిడిపి మాజీ అధ్యక్షులు కొండా జంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టి.రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకుని ముఖ్య అతిథులుగా విచ్చేసినమేడ్చల్ జిల్లా ఆడ్‌హక్ కమిటీ కన్వీనర్ కె.అశోక్‌కుమార్‌గౌడ్,మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కాంటెస్టెంట్ కౌన్సిలర్ కొండ సుజాత, ఇంద్రకీలాద్రి టెంపుల్ కమిటీ సభ్యులు హరికృష్ణ,ఆశాబిందు,ఉమాశంకర్ గౌడ్, దయాకర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**ఘట్‌కేసర్ :** టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి విశ్వ విఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ మాజీ అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద టిడిపి పతాకావిష్కరణ చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించారు. పోచారం మున్సిపల్ మాజీ అధ్యక్షులు సామల జగన్మోహన్ రెడ్డి,వేణుగోపాలరావు,పాటి సురేందర్ రెడ్డి,రాము,శ్రీనివాస్,ఆందోల్ శ్రీనివాస్,మాచర్ల పాండు, అశోక్, భూమయ్య, జనార్ధన్ బాలరాజు, మహేష్,సత్యనారాయణ,నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

# నత్తనడకన రోడ్డుపనులు

## పట్టించుకోని అధికారులు








**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మండలంలోని అక్నాపూర్ నుండి నారేగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. 2022 సంవత్సరంలో శాంక్షన్ అయినా రోడ్డు ఇప్పటికీ పూర్తి కాలేదు. కంకర వేసి మధ్యలోనే పనులు ఆపివేయడంతో కంకర తేలిన రోడ్లపై అతి కష్టం మీద ప్రయాణాలు సాగిస్తున్నారు. పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రతీ పల్లెకు రోడ్డు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పల్లె ప్రజల కష్టాలను పట్టించుకోవడంలేదు. **వివరాల్లోకి వెళ్తే..** నవాబుపేట్ మండలంలోని అక్నాపూర్ నుండి నారేగూడ గ్రామాల మధ్యన కంకర తేలిన రోడ్డుతో ప్రయాణం నరకయాతనగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలు అత్తాపూర్, చించల్‌పేట్ అక్నాపూర్ నుండి శంకపల్లి, హైదరాబాద్‌కు నిత్యం వందల మంది ఉద్యోగులు, గ్రామస్తులు ఉపాధికోసం వెళుతుంటారు. వ్యవసాయ పనులకు రైతులు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నాం**
**రైతు నర్సిములు గౌడ్, అక్నాపూర్**


నాలుగు సంవత్సరాలు గడుసున్నా రోడ్డు పూర్తికావడం లేదు, కంకర పోసి వదిలేశారు. ప్రయాణికులు, రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం ఈ రోడ్డునుండే రాకపోకలు కోనసాగిస్తుంటారు. రోడ్డు కంకరపోసి మధ్యలోనే పనులు ఆపివేయడంతో పలుమార్లు ద్విచక్రవాహనదారులు కిందపడి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును పూర్తి చేయాలి.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
19-01-2026
www.prajapaksham.in

సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జనసేవాదళ్ కార్యకర్తలు ఖమ్మం పుర వీధుల్లో కదం తొక్కారు. ప్రదర్శన రెండు కిలో మీటర్ల మేర ఉండడంతో పెద్ద సంఖ్యలో పౌరులు తిలకించారు. ముఖ్యంగా యువ మహిళల కవాతు ఆకట్టుకుంది. చిన్నారులు కదం తొక్కుతూ లెఫ్ట్ రైట్ అంటూ నడుస్తూ ఉత్తేజాన్ని ఇచ్చారు. పదేళ్ల లోపు బాలలు సైతం ప్రదర్శనలో పాల్గొని భవిష్యత్తు తరం మాదేనంటూ మరో వందేళ్లయినా కమ్యూనిస్టు పార్టీకి ధోకా లేదని తమ కవాతుతో నిరూపించారు.



# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ, ప్రదర్శన దృశ్యాలు






ఫోటోలు
కె.అనిల్‌కుమార్






































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com